Postel No. MBN/08/2016-2018



పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,చర్మవ్యాధులతోపాటు అన్ని రకాల రోగాలకు వనమూలికలతో వైద్యచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరామాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895


# వార్తాతరంగాలు


జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :24 | సంచిక :249 | సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | బుధవారం 31 డిసెంబర్ 2025 | పేజీలు :12 | వేల రూ5 /-




## ఇక టోల్ ఫ్రీ ప్రయాణం..

**నల్గొండ, డిసెంబర్ 30:**తెలుగు రాష్ట్రాల మధ్య అత్యంత రద్దీగా ఉండే హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిపై సంక్రాంతి ప్రయాణాలను సులభతరం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకోబోతోంది. పండుగ రోజుల్లో టోల్‌గేట్ల వద్ద వాహనాలు గంటల తరబడి నిలిచిపోకుండా ఉండేందుకు.. ఆ మూడు నాలుగు రోజుల పాటు టోల్ వసూళ్లను పూర్తిగా నిలిపివేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థకు, కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ - మిగతా3లో

## నిధుల వరద...
# తర్వాత ఎన్నికలు...

**హైదరాబాద్, డిసెంబర్ 30:**తెలంగాణలో రాజకీయ వాతావరణం మరోసారి వేడెక్కనుంది. ఇటీవల ముగిసిన పంచాయతీ ఎన్నికల్లో మంచి ఫలితాలను సాధించిన అధికార కాంగ్రెస్ పార్టీ.. అదే ఉత్సాహంతో రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థలఎన్నికలకు సమరశంఖం పూరిచేందుకు సిద్ధమవుతోంది. విద్యార్థుల వార్షిక పరీక్షల సీజన్ ప్రారంభం కాకముందే.. అంటే ఫిబ్రవరి రెండో వారం నాటికి ఈ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదలగా ఉన్నట్లు తెలిసింది. ఇందుకోసం జనవరి మూడో వారం నాటికి అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ప్రభుత్వం ఇప్పటికే సంకేతాలు పంపింది.రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 120 మున్సిపాలిటీలు, 9 కార్పొరేషన్లకు ఈ ఏడాది జనవరిలోనే గడువు ముగియడంతో ప్రస్తుతం ఇవి ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్నాయి. మరోవైపు.. హైదరాబాద్ , ఖమ్మం, వరంగల్ కార్పొరేషన్ల గడువు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ముగియనుంది. ఈ నేపథ్యంలో గడువు ముగిసిన, ముగియనున్న అన్ని సంస్థలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే.. హైదరాబాద్ నగరాభివృద్ధిపై ప్రత్యేక



దృష్టి సారించిన సర్కార్.. తాజాగా ఓఆర్ఆర్ పరిధిలోని 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రాష్ట్రంలో జీహెచ్ఎంసీతో కలిపి మొత్తం 8 కార్పొరేషన్లు, - మిగతా3లో



## దానం ధైర్యం
# ఏమిటీ..?

**హైదరాబాద్, డిసెంబర్ 30:**తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల అంశం ఇప్పుడు క్లైమాక్స్ దశకు చేరుకుంది. ముఖ్యంగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యవహారం ఒక పొలిటికల్ థ్రిల్లర్‌ను తలపిస్తోంది. సాంకేతిక అంశాల సాకుతో కొందరు ఎమ్మెల్యేలు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నా, దానం నాగేందర్ విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. ఆయన తీసుకున్న నిర్ణయం, ఇప్పుడు ఆయన చేస్తున్న వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.అసెంబ్లీ - మిగతా3లో

# స్త్రీ నిధి పేరుతో యాప్

**హైదరాబాద్, డిసెంబర్ 30:**తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలకు మరింత వేగంగా, సులభతరంగా సేవలు అందించేందుకు టెక్నాలజీని సమర్థవంతంగా ఉపయోగించుకుంటోంది. ప్రజలు తమ మొబైల్ నుంచే అన్నీ సేవలు పొందేలా డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తుంది. ఇటీవల మీ సేవకు వెళ్లాల్సిన అసవరం లేకుండా మీ సేవ యాప్‌ను తీసుకురాగా.. దీని ద్వారానే ప్రజలు ఇన్ కమ్, కులం, రెసిడెన్షియల్ సర్టిఫికేట్ లాంటివి పొందవచ్చు. ఇక రేషన్ కార్డు వివరాలు, డీలర్ వద్ద ఎంత స్టాక్ ఉందనేది తెలుసుకునేందుకు ఇటీవల టీ రేషన్ యాప్ ప్రారంభించింది. అలాగే రైతుల కోసం కొద్దిరోజుల క్రితం యూరియా బుక్ చేసుకునేందుకు యాప్ లాంచ్ చేయగా.. తాజాగా మహిళలకు ఉపయోగపడేలా కొత్త యాప్ తెచ్చింది.మహిళా పొదుపు సంఘాలకు ఆర్థికంగా తోడ్పాటు అందించేందుకు ప్రభుత్వం స్త్రీ నిధి పేరుతో రుణాలు మంజూరు




చేస్తోన్న విషయం తెలిసిదే. ఈ రుణాలను సులువుగా పొందేలా మన స్త్రీనిధి పేరుతో యాప్ - మిగతా3లో

## అధికారులు
# స్మార్ట్ గవర్నెన్స్‌కు మారాలి..

### సీఎం రేవంత్ దిశానిర్దేశం

**హైదరాబాద్, డిసెంబరు 30 :** జోనల్ కమిషనర్లు ప్రతీ రోజు ఫీల్డ్‌లో ఉండాల్సిందేనని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ ఏరియాను ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసుకోవాలనే తెలంగాణ రైజింగ్ – 2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసుకున్నామని వ్యాఖ్యానించారు. ఇవాళ(మంగళవారం) కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలమెంట్ విభాగం అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్‌రంజన్, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమీక్షలో కొత్త జోనల్



కమిషనర్లకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. క్యూర్ పరిధిలోని సిటీని 12 జోన్లు, 60 - మిగతా3లో

## అక్రిడిటేషన్, మీడియా కార్డులకు
# ఎలాంటి తేడా లేదు...

### ఆందోళన వద్దు, మీతో నేనున్నా...
### డెస్క్ జర్నలిస్టులకు మంత్రి పొంగులేటి హామీ...



**హైదరాబాద్ :–**అక్రిడిటేషన్ కార్డులకు, మీడియా కార్డులకు ఎలాంటి తేడా లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ పరంగా అక్రిడిటేషన్ కార్డుదారులకు వర్తించే ప్రతి ప్రయోజనం మీడియా కార్డు దారులకు కూడా వర్తిస్తుందని ఈ విషయంలో డెస్క్ జర్నలిస్టులు ఎలాంటి అపోహలకు గురికావద్దని జీవో 252లో మార్పులు చేసి లిఖితపూర్వకంగా ఇస్తామని హామీ ఇచ్చారు. మంగళవారం నాడు సచివాలయంలో తనను కలిసిన టీడబ్ల్యు జేఎఫ్, డెస్క్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ప్రతినిధులతో మంత్రి వివిధ అంశాలపై చర్చించి వారి సందేహాలను తీర్చారు. కొంతమంది అపోహలకు గురిచేసే ప్రయత్నం చేస్తున్నారు. మీరు వాటిని నమ్మకండి. ఎలాంటి పక్షపాతం లేదు. మీరెవరూ ఆందోళన చెందొద్దు. మీతో నేనున్నాను. రెండు విభాగాలుగా చూడాలన్న ఆలోచన కాదు. ప్రభుత్వ పరంగా అన్ని సంక్షేమ పథకాలను వర్తింపచేస్తాం. అర్హులైన, నిజమైన జర్నలిస్ట్‌లకు మేలు చేయాలన్న సంకల్పం, సదుద్దేశంతో తీసుకున్న నిర్ణయం. తెలంగాణ రాష్ట్రంలో మినహా దేశంలో ఇంత పెద్దమొత్తంలో అక్రిడిటేషన్ కార్డులు ఇస్తున్న రాష్ట్రం మరొకటి లేదు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే రాష్ట్రంలోని అన్ని జర్నలిస్ట్ సంఘాలతో సమావేశం నిర్వహిస్తామని ఆ సమావేశానికి డెస్క్ జర్నలిస్ట్‌లను కూడా ఆహ్వానిస్తామని అందరి అభిప్రాయాలను, సలహాలను సూచనలను తీసుకొని జర్నలిస్ట్‌లకు మరింత ప్రయోజనం చేకూరే విధంగా జీవో 252లో మార్పులు, చేర్పులు చేస్తామని హామీ ఇచ్చారు. టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు బి. రాజశేఖర్, గండ్ర నవీన్ ఆధ్వర్యంలో మంత్రిని కలిసిన వారిలో ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉపేందర్, మస్తాన్, నాయకులు నిస్సార్, విజయ, రాజారాం, స్పోర్ట్స్ జర్నలిస్ట్ అసోసియేషన్ నాయకులు కృష్ణ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# అదుపులోనే శాంతి భద్రతలు....

### వార్షిక నివేదిక విడుదల చేసిన డీజీపీ

**హైదరాబాద్, డిసెంబర్ 30:** తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులోనే ఉన్నాయని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. మంగళవారం నాడు 2025 వార్షిక నివేదికను డీజీపీ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది పండుగల బందోబస్తు పటిష్టంగా చేశామన్నారు. ఫ్యూచర్ సిటీలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ విజయవంతంగా భద్రతాపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. మిస్ వరల్డ్ ఈవెంట్ కూడా దిగ్విజయంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరుపుకున్నామని చెప్పారు. గ్రామపంచాయతీ ఎన్నికలు మూడు విడతలు కూడా శాంతి భద్రతలు కాపీ ఎలక్షన్స్ అన్ని నిష్పక్షపాతంగా జరిగేలా



కాపాడామని డీజీపీ అన్నారు.

**మహిళా పోలీసులు భేష్..**

తెలంగాణలో 509 మంది నక్సల్స్ లొంగిపోయారని.. వారిలో 481 మంది ఛత్తీస్‌గఢ్, 21 మంది తెలంగాణ, ఒకరు మహారాష్ట్ర, ఒకరు ఏపీ నక్సల్స్ ఉన్నారన్నారు. నాలుగు నేషనల్ లోక్ అదాలత్, 1 స్పెషల్ అదాలత్ నిర్వహించమన్నారు. 7 లక్షల కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించామని చెప్పారు. పోలీస్ శాఖను హైకోర్టు అభినందించిందని వెల్లడించారు. మూడు అంతర్జాతీయ ఈవెంట్స్ సక్సస్ ఫుల్‌గా నిర్వహించుకున్నామని తెలిపారు. తెలంగాణలో మహిళా పోలీసుల అధికారులు బాగా పనిచేస్తున్నారని కొనియాడారు. సీఐడీ చీఫ్, ఏసీబీ డీజీ చారు సిన్హా , తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ - మిగతా3లో

## ఎయిర్ పోర్టుకు
# అంతా రెడీ...

**వరంగల్, డిసెంబర్ 30:**దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వరంగల్ మామునూరు విమానాశ్రయ పునరుద్ధరణ పనులు వేగవంతమయ్యాయి ఏఏఐ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి భూములను పరిశీలించారు. ప్రభుత్వం ఇప్పటికే 253 ఎకరాల ప్రైవేటు భూమిని సేకరించి, రూ. 295 కోట్ల పరిహారాన్ని రైతులకు అందజేసింది. దీంతో మొత్తం భూసేకరణ ప్రక్రియ పూర్తయ్యింది. జనవరి 2026లో ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి భూమి పూజ నిర్వహించే అవకాశం ఉంది. 2027 చివరి నాటికి విమాన సర్వీసులు ప్రారంభించడమే లక్ష్యంగా పనులు సాగుతున్నాయి. అయోధ్య, కొచ్చిన్ విమానాశ్రయాల తరహాలో దీనిని అత్యంత




ఆధునికంగా తీర్చిదిద్దనున్నారు.తెలంగాణ - మిగతా3లో

## బీఆర్ఎస్ నేతలతో
# కేసీఆర్ భేటీ..

**హైదరాబాద్, డిసెంబర్ 30:** బీఆర్ఎస్ నేతలతో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈరోజు (మంగళవారం) సమావేశమయ్యారు. నందినగర్ నివాసంలో జరిగిన ఈ భేటీలో మాజీ మంత్రులు కేటీఆర్ , హరీష్ రావు , పలువురు బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.



అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై నేతలకు గులాబీ బాస్ దిశానిర్దేశం చేశారు. తెలంగాణలో తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. ప్రధానంగా పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు సంబంధించి అసెంబ్లీ వేదికగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎండగట్టాలన్నదే బీఆర్ఎస్ వ్యూహం.ఇందులో భాగంగానే ఈ అసెంబ్లీ సమావేశాలను పూర్తిగా ఉపయోగించుకోవాలని బీఆర్ఎస్ పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే - మిగతా3లో

## సంపాదకీయం

# ప్రజాస్వామ్యం పరిఢవిల్లేనా?

ప్రజాస్వామ్య సౌధం నాలుగు స్తంభాలపై నిలిచి ఉంది. చట్టసభలు, కార్యనిర్వాహక శాఖ, న్యాయ వ్యవస, మీడియా. ఈ నాలుగు స్తంభాలలో ముఖ్యమైన చట్టసభలకు ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు జరపవలసిన బాధ్యత ఎన్నికల కమిషన్, ప్రభుత్వాలదే. ముఖ్యంగా లోక్‌సభ శాసనసభలకు ఐదేళ్లకొకసారి లేదా కాస్త ముందుగా గాని ఎన్నికలు నిర్వహిస్తుండగా మిగిలిన స్థానిక సంస్థలను నిర్లక్ష్యం చేస్తూ నిర్వీర్యం చేస్తున్నారు. ఐదేళ్లు నిండిన తర్వాత వీటికి ప్రత్యేక అధికారులు నియమించి పాలన సాగిస్తున్నారే కానీ ఏదో ఒక కుంటిసాకుతో వాటికి ఎన్నికలు జరపడం లేదు. ఫలితంగా వాటికి రావలసిన కేంద్ర నిధులు విడుదల కాక అభివృద్ధి పడకేస్తున్న పరిస్థితి నెలకొంది. ఎన్నికలంటే రాజకీయ పార్టీలకు ఎక్కడలేని ఉత్సాహం వస్తుంది. ఏదో విధంగా అబద్ధపు ప్రచారాల తోనూ, అలవికాని హామీలతోనూ ఓటర్లను ఆకర్షించవచ్చు. తమ ఓటు షేర్ పెంచుకునే ప్రయత్నం చేయవచ్చు. అధికార పక్షం బలప్రదర్శనకు, అంతో ఇంతో అధికార దుర్వినియోగానికి మంచి అవకాశం. కాగా ప్రతిపక్షాలకు విమర్శల బాణాలు సంధించడానికి, అధికార పక్షాన్ని ఇరుకున పెట్టే దానికి సువర్ణ అవకాశం. పోటీ చేసే అభ్యర్థులకు నోటిఫికేషన్ విడుదలైన నాటి నుండి ఫలితాల ప్రకటన వరకు గొప్ప టెన్షన్. తెగించి ఖర్చు చేస్తున్నా అందుకు అనుకూలమైన ఫలితం వస్తుందో లేదో అన్న ఆందోళన వారిని ఆవహించి ఉంటుంది. ఎన్నికల కమిషన్ కంటపడకుండా ఖర్చు చేయాలి. అందరినీ 'సంతృప్తి' పరచుకుంటూ పోవడం అతడికి అత్యవసరం. ఈ మహా ప్రక్రియలో చివరి బకరా ఓటరు. ఆశించి భంగపడటం అతడి నైజం. అందుకే ఈ మధ్య అభివృద్ధి జరుగుతుందని, తమ జీవితాలు బాగుపడతాయని సగటు ఓటరు విశ్వసించడం లేదు. ఎన్నికల సమయంలో అభ్యర్థులు ఇచ్చే సొమ్మునే ఆశిస్తున్నాడు, దానికి ఆశపడుతున్నాడు. మన వ్యవస్థలో ఎన్నికల అక్రమాలు, నిబంధనల అతిక్రమణ గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. పోటీ అభ్యర్థులను బెదిరించడం, లొంగదీసుకునే ప్రయత్నం చేయడం, కొంతమంది అభ్యర్థులతో లోపాయకారి ఒప్పందాలు నేటి ఎన్నికల ప్రక్రియలో భాగమయ్యాయి. ముఖ్యంగా ఎన్నికల ముందు రోజు జరిగే అక్రమాలకు, దుర్మార్గాలకు అంతులేకుండాపోయింది. పోలింగ్‌నాడు కూడా ఓటరుకు తన ఓటు తాను వేసేంతవరకు నమ్మకం లేదు. అంటే ప్రతిచోట ఎన్నికల ప్రక్రియ అపహాస్యం అవుతుండగా ప్రజాస్వామ్యంపై విశ్వాసం సన్నగిల్లుతున్నది. ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా మారుతున్నది. జాతీయ స్థాయిలో కార్పొరేట్లు తమకు అనుకూలమైన ప్రభుత్వాల కోసం వందల వేల కోట్లు పార్టీలకు విరాళాలు ఇస్తూ ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తున్నాయి. గతంలో పెద్ద పదవులకు అంటే ఎంపి, ఎంఎల్‌ఎ లాంటి వాటికి విదేశాలలో ఉన్న వారు సైతం దేశానికి వచ్చి ఏదో ఒక పార్టీ టికెట్ సంపాదించి పోటీ చేయడం పదవులు అనుభవించడం మనకు అనుభవమే. ఈసారి సర్పంచ్ ఎన్నికలకు అభ్యర్థులు విదేశాల నుండి 'దిగుమతి' అవుతున్నారు. కొంతమంది తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి లేదా పదవి విరమణ చేసి మరీ ఈ సర్పంచ్ ఎన్నికలలో పోటీ చేశారు. అంటే వారికి 'సేవా తత్పరత' ఎక్కువవుతున్నది. మాతృభూమిని అభివృద్ధి చేయడానికి కంకణం కట్టుకున్నట్లు వారు చెప్పుకోవడం సంతోషమే. కానీ అది ఐదేళ్ల తర్వాత ఆ గ్రామ ప్రజలు ఇవ్వవలసిన తీర్పు మాత్రమే. మన దగ్గర మహిళా అభ్యర్థులు పదవులకు ఎంపికైనా కానీ వారి 'మగమహారాజు'లే పరిపాలిస్తుంటారు. అనధికార పరిపాలకులుగా చలామణి అవుతుంటారు. పదవులు మహిళలకు, అధికారాలు వారి భర్తలకు. కొన్ని సందర్భాలలో సమావేశాలకు సైతం వారి భర్తలే హాజరై చర్చల్లో పాల్గొంటూ నిర్ణయాత్మక శక్తిగా వ్యవహరించడం శోచనీయం. మాటల్లోని మహిళాభ్యున్నతి గడప దాటడం లేదు. తరతరాలుగా జీర్ణించుకొని పోయిన పురుషాధిక్యం సమాజంలో మహిళలకు అడుగడుగునా ఆటంకాలు ఏర్పరచుతూ తమ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూనే ఉంది. కొన్నిచోట్ల దళిత గిరిజన సర్పంచులపై ఆ గ్రామంలోని ఆధిపత్య కులాలు తమ పెత్తనం చెలాయిస్తుండటం చూస్తూనే ఉన్నాం. కొంతమంది మంత్రులు, ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రులు తమ నియోజకవర్గం అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ ఇతర నియోజకవర్గాలను చిన్నచూపు చూస్తారు లేదా నిర్లక్ష్యం చేస్తారు. వీరు రాష్ట్రం మొత్తానికి లేదా దేశం మొత్తానికి బాధ్యులు అనే విషయం మరవడం బాధాకరం. పదవి స్వీకారం నాడు ఏ వ్యక్తికి, ప్రాంతానికి అనుచితంగా లేదా పక్షపాతంతో వ్యవహరించబోమని దైవసాక్షిగా ప్రమాణం చేస్తారు. ప్రజలు ప్రశ్నించడం మానుకున్నారు. ప్రశ్నించిన వాడి ఉనికి ప్రశ్నార్థకమవుతున్నది. అందుకే అవినీతికి అంతులేకుండా పోతున్నది. న్యాయం అందడానికి, పొందడానికి కాలము, డబ్బు ఖర్చవుతున్నాయి. సామాన్యుడి సహనానికి పరీక్షగా మారింది. రాజకీయాలలో డబ్బు జోక్యం ఎక్కువైంది. అందుకే గతంలో లాయర్లు, డాక్టర్లు, ఉపాధ్యాయులు, మేధావులు, సంఘ సంస్కర్తలు రాజకీయాలు నడపగా నేడు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, మద్యం వ్యాపారులు, నేరచరితులు రాజకీయాలను ఆక్రమించారు, విలువలను పాతరేశారు. ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు కూడా రాజకీయాల పట్ల ఆకర్షితులవుతున్నారే కానీ వాటిని ప్రక్షాళన చేయలేకపోతున్నారు. అందులో విజయం సాధించలేకపోతున్నారు. రేపటి తరానికి దిశానిర్దేశం చేయలేకపోతున్నారు. రాజకీయ నాయకులకు, ఉద్యోగులకు లాగా ఒక నిర్దిష్టమైన అర్హత లేకపోవడం ఈ వ్యవస్థ దురదృష్టం. ఓటుకు ఈసారి గిరాకీ మరీ పెరిగింది. దూరతీరాలలో ఉన్న వారు సైతం తమ సొంత ఊరుకొచ్చి ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు అభ్యర్థుల ఖర్చుతో. ఒక పెద్ద మనిషి ప్రత్యేకించి విదేశాల నుండి విమానంలో విచ్చేసి తన హక్కును కాపాడుకొని ఓటు విలువ తెలియజేశాడు. నిన్నమొన్నటి ఎన్నికలలో ఒకచోట ఒక ఓటు విలువ 40 వేలు పలికినట్లుగా చదివాం. కొన్ని చోట్ల కోట్లు చేతులు మారుతున్నట్టుగా చదువుతున్నాం. అంతో ఇంతో ఈ దేశంలో ఎన్నికల సంస్కరణలకు శ్రీకారం చుట్టిన టిఎన్ శేషన్ సదాస్మరణీయుడు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ దేశంలో జిల్లాకు ఒక శేషన్ కూడా సరిపోడేమో! ఆ పిల్లిమెడలో గంటకట్టేది ఎవరో? ఆశగా ఎదురు చూద్దాం. ఇక గ్రామాల్లో శాంతి నెలకొంటుందని, అవి అభివృద్ధి పథంలో సాగుతాయని కోరుకుందాం.

# నేడు ఆర్.నారాయణ మూర్తి జన్మదినం

## పీపుల్స్ స్టార్, విప్లవ సినిమాల నిర్మాత, దర్శకుడు,గొప్ప నటుడు ఆర్.నారాయణ మూర్తి

పీపుల్స్ స్టార్, విప్లవ సినిమాల నిర్మాత, దర్శకుడు,గొప్ప నటుడి గా సుపరిచితుడైన ఆర్. నారాయణ మూర్తి తూర్పుగోదావరి జిల్లా రౌతులపూడి మండలంలోని మల్లంపేట గ్రామంలో ఒక పేదరైతు కుటుంబంలో డిసెంబర్ 31, 1953లో జన్మించాడు.అమ్మ పేరు రెడ్డి చిట్టెమ్మ, నాన్న పేరు రెడ్డి చిన్నయ్య నాయడు. వీరిది అతి సాధారణ రైతు కుటుంబం. రౌతులపూడిలో 5వ తరగతి వరకు చదివాడు. రౌతులపూడిలో ఒక సినిమా థియేటర్ ఉండేది. చిన్నతనం నుండి సినిమాలలో ఆసక్తితో ఎన్టీయార్, నాగేశ్వరరావుల సినిమాలు చూసి, విరామ సమయంలో వారిని అనుకరించేవాడు. అక్కడే తన నటనా జీవితానికి పునాది పడిందని చెప్పుకున్నాడు. శంఖవరంలో ఉన్నత పాఠశాలలో చేరాడు. అక్కడే నారాయణమూర్తికి సామాజిక స్పృహ కలిగింది. సామాన్య ప్రజలకు జరిగే అన్యాయాలను గమనించి, విప్లవ ఉద్యమాలవైపు ఆకర్షితుడయ్యాడు. పెద్దాపురంశ్రీ రాజ వత్సవాయి బుచ్చి సీతయ్యమ్మ జగపతి బహద్దర్ మహారాణి కళాశాలలో బి.ఏ చదవడానికి చేరాడు. అక్కడ రాజకీయాలతో ప్రభావితుడై, సినిమాలు, రాజకీయాలు, సామాజిక బాధ్యత అనే మూడు వ్యాసంగాలపై ఇష్టాన్ని ఏర్పరచుకున్నాడు. కళాశాల ఈయన విద్యార్థిసంఘానికి అధ్యక్షుడిగానే కాకుండా కళాశాల లలిత కళల విభాగానికి కార్యదర్శిగా కూడా ఉన్నాడు. అంతేకాక తను ఉంటున్న ప్రభుత్వ హాస్టలు యొక్క విద్యార్థి అధ్యక్షునిగానూ, పేద విద్యార్థుల నిధి సంఘానికి కార్యదర్శి గానూ పనిచేశాడు. స్థానిక రిక్షా కార్మికులు ఈయనను మద్దతుకోసం సంప్రదించేవారు. నారాయణమూర్తి పట్టణ రిక్షాసంఘం అధ్యక్షుడుగా కూడా ఉన్నాడు. ఎమర్జెన్సీ కాలంలో క్రియాశీలకంగా పనిచేస్తున్నందు వలన పోలీసులు ఈయన్ను తీసుకునివెళ్ళి విచారణ కూడా చేశారు. అంతేకాక నారాయణమూర్తి సినిమా నటి మంజులతో ఒక ప్రదర్శన ఏర్పాటు చేయించి నూతన కళాశాల నిర్మాణానికి నిధుల సేకరణ ప్రారంభించాడు. అప్పట్లో బీహార్లో వరదసహాయానికి తగిన విధంగా తోడ్పాడ్డాడు. సహవిద్యార్థులు నారాయణమూర్తిని కాలేజీ అన్నగా వ్యవహరించేవారు. ఇతడిలోని కళాతృష్ణని ఎలా కనిపెట్ట గలిగారో కానీ పరిచయం కాగానే రమేష్ బాబు హీరోగా ఆయన తీస్తున్న నీడ చిత్రంలో ఇతడికి ప్రాధాన్యత ఉన్న వేషాన్నిచ్చారు. ఆ సినిమాలో నారాయణమూర్తి కొంత ప్రాధాన్యత ఉన్న నక్సలైటు పాత్ర లభించింది. సినిమా బాగా విజయవంతమై, నారాయణమూర్తి మద్రాసులోని చోళ హోటల్లో కరుణానిధి చేతులపై వంద రోజుల షీల్డు అందుకున్నాడు. ఆ తరువాత దాసరి, రామానాయుడు, జ్యోతి శేఖరబాబు వంటి దర్శకుల ప్రోత్సాహంతో అనేక సినిమాలలో సహాయపాత్రలలో నటించాడు. దాసరి నారాయణరావు దర్శకత్వంలో నారాయణమూర్తి పూర్తిస్థాయి హీరోగా సంగీత అనే సినిమా తీశాడు. ఈ చిత్రాన్ని పూర్ణాపిక్చర్స్ పతాకంపై హరగోపాల్ నిర్మించాడు. అందులో రెండు పాటలను ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం పాడాడు. చిత్రం ఒక మోస్తరు విజయం సాధించి 50 రోజులపాటు ఆడింది. అయితే ఆ తర్వాత హీరోగా అవకాశాలు రాలేదు, చిన్నవేషాలకు కూడా తీసుకోక బాగా కష్టాలను ఎదుర్కొన్నాడు. తిండికి కూడా డబ్బులు లేని పరిస్థితి ఏర్పడింది. ఆ సమయంలోనే హీరో అవ్వాలంటే మొదట దర్శకునిగా నిలదొక్కుకోవాలని అనుకున్నాడు. దర్శకునిగా పూర్వానుభవం లేకపోవటం వలన, ఎవరూ సినిమా తీసే అవకాశం ఇవ్వలేదు.



షూటింగులు ఉన్నప్పుడల్లా దాసరి పనితీరును గమనిస్తూ ఉండేవాడు. దర్శకునిగా తనకు తాను అవకాశమిచ్చుకోవటానికి తనే నిర్మాత అయితే కానీ కుదరదని గ్రహించి, స్నేహితులకు తన ఆశయం తెలియజేయగా, వాళ్లు కొంతమంది నారాయణమూర్తి సినిమా నిర్మించడానికి సహాయం చేశారు. అందుకే తన బ్యానరుకు "స్నేహ చిత్ర" అని పేరు పెట్టుకున్నాడు. భారత-రష్యా స్నేహ కరచాలనాన్ని చిహ్నంగా ఎంచుకున్నాడు. నారాయణమూర్తి నిర్మాత, దర్శకుడిగా తన మొదటి సినిమా అర్ధరాత్రి స్వతంత్రం చిత్రీకరణను 1984 జూన్ 10న రంపచోడవరంలో ప్రారంభించాడు. ఆ సినిమా పదహారున్నర లక్షల పెట్టుబడితో పూర్తయింది. సెన్సారుతో వచ్చిన చిక్కులను కొంతమంది వ్యక్తుల సహకారంతో అధిగమించి సినిమాను 1986, నవంబరు 6, టి.కృష్ణ వర్ధంతి రోజున విడుదల చేశాడు. ఆ సినిమాలోనారాయణమూర్తి ఒక నక్సలైటు పాత్రను పోషించాడు. ఈ సినిమా ఊహించినంతగా విజయవంతమై చరిత్ర సృష్టించింది. ఈ సినిమా విజయవంతమవటానికి వంగపండు ప్రసాదరావు వ్రాసిన పాటలు, పి.ఎల్.నారాయణ సంభాషణలు, నారాయణమూర్తి కథ, చిత్రానువాదము, దర్శకత్వం ఎంతగానో దోహదం చేశాయి. నారాయణమూర్తి సినిమాలన్నీ సమకాలీన సామాజిక సమస్యలు ఇతివృత్తంగా తీసినవే. ఈయన చిత్రీకరించిన సినిమాల్లో నిరుద్యోగం, ప్రపంచ బ్యాంకు విధానాలు, డబ్ల్యూటీవో ఒప్పందం, తృతీయ దేశాల సమస్యలు, పర్యావరణ సమస్యలు, ఆనకట్టలు, నిర్వాసితుల సమస్యలు, భూ సమస్యలు, రాజకీయ అతలాకుతలాలు మొదలైనటువంటి వాటికి అద్దంపట్టాడు. అందువలన బాధిత ప్రజలు ఈయన సినిమాలలోని పాత్రలలో మమేకమైపోయేవారు.ఆ తరువాత వచ్చిన సినిమాలలో దండోరా సినిమా సారా వ్యతిరేక ఉద్యమం చేపట్టడానికి మహిళలకు స్ఫూర్తినిచ్చింది. ఎర్రసైన్యం భూపోరాటానికి అజ్యం పోసింది. చుండూరు సంఘటనను చిత్రీకరించిన లాల్ సలాం పెద్ద ఎత్తున కలకలం రేపింది. ఆ సినిమా తీసినందుకు పోలీసులు నారాయణమూర్తిని విచారణ చేశారు. కొన్నాళ్ళు ఆ సినిమాను నిషేధించారు కూడాను. నారాయణమూర్తి సినిమాల్లో ద్వంద్వార్థ సంభాషణలు, పెద్ద పెద్ద సెట్టింగులు, పేరుమోసిన నటీనటవర్గం, ప్రత్యేక హాస్య సన్నివేశాలు, యుగళగీతాలు మొదలైనవి ఉండవు. వాస్తవ సమస్యలను చిత్రీకరించి సామాన్యప్రజల మనసులను ఆకట్టుకోవటం మీదే ఆధారపడిన సినిమాలవి. 2009 మార్చి వరకు నారాయణమూర్తి కథానాయకునిగా నటించిన 26 సినిమాలలో 10 సినిమాలు విజయవంతమయ్యాయి. అవి విడుదలైన క్రమంలో - అర్ధరాత్రి స్వతంత్రం, అడవి దీవిటీలు, లాల్‌సలాం, దండోరా, ఎర్రసైన్యం, చీమలదండు, దళం, చీకటి సూర్యులు, ఊరు మనదిరా, వేగుచుక్కలు.

నారాయణమూర్తి ఏ ఆడంబరాలు లేకుండా సాధారణ జీవితం గడపటానికి ఇష్టపడతాడు. అవివాహితుడైన నారాయణమూర్తిని ఎందుకు పెళ్ళిచేసుకోలేదని ఎవరో గతంలో ప్రశ్నిస్తే, అదంత చర్చించదగ్గ అంతర్జాతీయ సమస్యేమీకాదని దాటవేశాడు. తన జీవిత భాగస్వామి తన ప్రజాజీవితానికి ఎక్కడ అడ్డువస్తుందో అనే అనుమానంతో పెళ్ళి చేసుకోలేదట. సినీ దర్శకనిర్మాతగా 19 సినిమాలను తీసి, 25 సినిమాలలో నటించి ఎంతో ఎత్తుకు ఎదిగినప్పటికీ, ఈయనకు సొంత ఇల్లు కానీ, సొంత కారు కానీ లేవు. ఈయనకు తెలుగుదేశం పార్టీ రెండుసార్లు కాకినాడ లోక్‌సభ స్థానం, కాంగ్రెస్ పార్టీ తుని అసెంబ్లీ సీటు ఇవ్వజూపినా, రాజకీయాలలో ప్రవేశించే ఉద్దేశం లేకపోవటం వలన తిరస్కరించాడు.నారాయణమూర్తి కి అంటరానితనం దుర్మార్గంవంటివి ఇష్టం ఉండవు.బర్త్ డే లు, మదర్స్ డే లు, ఫాదర్స్ డేలు జరుపుకోవటం నచ్చవు.పునర్జన్మ, స్వర్గం, నరకం, ఖర్మ సిద్ధాంతం నమ్మడు.ఏడిస్తేనే నీ కష్టాలు తొలుగుతాయనుకుంటే ఏడువు అన్న బుద్ధుడి సూక్తి నచ్చి ఏడుపు మానాను.కారల్ మార్క్స్ అంతటి వారు కూడా దేవుడు లేడని చెప్పలేదు. నేను భారతీయుణ్ణి. ముఖ్యంగా హిందువుని. ఆ సంప్రదాయాల మధ్య పుట్టి పెరిగిన వాణ్ణి. చెట్లలో, పుట్టలలో, గట్టులలో చివరకు విష సర్పాల్లో కూడా దైవాన్ని చూసే గొప్ప సంస్కృతి మనది. ఆ సంస్కృతిని ఆకళింపు చేసుకున్నాను కాబట్టే నాకు దేవుడంటే నమ్మకం.సాధారణమైన జీవితం గడపడానికి కారణం నా 'మెంటాలిటీ'. చిన్నప్పట్నుంచీ నేను ఇంతే. నా అభిరుచుల్ని, అభిప్రాయాల్ని, మనోభావాల్ని మార్చుకోలేని అశక్తుణ్ణి. పదిమందీ నన్ను చూసి గొప్పగా చెప్పుకోవాలని నేను ఇలా ఉండను. ఇలా బతకడమే నాకిష్టం. నా రూమ్‌లో చాప, దిండు మాత్రమే ఉంటాయి.. వేప పుల్లతో పళ్ళు తోముకుంటా. సబ్బుతో స్నానం చేయను. మొహానికి పౌడర్ రాయను. నా స్వభావం ఇది. చెట్లకింద కూర్చోడం, జనంతో మమేకమవ్వడం.. ఇవే నాకు ఆనందాన్నిచ్చేవి. ఎవరో ఏదో అనుకుంటారని నా స్వభావాన్ని మార్చుకోలేను. మా గురువుగారు నన్ను 'పీపుల్స్ స్టార్' అన్నారు. 'జననాట్యమండలి గజ్జ ఆగిన చోట... ప్రజల గళాన్ని వినిపిస్తున్నాయి నారాయణమూర్తి సినిమాలు' అన్నాడు గద్దరన్న. స్వదేశీ భారతి అనే ప్రఖ్యాత బెంగాలీ రచయిత ఆయన రాసిన 'ఆరణ్యక్' బుక్‌పై ముఖచిత్రంగా నా బొమ్మ వేశాడు. పూరిజగన్నాథ్ తన 'కెమెరామెన్ గంగతో రాంబాబు' చిత్రాన్ని నాకు అంకితమిచ్చాడు. నాకు ఈ తృప్తి చాలు.పెళ్లి విషయంలో కూడా నాకంటూ కొన్ని కచ్చితమైన అభిప్రాయాలుండేవి. దానికి పెద్దలు ఒప్పుకోలేదు. నేను అభిప్రాయం మార్చుకోలేదు. చివరకు ఒంటరిగా మిగిలిపోయా.దేవుడు నన్ను అన్ని విషయాల్లో కింగ్‌ని చేసి ఆ ఒక్క విషయంలో అన్యాయం చేశాడు. ఇంటికెళ్లగానే.. ఒంటరితనం కమ్మేస్తుంది. జ్వరం వచ్చినప్పుడు పలకరించే నాథుడు లేకుండా ఒంటరిగా ముడుచుకొని పడుకొని ఉంటాను. తోడులేని నా జీవితం కూడా ఓ జీవితమేనా. ఏ గోంగూరో, లేక చేపల పులుసో తినాలనిపించినప్పుడు, అవి హోటల్లో దొరకనపుడు... అదే నాకంటూ ఓ భార్య ఉంటే వండి పెట్టేది కదా అనిపిస్తుంది. మేం సెటిల్ అవ్వలేదు. అయ్యాక పెళ్ళి చేసుకుంటాం అనే ధోరణి మానండి. ఏ వయసులో జరగాల్సిన ముచ్చట ఆ వయసులో జరగాలి. చక్కగా పెళ్ళి చేసుకోండని పిలుపునిచ్చారు.పేరుప్రఖ్యాతుల కోసం మాత్రమే జీవించేవాడికి మానసిక శాంతి ఉండదని ఆయన గతంలో పేర్కొన్నారు.

# దేశంలో 880 టన్నుల బంగారం

**ముంబై, డిసెంబర్ 30:** మన దేశంలో బంగారానికి ఎంత డిమాండ్ ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. చైనా తర్వాత ఎక్కువగా బంగారాన్ని వినియోగించే దేశంగా భారత్ ఉంది. ఈ క్రమంలోనే ప్రస్తుతం దేశ ప్రజల వద్ద ఉన్న బంగారం విలువ.. ఏకంగా దేశ జీడీపీనే మించిపోయిందని తెలుస్తోంది. ప్రజల వద్దే కాకుండా ఇంకా రిజర్వ్ బ్యాంక్ దగ్గర కూడా బంగారం నిల్వలు విశేషంగా ఉన్నాయని చెప్పొచ్చు. ఇదంతా కలిపితే ఇంకా ఎక్కువే ఉంటుందిబంగారానికి.. భారతీయులకు విడదీయరాని సంబంధం ఉంది. పురాతన కాలం నుంచి భారతీయులకు బంగారం అంటే అమితమైన ఆసక్తి. ముఖ్యంగా మహిళలు బంగారు ఆభరణాల్ని విశేషంగా కొనుగోలు చేసి ధరిస్తుంటారు. పండగలు, శుభకార్యాలు, వివాహాలు ఇతర ప్రత్యేక సందర్భాల సమయంలో డిమాండ్ మరింత ఎక్కువగా ఉంటుంది. బంగారు ఆభరణాలు మహిళల అందాన్ని మరింత పెంచుతుందని చెబుతుంటారు. సమాజంలో హోదాను కూడా ప్రతిబింబిస్తుంది. అందుకే.. ప్రతి ఇంట్లో ఎంతో కొంత బంగారం ఉంటుంది. అనిశ్చితి, సంక్షోభాల వేళ బంగారం సురక్షితమైన పెట్టుబడి సాధనంగా పనిచేస్తుందని నమ్ముతారు. అందుకే.. తమ దగ్గర ఉన్న డబ్బుతో చిన్న చిన్న మొత్తాల్లో కూడా కొనుగోలు చేసి కూడబెడుతుంటారు. అయితే ఇప్పుడు భారతీయుల వద్ద ఉన్న బంగారం విలువ ..



సరికొత్త మైలురాయిని తాకింది.ప్రజల వద్ద ఉన్న మొత్తం బంగారం విలువ.. ఇప్పుడు భారత స్థూల దేశీయోత్పత్తినే మించిందని తెలుస్తోంది. ఇటీవలి కాలంలో బంగారం ధరలు విపరీతంగా పెరిగిన సంగతి తెలిసిందే. దీంతో ప్రజల ఇంట్లో ఉన్న బంగారం విలువ కూడా విపరీతంగా పెరిగిందని చెప్పొచ్చు. భారతీయ ప్రజల వద్ద సుమారుగా 34 వేల నుంచి 35 వేల టన్నుల వరకు బంగారం నిల్వలు ఉన్నాయని అంచనా.ఇంటర్నేషనల్ మార్కెట్లో కిలో బంగారం ధర 1,46,000 డాలర్ల మార్కు దాటింది. ఇదే టన్నుకు (1000 కిలోలు) చూస్తే దీని విలువ 14,60,00,000 డాలర్లకు చేరుకుంది. 34,500 టన్నుల బంగారం ధర చూసినా ఇది సుమారు 5 ట్రిలియన్ డాలర్ల మార్కును అధిగమించింది. ట్రిలియన్ అంటే లక్ష కోట్లు. అంటే ప్రజల వద్ద బంగారం విలువ 5 లక్షల కోట్ల డాలర్ల మార్కు దాటేసింది. ఇది భారత కరెన్సీలో చూస్తే సుమారు రూ. 450 లక్షల కోట్లుగా ఉంటుంది. ఇక మన దేశ జీడీపీ 4 ట్రిలియన్ డాలర్లుగా ఉందని అంచనా. ఇది దాదాపు రూ. 360 లక్షల కోట్ల వరకు ఉంటుందని చెప్పొచ్చు. అంటే.. జీడీపీ కంటే భారత ప్రజల దగ్గర ఉన్న బంగారం విలువ దాదాపు 1.25 రెట్లు ఎక్కువగా ఉంది. ఈ అక్టోబర్ నెలలో భారతదేశ జీడీపీలో భారతీయుల దగ్గర ఉన్న బంగారం విలువ 88.8 శాతంగా ఉండగా.. ఇటీవల బంగారం రేట్లు విపరీతంగా పెరగ్గా ఇప్పుడు జీడీపీనే మించిపోయిందని చెబుతున్నారు. భారత్ తమ అవసరాల కోసం, ప్రజల డిమాండ్‌కు తగ్గట్లుగా అందుబాటులో ఉంచేందుకు ఎక్కువగా బంగారాన్ని దిగుమతి చేసుకుంటుందని చెప్పొచ్చు. ఇంకా బంగారాన్ని అత్యధికంగా వినియోగించే దేశాల్లో చైనా తర్వాత రెండో స్థానంలో ఉంది ఇండియా. ప్రజల దగ్గర మాత్రమే కాకుండా.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దగ్గర కూడా సుమారు 880 టన్నుల మేర పసిడి నిల్వలు ఉన్నాయి.

# చైనా, జపాన్ మధ్య యుద్ధ మేఘాలు

**టోక్యో, డిసెంబర్ 30:** భారత్ పాకిస్తాన్ తరహాలో చైనా జపాన్ మధ్య తరచూ ఉద్రిక్తతలు కొనసాగుతాయి. తైవాన్‌కు అమెరికా, జపాన్ అండగా ఉంటున్నాయి. ఇది చైనాకు నచ్చడం లేదు. తమ పొరుగు దేశం తమ చెప్పుచేతల్లో ఉండాలని చూనా భావిస్తోంది. కానీ, తైవాన్ చిన్న దేశమే అయినా చైనాను ఢీకొట్టేందుకు రెడీ అంటోంది. తాజాగా జపాన్ ప్రధాని చేసిన వ్యాఖ్యలు మరోమారు చైనా?తావాన్ మధ్య ఉద్రిక్తతలు పెంచాయి. జపాన్ ప్రధాని సనాయె తకాయిచి తైవాన్ భద్రతకు ముప్పు ఉంటే జపాన్ సైన్యం ప్రవేశిస్తుందని ప్రకటించారు. ఈ ప్రకటన ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఉద్రిక్తతలను మరింత ఊపందుకునేలా చేసింది. జపాన్ స్వర్ణరేఖల ద్వీపాల సమీపంలో తన సైనిక బలగాలను బలోపేతం చేస్తోందని సమాచారం. అమెరికాతో డిఫెన్స్ ఒప్పందాల ఆధారంగా ఈ చర్యలు జరుగుతున్నాయి.చైనా పీఎల్‌ఏ ఈస్టర్న్ థియేటర్ కమాండ్ సీనియర్ కర్నల్ షి యీ నేతృత్వంలో 'జస్టిస్ మిషన్ 2025' అభ్యాసాలు తైవాన్ జలసరిరాల్లో ప్రారంభమవుతాయి. సముద్ర, ఆకాశ, భూమి దళాల సమన్వయంతో బ్లాకేడ్‌లు, ఆక్రమణ దాడులు, రాకెట్ లాంచ్‌లు పరీక్షిస్తారు. 100కి పైగా యుద్ధనౌకలు, 50 ఫైటర్ జెట్‌లు, డ్రోన్‌లు పాల్గొంటాయని అధికారికులు తెలిపారు. తైవాన్ విభజనవాదులకు ఈ కార్యక్రమాలు తీవ్ర హెచ్చరికగా పనిచేస్తాయని, జాతీయ భద్రతా లక్ష్యాలను సాధించడమే లక్ష్యమని బీజింగ్ స్పష్టం చేసింది. ఇప్పటికే వాయుసేనా బేసులు, నౌకాస్థానాల నుంచి దళాలు తరలించబడ్డాయి.తైవాన్‌కు 2 బిలియన్ డాలర్ల ఆయుధ ప్యాకేజీ అందిస్తామని అమెరికా ప్రకటించడంత చైనా కోపంతో స్పందించింది. లాక్‌హీడ్ మార్టిన్, రేథియాన్ వంటి 20 రక్షణ సంస్థలు, 10 మంది అధిక అధికారులపై వివేకధారణలు విధించారు. ఈ ఆంక్షలు అమెరికన్ కంపెనీల వ్యాపారాన్ని ప్రభావితం చేస్తాయని నిపుణులు అంచనా.ఈ సంఘటనలు యూఎన్‌వోలో చర్చనీయాంశమయ్యాయి. ఫిలిప్పీన్స్, ఆస్ట్రేలియా వంటి దేశాలు తమ సైనికులను అలర్ట్ చేశాయి. తైవాన్ అధికారులు తమ రక్షణ వ్యవస్థలను బలోపేతం చేస్తున్నారు. ఈ ఉద్రిక్తతలు ఆగ్నేయాసియా వాణిజ్య మార్గాలు, సెమీకండక్టర్ సరఫరాను ప్రభావితం చేయవచ్చని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు, స్టాక్ మార్కెట్లు కదలికలు చూపుతున్నాయి.

# అధికారులు స్మార్ట్ గవర్నెన్స్‌కు మారాలి..

- మొదటి పేజీ తరువాయి

సర్కిళ్లు, 300 వార్డులుగా పునర్వ్యవస్థీకరించామని చెప్పుకొచ్చారు. పరిపాలనను పట్టాలెక్కించాలనేదే తమ ఆలోచన అని తెలిపారు. హైదరాబాద్ నగరంలో అత్యంత సంక్లిష్టమైన సమస్య చెత్త నిర్వహణ అని వివరించారు. కోర్ అర్బన్ రీజియన్‌ను ప్రక్షాళన చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. జోన్‌ల వారీగా సంబంధిత సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత జోనల్ కమిషనర్‌లదేనని స్పష్టం చేశారు. సిటీలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. చెరువులు, నాలాలను ఆక్రమణల నుంచి కాపాడుకోవాలని మార్గనిర్దేశం చేశారు. క్యూర్ పరిధిలో డీజిల్ బస్సులు, ఆటోల స్థానంలో ఈవీ వాహనాలను తీసుకురావాలని నిర్ణయించామని తెలిపారు. సిటీలో కాలుష్య నియంత్రణకు అవసరమైన పూర్తిస్థాయి ప్రక్షాళన తీసుకుంటున్నామని వెల్లడించారు సీఎం రేవంత్‌రెడ్డి. చెరువులు, నాలాలు, చెత్త డంపింగ్ ఏరియాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నెలకు మూడు రోజులు శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. రోడ్లపై ఎక్కడా చెత్త కనిపించడానికి వీల్లేదని హుకుం జారీ చేశారు. అలాగే, రోడ్లపై గుంతలు కనిపించొద్దని సూచించారు. జనన, మరణ ధ్రువీకరణ, ట్రేడ్ లైసెన్సులు, ఇతర ధ్రువపత్రాల జారీకి టెక్నాలజీని ఉపయోగించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ టెక్నాలజీని ఉపయోగించి ప్రజలకు పారదర్శక సేవలు అందించాలని మార్గనిర్దేశం చేశారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, అపార్ట్‌మెంట్ అసోసియేషన్‌లతో కమ్యూనికేషన్ ఉండేలా చూసుకోవాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్ గవర్నెన్స్‌కు మారాలని దిశానిర్దేశం చేశారు. హైడ్రా, జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్ విభాగాలు నాలాల పూడిక తీత పనులు జనవరి నుంచి ప్రారంభించాలని నిర్దేశించారు. నగరంలో వీధి దీపాలు సరిపడా ఉండేలా చూసుకోవాలని సూచించారు. క్యూర్ ఏరియాలో ఆయా విభాగాల అధికారులను సమన్వయం చేసే బాధ్యత స్పెషల్ సీఎస్ చూసుకుంటారని పేర్కొన్నారు. దోమల నివారణ, అంటువ్యాధులు ప్రబలకుండా జోనల్ కమిషనర్ ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతీ పది రోజులకోసారి గార్బేజ్ క్లియరెన్స్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ఎక్కడ సమస్య తలెత్తినా పరిష్కరించేందుకు టోల్ ఫ్రీ నంబర్‌కు వీలైనంత స్పీడ్‌గా రెస్పాన్స్ అవ్వాలని మార్గనిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో వచ్చే ఐదేళ్లకు యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని సూచించారు. అధికారులు అందరూ కలిసి పనిచేస్తేనే నగరం భవిష్యత్ బాగుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఇక టోల్ ఫ్రీ ప్రయాణం..

- మొదటి పేజీ తరువాయి

రాయాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నిర్ణయించారు. దీనిపై చర్చించేందుకు మంగళవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశం జరగనుంది.ప్రతి ఏటా సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు.. భాగ్యనగరం నుండి ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్లే ప్రయాణికులకు టోల్ కష్టాలు తప్పవు. ముఖ్యంగా పంతంగి, కొర్లపహాడ్ చిల్లకల్లు వంటి టోల్ ప్లాజాల వద్ద వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరుతుంటాయి. ఫాస్టాగ్ సౌకర్యం ఉన్నప్పటికీ.. వాహనాల సంఖ్య లక్షల్లో ఉండటంతో ఒక్కో టోల్ ప్లాజా దాటడానికి గంటల సమయం పడుతోంది. పండుగకు వెళ్లే ఉత్సాహంలో ఉన్న సామాన్యులకు ఈ ట్రాఫిక్ జామ్‌లు నరకాన్ని చూపిస్తున్నాయి. చంటిపిల్లలు, వృద్ధులతో ప్రయాణించే వారు ఈ రద్దీలో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు పడుతున్న దృశ్యాలు ఏటా కనిపిస్తూనే ఉన్నాయి.ప్రస్తుతం ఈ జాతీయ రహదారిపై పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. వివిధ చోట్ల ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, వంతెనలు, సర్వీసు రోడ్ల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. నిర్మాణ పనుల కారణంగా రహదారిపై ఇప్పటికే అనేక చోట్ల మళ్లింపులు ఉన్నాయి. సాధారణ రోజుల్లోనే వాహనాలు నెమ్మదిగా సాగుతుండగా.. ఇక పండుగ రద్దీ తోడైతే ట్రాఫిక్ సమస్య మరింత జటిలమయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. టోల్ వసూళ్ల కోసం వాహనాలను ఆపితే.. ఆ రద్దీ వెనక్కి కిలోమీటర్ల మేర విస్తరించి హైవే అంతా స్తంభించిపోయే ప్రమాదం ఉంది.క్లిష్ట పరిస్థితిని గమనించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. ప్రజలకు ఊరటనిచ్చేలా టోల్ మినహాయింపు అంశాన్ని తెరపైకి తెచ్చారు. టోల్ గేట్ల నిర్వహణను తాత్కాలికంగా నిలిపివేస్తే వాహనాలు ఆగకుండా సాఫీగా సాగిపోతాయని తద్వారా ఇంధనం ఆదా అవ్వడమే కాకుండా ప్రయాణ సమయం కూడా గణనీయంగా తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఉమ్మడి నల్గొండ జిల్లా కలెక్టర్లు,



పోలీస్, ఆర్‌అండ్‌బీ అధికారులతో నిర్వహించే సమావేశంలో ఈ ప్రతిపాదనపై స్పష్టత రానుంది. కేంద్ర ప్రభుత్వం గనుక దీనికి సానుకూలంగా స్పందిస్తే.. ఈ ఏడాది సంక్రాంతి ప్రయాణం సామాన్యులకు ఎంతో హాయిగా మారనుంది

# అదుపులోనే శాంతి భద్రతలు....

- మొదటి పేజీ తరువాయి

అభిలాష బిస్తా, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్గా షికా గోయల్, ఎస్ఐబీ ఐజీ సుమతి ఉన్నారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మహిళలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్లో క్యూఆర్ కోడ్ పెట్టడం జరిగిందని, ఫీడ్ బ్యాక్ కోసం ఈ ఏడాది ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**మొదటి స్థానంలో తెలంగాణ..**

ట్రావెల్ సేఫ్ పేరుతో సీఐడీ నూతన యాప్ తీసుకొచ్చిందని.. మహిళలు, జర్నీ చేసే వారికి ఈ యాప్ చాలా ఉపయోగపడుతుందని సూచించారు. టూరిస్ట్ పోలీసులను ఈ ఏడాది లాంచ్ చేశామన్నారు. 80 మంది నియమించి.. టూరిస్ట్ ప్లేస్‌లో పోలీసులు ఎలా పని చేయాలనే దానిపై ట్రైనింగ్ ఇచ్చామని తెలిపారు. డ్రగ్స్ కట్టడి కోసం ఈ ఏడాది ఈగల్ టీమ్‌ను సీఎం రేవంత్ రెడ్డి లాంచ్ చేశారన్నారు. ఈ ఏడాది 1.20 లక్షల సెల్ ఫోన్లు ట్రేస్ చేయడంలో దేశంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని చెప్పుకొచ్చారు. పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో దేశంలో తెలంగాణ రెండో స్థానంలో ఉందని వెల్లడించారు.

**సైబర్ నేరాలు తగ్గాయ్..**

దేశంలో 41 శాతం సైబర్ నేరాలు పెరిగితే.. తెలంగాణలో 3 శాతం సైబర్ నేరాలు తగ్గాయన్నారు. తెలంగాణలో గత ఏడాదితో పోలిస్తే 2.33% క్రైమ్ రేట్ తగ్గిందని వివరించారు. ఈ ఏడాది 2.28 లక్షలు కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో 4 కేసులో మరణ శిక్షలు ఖరారు అయ్యాయని.. 216 కేసుల్లో 320 మందికి యావజ్జీవ కారాగార శిక్ష పండిందని తెలిపారు. ఫోక్సో కేసుల్లో 144 కేసుల్లో 154 మందికి శిక్షలు ఖరారు అయ్యాయని.. అందులో ముగ్గురికి మరణ శిక్ష, 48 మందికి యావజ్జీవ కారాగార శిక్ష పడ్డాయని డీజీపీ పేర్కొన్నారు.

**రూ.173 కోట్ల డ్రగ్స్ సీజ్..**

తెలంగాణలో డ్రగ్స్ కేసులు భారీగా పెరిగాయని అన్నారు. గత ఏడాదితో పోలిస్తే 30 శాతం డ్రగ్స్ కేసులు పెరిగినట్లు చెప్పారు. వేరే రాష్ట్రాల్లో ఉన్న నిందితులను ఈగల్ టీమ్ పట్టుకొస్తోందన్నారు. ఈగల్ టీమ్ ఈ ఏడాది రూ.173 కోట్ల డ్రగ్స్ సీజ్ చేసిందని అన్నారు. నమ్మక ద్రోహం కేసులు తెలంగాణలో 23 శాతం పెరిగాయన్నారు. ఐపీసీ సెక్షన్ కింద కేసులు 7.83 % పెరిగాయని.. అలాగే మహిళలపై దాడులు కేసులు 2.90 % పెరిగాయని అన్నారు. 248 మంది మహిళల హత్యలకు గురైయ్యారని తెలిపారు. రేప్ కేసులు 13% తగ్గిందని, కిడ్నాప్‌లు 10% , వేధింపులు కేసులు 9% తగ్గాయని అన్నారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఈ ఏడాది 23% రికవరీ చేసిందని... రూ. 246 కోట్లు రికవరీ అయినట్లు తెలిపారు. 25,500 మంది బాధితులకు రూ.159 కోట్లు రీ ఫండ్ చేసినట్లు తెలిపారు.

**సీఐడీ విచారణలో నయీమ్ కేసు..**

ప్రైవేటు సంస్థల్లో మహిళల కోసం కమిటీలు ఏర్పాటు చేశామని.. పోష్ యాక్ట్‌ను తీసుకొచ్చామన్నారు. తెలంగాణలో ఈ ఏడాది ఫిల్మ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయబోతున్నామని.. ఇందులో 18 నుంచి 35 ఏళ్ళు లోపు ఉన్న వారు హాజరువుతారని తెలిపారు. టీజీ ఆర్టీసీ డ్రైవర్లను ఈ ఏడాది పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ద్వారా పరీక్ష నిర్వహించామన్నారు. నయీమ్ కేసు సీఐడీ విచారణలో ఉందన్నారు. నయీమ్ కేసులో సీజ్ అయిన ల్యాండ్స్, చాలా మంది అమ్మాలని ప్రయత్నం చేశారని తెలిపారు. నయీమ్ లాండ్స్‌పై హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని చెప్పారు. ఆ ల్యాండ్ ఎవరూ కొనవద్దని, అమ్మవద్దని ఆదేశాలు ఉన్నట్లు డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.

# ఎయిర్ పోర్టుకు అంతా రెడీ...

- మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలోని ద్వితీయ శ్రేణి నగరాలకు విమాన సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నాయి. ఇందులో భాగంగా దశాబ్దాల కాలంగా నిరీక్షిస్తున్న వరంగల్ మామునూరు విమానాశ్రయ పునరుద్ధరణ పనుల్లో ఒక కీలకమైన ఘట్టం శనివారం ఆవిష్కృతమైంది. భూసేకరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన ప్రభుత్వం.. సేకరించిన భూమిని అధికారికంగా భారత విమానయాన సంస్థకు అప్పగించింది.వరంగల్ జిల్లా యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన ఈ భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసింది. శనివారం భారత విమానయాన సంస్థ హైదరాబాద్ జనరల్ మేనేజర్ బి.వి. రావు నేతృత్వంలోని బృందం మామునూరు ప్రాంతాన్ని సందర్శించింది. గతంలో ఈ విమానాశ్రయం పరిధిలో ఉన్న 696.14 ఎకరాలకు తోడు.. తాజాగా సేకరించిన 253 ఎకరాల ప్రైవేటు భూమిని కలిపి మొత్తం సుమారు 950 ఎకరాల భూమిని విమానాశ్రయ అథారిటీకి అప్పగించారు. రైతుల నుంచి సేకరించిన భూములకు సంబంధించి ప్రభుత్వం ఎకరాకు సుమారు రూ. 1.20 కోట్ల చొప్పున మొత్తం రూ. 295 కోట్లను పరిహారంగా చెల్లించింది. ఆర్బిట్రేషన్ ప్రక్రియ ద్వారా రైతుల అభ్యంతరాలను పరిష్కరించి.. ఎటువంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా భూములను స్వాధీనం చేసుకుంది.రెవెన్యూ, రహదారుల శాఖ అధికారులతో కలిసి విమానయాన సంస్థ బృందం భూమి సరిహద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. త్వరలోనే ఈ భూమి బదలాయింపు పత్రాలను ప్రభుత్వం అధికారికంగా



అందజేయనుంది. మామునూరు విమానాశ్రయాన్ని ఒక చిన్న విమానాశ్రయంగా కాకుండా.. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. ఉత్తర ప్రదేశ్‌లోని అయోధ్య విమానాశ్రయాన్ని ఎంత వేగంగా నిర్మించారో.. అదే వేగంతో దీనిని పూర్తి చేయాలని సంకల్పించింది. కేరళలోని కొచ్చిన్ విమానాశ్రయం తరహాలో ఆధునిక వసతులు, పచ్చదనంతో దీనిని అలంకరించనున్నారు.ప్రస్తుతానికి ఉన్న చిన్న రన్‌వేను విస్తరించి.. ప్రారంభంలో 72 సీట్ల సామర్థ్యం ఉన్న చిన్న విమానాలను నడపనున్నారు. ప్రయాణికుల స్పందనను బట్టి పెద్ద విమానాలు దిగేలా రన్‌వేను మరింత అభివృద్ధి చేస్తారు.సాధారణంగా శంషాబాద్ విమానాశ్రయానికి 150 కిలోమీటర్ల పరిధిలో మరో విమానాశ్రయం ఉండకూడదని ఒప్పందం ఉంది. కానీ.. ప్రభుత్వం ఈ నిబంధనల నుంచి మామునూరుకు మినహాయింపు తీసుకురావడంలో విజయం సాధించిందివరంగల్‌కు విమాన సౌకర్యం రావడం వల్ల ఉత్తర తెలంగాణ ఆర్థిక చిత్రం పూర్తిగా మారిపోనుంది. వరంగల్‌లో ఉన్న ఐటీ హబ్, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు ఇది కొత్త ఊపిరి పోయనుంది. పారిశ్రామికవేత్తలు, విదేశీ ప్రతినిధులు నేరుగా వరంగల్ చేరుకునే అవకాశం ఉండటంతో మరిన్ని పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం, వరంగల్ కోట, వేయి స్తంభాల గుడిని సందర్శించే పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది. దీనివల్ల స్థానిక రవాణా, హోటల్ వ్యాపారాలు పుంజుకుంటాయి. విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి లభిస్తుంది.నాలుగు దశాబ్దాల పాటు మూతపడి ఉన్న ఈ విమానాశ్రయాన్ని పునరుద్ధరించడానికి ఒక స్పష్టమైన కాలపరిమితిని ప్రభుత్వం నిర్ణయించుకుంది. 2026 జనవరి మాసంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంయుక్తంగా ఈ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించే అవకాశం ఉంది. 2027 చివరి నాటికి మొదటి విమానాన్ని గాల్లోకి ఎగురవేయడమే లక్ష్యంగా పనులు సాగుతున్నాయి. ఇప్పటికే దీనికి అవసరమైన అన్ని రకాల క్లియరెన్సులను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇటీవల పర్యవేక్షించారు. భూసేకరణ ప్రక్రియ పూర్తి కావడంతో మామునూరు విమానాశ్రయ నిర్మాణంలో ఒక అతిపెద్ద అడ్డంకి తొలగిపోయింది. ఇది ఓరుగల్లు ప్రాంత అభివృద్ధికి ఒక మైలురాయిగా నిలవబోతోంది.

## నిధుల వరద..

# తర్వాత ఎన్నికలు..

- మొదటి పేజీ తరువాయి

125 మున్సిపాలిటీలు ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాయి. గడువు ఏప్రిల్ వరకు ఉన్న ఖమ్మం, వరంగల్ వంటి కొన్ని చోట్ల మాత్రం ప్రస్తుతానికి మినహాయింపు ఉండవచ్చుఎన్నికల నిర్వహణలో అత్యంత కీలకమైన ఓటర్ల జాబితా రూపకల్పనపై ఎన్నికల కమిషన్ దృష్టి సారించింది. జనవరి రెండో వారం నాటికి తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేసేలా కార్యాచరణ రూపొందించారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వార్డుల విభజన, రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ కూడా వేగవంతం కానుంది. క్షేత్రస్థాయిలో పార్టీ బలాన్ని నిరూపించుకోవడంతో పాటు, రాబోయే సాధారణ ఎన్నికలకు ముందే పట్టణ ఓటర్ల మొగ్గు ఎటువైపు ఉందో తెలుసుకోవడానికి ఈ ఎన్నికలను అధికార పార్టీ ఒక 'సెమీఫైనల్'గా భావిస్తోంది.మరోవైపు.. ఎన్నికలకు ముందే ఓటర్లను ఆకట్టుకునేలా రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధుల వర్షం కురిపిస్తోంది. పట్టణాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం అక్టోబరులోనే రూ. 2,780 కోట్లు విడుదల చేసింది. జీహెచ్ఎంసీ మినహా మిగిలిన అన్ని పట్టణ సంస్థల్లో సుమారు 2,432 అభివృద్ధి పనులు ఈ నిధులతో జరగనున్నాయి. కొత్త మున్సిపాలిటీలకు రూ. 15 కోట్లు, కొత్త కార్పొరేషన్లకు రూ. 30 కోట్ల చొప్పున అదనపు నిధులు కేటాయించి జనవరి చివరి నాటికి ఈ పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. ఇలా ఒకవైపు అభివృద్ధి పనులు, మరోవైపు ఎన్నికల వ్యూహాలతో రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ పోరుకు సర్వం సిద్ధం చేస్తోంది.

# దానం ధైర్యం ఏమిటీ..?

- మొదటి పేజీ తరువాయి



స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇటీవల ఐదుగురు ఎమ్మెల్యేల విషయంలో ఇచ్చిన రూలింగ్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. వారు పార్టీ మారలేదని స్పీకర్ తేల్చిచెప్పినప్పటికీ, మిగిలిన ఐదుగురు ఎమ్మెల్యేల పరిస్థితి ఏంటన్నది ఉత్కంఠ రేపుతోంది. ఇందులో అందరి దృష్టి దానం నాగేందర్‌పైనే ఉంది. ఎందుకంటే ఆయన కేవలం పార్టీ కండువా కప్పుకోవడమే కాదు, ఏకంగా కాంగ్రెస్ తరపున ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఇది రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం అనర్హత వేటుకు తిరుగులేని సాక్ష్యం.బిఆర్ఎస్ నుంచి గెలిచిన దానం నాగేందర్, కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుని సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం నుండి పోటీ చేశారు. ఒక పార్టీ గుర్తుపై ఎమ్మెల్యేగా ఉండి, మరో పార్టీ తరపున ఎన్నికల్లో పోటీ చేయడం అనేది ఫిరాయింపుల నిరోధక చట్టం కింద నేరుగా అనర్హతకు దారితీస్తుంది. స్పీకర్ నుంచి నోటీసులు అందినప్పటికీ దానం ఇప్పటివరకు వివరణ ఇవ్వకపోవడం గమనార్హంఅయితే, తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచాయి. "నేను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నాను.. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్–ఎంఐఎం కలిసి 300 డివిజన్లలో గెలుస్తాయి" అని ఆయన ప్రకటించడం ద్వారా తన రాజకీయ గమ్యంపై స్పష్టత ఇచ్చేశారు. అంటే స్పీకర్ తనపై నిర్ణయం తీసుకునే వరకు వేచి చూడకుండా, తానే ఒక అడుగు ముందుకేయాలని దానం భావిస్తున్నట్లు కనిపిస్తోంది.దానం నాగేందర్ ఇప్పుడు రాజీనామా అస్త్రాన్ని ప్రయోగించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. స్పీకర్ అనర్హత వేటు వేస్తే, భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేసే విషయంలో న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. అలా కాకుండా, ముందే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తే.. ప్రజల్లోకి నైతికతతో వెళ్ళినట్లు ఉంటుంది. ఉప ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్ గుర్తుపై పోటీ చేసేందుకు అర్హత లభిస్తుంది. కోర్టు కేసులు, అనర్హత వేటు ముప్పు నుంచి శాశ్వతంగా బయటపడవచ్చు.దానం నాగేందర్ కేవలం ఖైరతాబాద్‌కే పరిమితం కాకుండా, గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా తన పట్టు నిలుపుకోవాలని చూస్తున్నారు. 300 డివిజన్లలో ప్రచారం చేస్తానని ప్రకటించడం ద్వారా, తాను కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఎదగాలని కోరుకుంటున్నట్లు అర్థమవుతోంది. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడం ద్వారా తన ప్రాధాన్యతను నిరూపించుకోవాలని ఆయన ప్లాన్. ఒకవేళ దానం నాగేందర్ రాజీనామా చేసి ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక వస్తే, అది తెలంగాణ రాజకీయాల్లో ఒక టర్నింగ్ పాయింట్ అవుతుంది. అధికార కాంగ్రెస్ పార్టీ తన బలాన్ని నిరూపించుకోవడానికి ఇది ఒక పరీక్ష.దానం నాగేందర్ వ్యవహారం ఇప్పుడు కేవలం ఒక ఎమ్మెల్యే అనర్హతకు సంబంధించిన అంశం కాదు. ఇది తెలంగాణలో రాబోయే రాజకీయ సమీకరణాలకు దిక్సూచి. స్పీకర్ నిర్ణయం కంటే ముందే ఆయన రాజీనామా చేసి ఎన్నికల బరిలోకి దిగితే, అది రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనమే అవుతుంది. దానం తీసుకునే ఈ బోల్డ్ స్టెప్ సక్సెస్ అయితే, మిగిలిన ఫిరాయింపు ఎమ్మెల్యేలకు కూడా అది ఒక మార్గదర్శకంగా మారే అవకాశం ఉంది.

# స్త్రీ నిధి పేరుతో యాప్

- మొదటి పేజీ తరువాయి

తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా ఇంటి నుంచే మహిళలు లోన్ కోసం అప్లై చేసుకోవచ్చు. ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లాల్సిన అసవరం లేదు. ఇప్పటికే రుణం తీసుకున్నవారే కాకుండా కొత్తగా లోన్ తీసుకోవాలనుకునేవారు ఈ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే మహిళలు తాము నెలనెలా చెల్లించే వాయిదాల సొమ్మును ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. కొంతమంది తమ సభ్యులకు తెలియకుండా నిధులను పక్కదారి పట్టిస్తున్నారు. ఇప్పుడు ప్రతీ మహిళ తాము చెల్లించిన డబ్బులు అకౌంట్లో పడ్డాయా లేదా అనేది చెక్ చేసుకోవచ్చు. ఒకవేళ డబ్బులు జమ కాకపోతే అధికారులను వెంటనే సంప్రదించవచ్చు. అలాగే గతంలో చెల్లించిన సొమ్మును బట్టి ఎంత రుణం వస్తుంది.. ?రుణం పొందిన తర్వాత స్టేటస్ ఏంటి..? ఎవరి దగ్గర పెండింగ్ ఉంది..? అనే అన్నీ వివరాలను స్త్రీ నిధి యాప్ ద్వారా తెలుసుకునే అవకాశముంది.

**డౌన్‌లోడ్ ఎలా చేసుకోవాలంటే..?**

–గూగుల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి మన స్త్రీనిధి అని సెర్చ్ చేయండి

–మీ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోండి

–ఫోన్ నెంబర్ టైప్ చేసి రిజిస్టర్ అవ్వండి

–మీ సంఘం వివరాలు, లోన్ల వివరాలు చెక్ చేసుకోండి

# బీఆర్ఎస్ నేతలతో కేసీఆర్ భేటీ..

- మొదటి పేజీ తరువాయి



పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్ట్ విషయంలో గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందని, ఈ ప్రాజెక్ట్‌ను పక్కన పెట్టి కేవలం కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను మాత్రమే నిర్మించిందని అధికార కాంగ్రెస్ పార్టీ ఆరోపణ. బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల కాలంలో అటు కృష్ణా, ఇటు గోదావరి రెండు నదులపై చేపట్టిన ప్రాజెక్టులు, నీటి వాటాలు పరిష్కరించామని ఆ పార్టీ చెప్పుకొస్తోంది. ఇదే విషయంపై కొద్దిరోజులుగా సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం మధ్య మాటల యుద్ధం వ్యక్తిగత దూషణలకు దారి తీసింది. వీటన్నింటికీ అసెంబ్లీ వేదికగా సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ గట్టి పట్టుదలతో ఉంది. ఇందులో భాగంగానే కాసేపటి క్రితమే కేసీఆర్‌తో కేటీఆర్, హరీష్ రావు, ఇతర నాయకులు సమావేశమయ్యారు. ప్రభుత్వం ఎలా స్పందిస్తుంది?.. ప్రభుత్వం చెప్పే ప్రతీ అంశంపై సమాధానంతో సిద్ధంగా ఉండాలని ఇప్పటికే పార్టీ నేతలకు కేసీఆర్ చెప్పినట్లు తెలుస్తోంది.

## నాంపల్లి ఎగ్జిబిషన్ తో స్టాల్స్ ఎంపికపై విచారణ జరపాలి

**హైదరాబాద్:**ప్రతిష్టాత్మకంగా ప్రతి ఏటా నిర్వహించే నాంపల్లి ఎగ్జిబిషన్ నుమాయిష్ లో స్టాల్స్ ఎంపిక అవకతవకలపై న్యాయ విచారణ జరిపించాలని పలువురు స్టాల్స్ నిర్వాహకులు డిమాండ్ చేశారు. తెలంగాణ జన సమితి నాయకులతో కలిసి బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాల్స్ నిర్వాహకుడు అక్బర్ అలీ ,గాంధీ దర్శన్ కార్యదర్శి ప్రసాద్ తో కలిసి జన సమితి గ్రేటర్ అధ్యక్షుడు నర్సయ్య మాట్లాడారు. నుమాయిష్ లో మొత్తం 3 వేలకు పైగా స్టాల్స్ ఏర్పాటు చేస్తే , అధికారిక లెక్కల్లో మాత్రం 2 వేల స్టాల్స్ మాత్రమే చూపిస్తున్నారని తెలిపారు. మిగిలిన 15 వందల స్టాల్స్ ను ఏ పద్దతిలో కేటాయిస్తున్నారో బహిర్గతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సొసైటీ లెక్కల ప్రకారం మినిమం స్టాల్ కు లక్ష రూపాయల రెంట్ ఉంటుందని , కానీ ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులు అదనంగా రెండు నుండు మూడు లక్షల వసూలు చేస్తున్నారని ఆరోపించారు. స్టాల్స్ కేటాయింపు కూడా పారదర్శకంగా జరపడం లేదని... కేవలం కొన్ని స్టాల్స్ కు మాత్రమే బహిరంగ వేలం వేస్తున్నారని పేర్కొన్నారు. మిగిలిన స్టాల్స్ కు వారిని నచ్చిన వాళ్లకు ఇష్టమైన ధరలకు కేటాయిస్తున్నారని విమర్శించారు. గత ఏడాది సొసైటీ కన్వీనర్ , ప్రస్తుత స్టాల్స్ అలట్మెంట్ అడ్వైజర్ ప్రభ శంకర్ కనుసన్నల్లోనే అవకతవకలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్టాల్స్ కేటాయింపు పై ఒక కమిటీ వేసి , విచారణ జరిపించాలని... అప్పుడే సొసైటీ చేస్తున్న అక్రమాలు బయటపడతాయన్నారు. స్టాల్స్ కేటాయింపులో స్థానికులకు అన్యాయం జరుగుతుందని , గోషామహల్ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు స్టాల్స్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయం ఐటి శాఖ మంత్రి , సొసైటీ అధ్యక్షుడు శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లామని , సొసైటీ సభ్యుల అవినీతి త్వరలోనే బయటపడుతుందని నర్సయ్య అన్నారు. గాంధీ దర్శన్ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ... ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో ఉన్న గాంధీ దర్శన్ బిల్డింగ్ ను ఎగ్జిబిషన్ సొసైటీ అక్రమించుకుందని అన్నారు. గాంధీజీకు సంబంధించిన వస్తువులను బయట పడేసి , గాంధీ దర్శన్ బిల్డింగ్ ను కూడా స్టాల్స్ కు కేటాయించి... మహాత్మా గాంధీని అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు.

## వేయిస్తంభాల దేవాలయంలో వైకుంఠ ఏకాదశి



**హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 30** : చారిత్రక వేయిస్తంభాల దేవాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా విష్ణు ఆలయంలో సీతారామచంద్ర స్వామివార్లకు అభిషేకాదులు, తులసీదళాలతో అర్చనాధి కార్యక్రమాలు నిర్వర్తించారు. మహానివేదన నీరాజనా మంత్రపుష్పాల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఏడాదికి 24 ఏకాదశలు వస్తాయని, సూర్యుడు ఉత్తరాయానికి మారే ముందువచ్చే పుష్యశుద్ధ ఏకాదశిని వైకుంఠ ఏకాదశి, ముక్కోటి ఏకాదశి అంటారని ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. ధనుర్మాసంలో వచ్చే ఏకాదశినే వైకుంఠ ఏకాదశి అంటారని, విష్ణు ప్రీతికరమైన ఏకాదశిలలో ఇది అత్యంత ప్రాధాన్యమైనదన్నారు. భక్తిశ్రద్ధలతో లక్ష్మీనారాయణలను, సీతారామచంద్రస్వామివార్లను, వెంకటేశ్వ రస్వామివాళ్లను దర్శించడం వలన మోక్షం కలుగుతుందని పురాణాలు తెలియజేస్తున్నాయని దానికి అనుకూలంగా వైకుంఠ ఏకాదశి ఉత్సవం నిర్వర్తించడం జరిగిందన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేందర్ శర్మ, ప్రణవ్, శ్రవణ్, కాశి లింగాచారి, వేద పండితులు గంగు మణికంఠశర్మ అవధాని పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి డి.అనిల్‌కుమార్ భక్తులకు ప్రసాద వితరణ చేశారు. భక్తులు 'శ్రీరామ రామ రామేతి రమేరమే మనోరమే' అంటూ రామనామా జపం చేశారు.

## న్యూ ఇయర్ సెలెబ్రేషన్స్.. ప్రజలకు గుడ్‌న్యూస్




**హైదరాబాద్:** న్యూ ఇయర్ వేడుకలను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ తమ ప్రయాణీకులకు గుడ్‌న్యూస్ చెప్పింది. సాధారణంగా మెట్రో రైళ్లు రాత్రి 11 గంటల వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయి. కానీ, కొత్త సంవత్సర వేడుకల్ని దృష్టిలో పెట్టుకుని 31వ తేదీ రాత్రి మెట్రోరైలు వేళలను హెచ్ఎమ్ఆర్ఎల్ పొడిగించింది. బుధవారం అర్ధరాత్రి ఒంటిగంట వరకు మెట్రో రైళ్లు అందుబాటులో ఉండనున్నాయి. ప్రారంభ స్టేషన్‌ల నుంచి రాత్రి ఒంటిగంటకు చివరి మెట్రో రైళ్లు బయలుదేరనున్నాయి. మెట్రో రైలు ప్రయాణీకులు దీన్ని దృష్టిలో పెట్టుకుని తమ జర్నీని ప్లాన్ చేసుకోవాల్సి ఉంటుంది.

## మధ్యాహ్న భోజనంలో నాణ్యతను పాటించాలి

**విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలి**

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి.ఎస్.లత**



**జగిత్యాల:** జిల్లా లోని అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో నాణ్యతను పాటించాలని, విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి.ఎస్.లత సూచించారు.మంగళవారం కలెక్టరేట్లో మధ్యాహ్న భోజన పథకం అమలు పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు..ఈ సందర్బంగా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) మాట్లాడుతూ మధ్యాహ్న భోజన నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్యా,వసతులు కల్పించాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని అందుకు విద్యార్థుల తల్లిదండ్రులను సంప్రదించి అవగాహన కల్పించాలని తెలిపారు.ఎక్కడ సమస్యలు తలెత్తిన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.ఈ సమీక్ష లో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీ స్కూలు ను తనిఖీ చేసిన కలెక్టర్



**కర్నూలుజి:**హొళగుంద మండలం ఎల్లార్తి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారు. విద్యార్థులతో మాట్లాడి విద్యా బోధన, పరీక్షలకు సంసిద్ధత గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు.

# నిమ్స్ ఉద్యోగుల నిరీక్షణకు తెర



**హైదరాబాద్, డిసెంబర్ 30:**నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఉద్యోగుల దశాబ్దాల నిరీక్షణకు తెరపడింది. వీరు కోరుతున్న విధంగా ఆర్జిత సెలవుల నగదు మార్పిడి సౌకర్యాన్ని కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం జీవో నం. 230 జారీ చేసింది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవతో ఈ సమస్య పరిష్కారమైంది. ఎయిమ్స్ పే స్కేల్స్ పొందుతున్న రెగ్యులర్ సిబ్బందికి ఇకపై రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం తమ సెలవులను సరెండర్ చేసి నగదు పొందే వీలుంటుంది.హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఆసుపత్రిలో పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. దశాబ్దాలుగా పరిష్కారం కాకుండా మిగిలిపోయిన 'ఆర్జిత సెలవుల నగదు మార్పిడి' సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరచడంతో.. ప్రభుత్వం దీనికి సంబంధించి కీలకమైన ఉత్తర్వులను (జీవో నంబర్ 230) విడుదల చేసింది.నిమ్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఎయిమ్స్ తరహాలో శాలరీలు అమలులో ఉన్నాయి. అయితే.. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉండే 'సెలవుల నగదు మార్పిడి' సదుపాయం వీరికి గతంలో వర్తించేది కాదు. దీనివల్ల ఉద్యోగులు తమ విధి నిర్వహణలో భాగంగా వాడుకోకుండా మిగిలిపోయిన సెలవులను నగదుగా మార్చుకునే అవకాశం ఉండేది కాదు. ఈ సమస్యను పరిష్కరించాలని నిమ్స్ ఉద్యోగ సంఘాలు.. ముఖ్యంగా నర్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు చాలా కాలంగా పోరాడుతున్నారు. ఇటీవల వారు మంత్రిని కలిసి విన్నవించగా.. ఆయన సానుకూలంగా స్పందించి అధికారులను సమన్వయం చేశారు.ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఆదేశాల ప్రకారం.. తెలంగాణ సెలవు నిబంధనలు-1933 ఇకపై నిమ్స్ ఉద్యోగులకు కూడా వర్తిస్తాయి. దీనివల్ల.. ఉద్యోగులు తమ ఖాతాలో ఉన్న ఆర్జిత సెలవులను ప్రభుత్వానికి అప్పగించి (సరెండర్ చేసి), దానికి సమానమైన నగదును పొందే వీలుంటుంది. ఇది అత్యవసర సమయాల్లో లేదా పదవీ విరమణ సమయంలో వారికి పెద్ద ఆర్థిక ఆసరాగా మారుతుంది. రాష్ట్రంలోని ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా నిమ్స్ సిబ్బందికి కూడా ఈ హక్కు లభించడం వల్ల వారిలో వివక్ష తొలగిపోతుంది. పగలు, రాత్రి తేడా లేకుండా ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు సేవలు అందించే నర్సులు.. పారామెడికల్, ఇతర సాంకేతిక సిబ్బందిలో ఈ నిర్ణయం నూతనోత్సాహాన్ని నింపుతుంది.ఆరోగ్య శాఖలో పనిచేసే సిబ్బంది సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించడం వల్ల ఆసుపత్రుల పనితీరు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. నిమ్స్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలో పనిచేసే వారికి ఇలాంటి రాయితీలు ఇవ్వడం వల్ల వారు మరింత నిబద్ధతతో పనిచేస్తారని ఆరోగ్య శాఖ అధికారులు భావిస్తున్నారు. హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు ఈ జీవోను జారీ చేస్తూ.. నిబంధనల అమలులో పారదర్శకత ఉండాలని సూచించారు.ఈ నిర్ణయం పట్ల నిమ్స్ వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తమ దీర్ఘకాలిక సమస్యను అర్థం చేసుకుని.. తక్షణమే జీవో వచ్చేలా కృషి చేసిన మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఉద్యోగ సంఘాలు కృతజ్ఞతలు తెలుపుతున్నాయి. వేలాది మంది కుటుంబాలకు ఈ నిర్ణయం ద్వారా మేలు జరగనుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ సానుకూల అడుగు ఇతర పెండింగ్ సమస్యల పరిష్కారానికి కూడా దారి చూపుతుందని ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు

### జాతీయ రహదారులపై పండగ రద్దీ

# అధికారులు అప్రమత్తంగా వుండాలి

**ట్రాఫిక్ ఆగడానికి వీల్లేదు:మంత్రి కోమటిరెడ్డి**



**హైదరాబాద్:**సంక్రాంతి పండుగ సమయంలో నేషనల్ హైవేలపై ట్రాఫిక్ రద్దీ నివారణకు చేపట్టాల్సిన చర్యలపై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు.మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ - విజయవాడ హైవే పై జనవరి 8 నుండి వాహన రద్దీ ఎక్కువ ఉంటుంది. సంక్రాంతికి వెళ్ళే వారికి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. పోయినసారి ఎదురైనా అనుభవాల దృష్ట్యా ముందస్తు చర్యలు తీసుకోవాలి. రోజుకు సుమారు లక్ష వాహనాల ప్రయాణం సాగుతుంది..దీనిపై అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలి. రేపు నేను తూప్రాన్ పేట్,అబ్దుల్లాపూర్ మెట్ ప్రాంతాల్లో ఫీల్డ్ విజిట్ చేస్తా. మెయిన్ గా ఎల్బీనగర్ నుండి వనస్థలిపురం,పనామా గోడౌన్,హయత్ నగర్,రామోజీ ఫిల్మ్ సిటీ ఈ ప్రాంతాల్లో వేలాది వాహనాలు రద్దీ ఏర్పడుతుంది..ఇక్కడ ఎట్టి పరిస్థితుల్లో ట్రాఫిక్ ఆగడానికి వీల్లేదు. పండుగ రద్దీ ఉన్న రోజుల్లో లేన్లు మూసే పనులు, భారీ యంత్రాలతో చేసే పనులు చేయొద్దు. అత్యవసరంగా చేయాల్సిన పనులు ట్రాఫిక్ తక్కువగా ఉండే రాత్రి వేళల్లో మాత్రమే చేయాలి. పండుగ మొదలుకానున్న తేదీకి ముందే రోడ్లపై ఉన్న మట్టి, నిర్మాణ సామగ్రి, యంత్రాలు పూర్తిగా తొలగించాలి. అన్ని రహదారి లేన్లు వాహనాల రాకపోకలకు పూర్తిగా అందుబాటులో ఉంచాలని అన్నారు.రోడ్డు పనులు జరుగుతున్న ప్రతి చోట పగలు, రాత్రి స్పష్టంగా కనిపించే ట్రాఫిక్ బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. హై-విజిబిలిటీ కోన్లు, బారికేడ్లు ఏర్పాటు చేసి పనులు జరిగే ప్రాంతం, ట్రాఫిక్ వెళ్లే దారి స్పష్టంగా చూపాలి. ఎక్కడా ట్రాఫిక్కు అయోమయం కలిగించే ఏర్పాట్లు ఉండకూడదు. రద్దీ ఎక్కువగా ఉండే జంక్షన్లు, టోల్ ప్లాజాలు, కీలక ప్రాంతాల్లో అదనపు ట్రాఫిక్ పోలీసులను మోహరించాలని సూచించారు.సమీక్ష సమావేశంలో స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్,యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు,నల్గొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి,సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్,%చీనా×% రీజినల్ అధికారి శివ శంకర్, %వీశీ=ు% రీజినల్ అధికారి కృష్ణ ప్రసాద్,డీసీపీ జగదీశ్వర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ ఎస్పీ,పలువురు పోలీస్ ఉన్నతాధికారులు,ఆర్ అండ్ బి ఈ ఎన్సి లు జయభారతి,మోహన్ నాయక్,ఎస్.ఈ ధర్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## న్యూఇయర్ వేళ పోలీసుల కీలక సూచన




**హైదరాబాద్, డిసెంబరు 30** : నూతన సంవత్సర వేడుకలకు నగరం సిద్ధమవుతున్న నేపథ్యంలో.. వేడుకల అనంతరం ప్రజలు ఇంటికి చేరుకునే సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సైబరాబాద్ పోలీసులు కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా క్యాబ్, ఆటో, బైక్ సేవల విషయంలో ప్రయాణికులు సమస్యలు ఎదుర్కొంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ గజరావ్ భూపాల్ విజ్ఞప్తి చేశారు. నూతన సంవత్సర వేడుకల రాత్రి నగరంలో రద్దీ విపరీతంగా పెరిగే అవకాశం ఉందని పోలీసులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో క్యాబ్‌లు రాకపోవడం, ఆటో లేదా బైక్ డ్రైవర్లు చెప్పిన ప్రాంతానికి రావడానికి నిరాకరించడం, లేదా సాధారణం కంటే అధికంగా డబ్బు డిమాండ్ చేయడం వంటి ఘటనలు చోటుచేసుకునే అవకాశం ఉందని జాయింట్ సీపీ తెలిపారు. అటువంటి పరిస్థితుల్లో ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఆటో, క్యాబ్, బైక్ డ్రైవర్లు అధిక చార్జీలు అడిగినా, లేదా బుక్ చేసిన క్యాబ్ రావడంలో నిర్లక్ష్యం చూపినా వెంటనే 94906 17346 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. అందిన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీసులు పనిచేస్తున్నారని గజరావ్ భూపాల్ తెలిపారు. నూతన సంవత్సర వేడుకల అనంతరం రాత్రి వేళ ఒంటరిగా ప్రయాణించే వారు, మహిళలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమస్య ఎదురైతే భయపడకుండా పోలీసులను సంప్రదించాలని చెప్పారు. నగరమంతా ట్రాఫిక్ పోలీసులు, ప్యాట్రోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటారని తెలిపారు. రోడ్లపై ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల సురక్షిత ప్రయాణానికి అన్ని చర్యలు చేపట్టామని అన్నారు. జాయింట్ సీపీ మాట్లాడుతూ, నూతన సంవత్సరం ఆనందంగా జరుపుకోవాలని, కానీ భద్రత విషయంలో రాజీపడవద్దని సూచించారు. వేడుకల అనంతరం మద్యం సేవించి వాహనం నడపకుండా క్యాబ్ లేదా ఇతర రవాణా సేవలను వినియోగించాలని కోరారు. అదే సమయంలో, రవాణా సేవల పేరుతో ప్రజలను ఇబ్బంది పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నిర్ణయంతో నూతన సంవత్సర రాత్రి ప్రయాణికులకు భరోసా కలిగిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సమస్య ఎదురైనప్పుడు నేరుగా పోలీసులను సంప్రదించవచ్చున్న అవగాహన ప్రజల్లో పెరగడం వల్ల అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట పడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. నూతన సంవత్సర వేడుకల సమయంలో ప్రజలు సురక్షితంగా ఇంటికి చేరేందుకు సైబరాబాద్ పోలీసులు తీసుకున్న ఈ చర్యలు అభినందనీయమని నగరవాసులు అంటున్నారు. సమస్య ఎదురైతే 94906 17346 నంబరుకు కాల్ చేయాలని మరోసారి పోలీసులు గుర్తు చేశారు.

## నాచారం లో దారుణం...

**నగల కోసం వృద్ధురాలి గొంతు నులిమి హత్య**

**మృతదేహాన్ని ఆంధ్ర గోదావరి నదిలో పడేసిన దుండగులు**

**ఈ నెల 18న నాచారం పోలీసు స్టేషన్ లో సూరెడ్డి సుజాత మిస్సింగ్ కేసు నమోదు కేసును చేధించిన పోలీసులు.. ముగ్గురి అరెస్ట్**

**మేడ్చల్:** బంగారు నగల కోసం వృద్ధురాలిని హత్య చేసిన కేసును నాచారం పోలీసులు ఛేదించారు. ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. నాచారం పోలీస్ స్టేషన్ లో సీఐ ధనుంజయ కేసు వివరాలు వెల్లడిం చారు. ఈ నెల 18న మల్లాపూర్ లోని బాబానగర్ కు చెందిన సూరెడ్డి సుజాత(65) కనిపించడం లేదని కుటుంబ సభ్యులు నాచారం పీఎస్లోలో ఫిర్యాదు చేశారు. కాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మడ్డు అంజిబాబు(31) రెండు నెలల క్రితం సూరెడ్డి సుజాత ఇంట్లో అద్దెకు ఉంటూ ప్రైవేటుగా డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. ఒంటరిగా ఇంట్లో ఉంటున్న సుజాతను హత్యచేసి బంగారు నగలు చోరీ చేయాలని పథకం వేశాడు. ఈ నెల 18న వృద్ధురాలు సుజాత గొంతు నులిమి చంపాడు. అనంతరం తన బావమర్ది నక్కంటి యువరాజు(18), స్నేహితుడు నూకల దుర్గారావు(35) సాయంతో మృతదేహాన్ని కారు డిక్కీలో వేసుకుని ఆంధ్రప్రదేశ్ లోని కోనసీమ జిల్లాకు చేరుకుని కృష్ణ లంకలోని గోదావరి నదిలో పడేశారు.

## లిఫ్ట్ గుంతలో పడి మహిళ మృతి..

**రంగారెడ్డి:**లిఫ్ట్ గుంతలోపడి మహిళ మృతి చెందింది. రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సన్ సిటీ సమీపంలోనీ మూన్ రాక్ అపార్ట్మెంట్లో తన కొడుకు ఇంటి కి శుభకార్యక్రమం కోసం లక్ష్మమ్మ (60 ) లింగయ్య (65) దంపతులు వచ్చారు. శుభకార్యం ముగించుకున్న తర్వాత లక్ష్మమ్మ లింగయ్య భార్యాభర్తలు ఇద్దరు కలిసి తిరిగి షామీర్పేట్ లో తన నివాసానికి వెళు తున్న సమయంలో అపార్ట్మెంట్ లో ఉన్న లిఫ్ట వద్దకు వచ్చి లిఫ్ట్ డోర్ ఓపెన్ ఉందనుకొని లక్ష్మమ్మ అందులో కాలు పెట్టేసరికి ఒక్కసారిగా నాలుగవ అంతస్తు నుంచి లిఫ్ట్లో కిందపడి మృతి చెందింది.అపార్ట్ మెంట్లో ఉన్న లిఫ్టును మెయింటెనెన్స్ కూడా లేకపోవడం తో ఈ ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఒక్కసారిగా భార్య లిఫ్ట్ లో పడి మృతి చెందగానే లింగయ్య బోరుమని ఏడ్చాడు. వెంటనే అపార్ట్మెంట్లో ఉన్న స్థానికులు చూసి ప్రైవేట్ హాస్పిటల్ కి తరలించారు. అప్పటికీ లక్ష్మమ్మ మృతి చెందినట్టుగా వైద్యులు తెలిపారు. రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు...

## తిరుమల శ్రీవారి సేవలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి



**తిరుమల:**తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తిరుమలలో వైకుంఠద్వార దర్శనాలు మంగళవారం తెల్లవారుజామున 1.30 గంటల నుంచి ప్రారంభమయ్యాయి. రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకొని ఉత్తర ద్వారం గుండా బయటకు వచ్చారు.అంతకుముందు ఆలయానికి వచ్చిన ఆయనకు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఇతర అధికారులు స్వాగతం పలికారు. దర్శనానంతరం అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనాలిచ్చారు.

# సమస్యల పరిష్కారమే ఏజెండాగా పనిచేస్తాం...

**నాగర్ కర్నూల్ డిసెంబర్ 30( స్కై న్యూస్)** జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే ఎజెండాగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ పనిచేస్తుందని జిల్లా అధ్యక్షులు పరిపూర్ణం కార్యదర్శి వెంకటస్వామి కోశాధికారి పరమేశ్వర్ లు అన్నారు జిల్లాలోని సోమశిల లో నిర్వహించిన మూడవ జిల్లా మహాసభలో నూతన జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని ఈ సందర్భంగా వివరించారు. జిల్లాలో అనేక సంవత్సరాలుగా జర్నలిస్టులు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తున్నారని వివరించారు. జర్నలిస్టుల హక్కులను సాధించేందుకు రాబోయే రోజుల్లో జర్నలిస్టులను కలుపుకొని పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. అనునిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని వార్తల రూపంలో మలిచి అధికారుల దృష్టికి వాటిని తీసుకువెళ్లి పరిష్కరించడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని గుర్తు




చేశారు. నిస్వార్థంగా ప్రజలకు సేవలు అందిస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూడా అమలు చేయకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వల్ల జర్నలిస్టుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న సిద్ధంగా మారాయని విమర్శించారు. జిల్లాలో జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డుల సమస్య ప్రధానంగా వినిపిస్తుందని ప్రభుత్వం యూనియన్లతో సంబంధం లేకుండా పనిచేస్తున్న ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు ఇవ్వాలని అందుకు ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. జర్నలిస్టులకు యాజమాన్యాలు కల్పించవలసిన సౌకర్యాలను కూడా కల్పించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి జర్నలిస్టుకు ఇండ్లు ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. అన్ని ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రిలో అమలు అయ్యే విధంగా ప్రత్యేక హెల్త్ కార్డు మంజూరు చేయాలని గతంలో ఫెడరేషన్ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. ఇటీవల ప్రభుత్వం అక్రిడేషన్ కార్డు మంజూరులో తీసుకువచ్చిన జీవోను రద్దు చేయాలని కోరారు

## రంగారెడ్డిలో యూరియా కొరత లేదు

**కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్, డిసెంబర్ 29:-** రంగారెడ్డి జిల్లాలో యూరియా కొరత లేదని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని జిల్లావ్యాప్తంగా యూరియా సరఫరా పూర్తిస్థాయిలో కొనసాగుతోందని తెలిపారు.ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేస్తున్న అన్ని యూరియా పంపిణీ కేంద్రాల్లో అవసరమైనంత స్టాక్ అందుబాటులో ఉందని పేర్కొన్నారు.రైతులకు సౌకర్యవంతంగా,క్రమబద్ధంగా యూరియా పంపిణీ జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు విక్రయ కేంద్రాల్లో రైతులకు స్పష్టంగా కనిపించే విధంగా స్టాక్ వివరాలతో బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు యూరియా సరఫరా విషయంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, అవసరమైన యూరియా పూర్తిగా అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ భరోసా ఇచ్చారు యూరియా పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరగకుండా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేస్తామని తెలిపారు.అలాగే విక్రయ కేంద్రాలకు యూరియా సరఫరా తగినంతగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎక్కడా అంతరాయం లేకుండా స్టాక్ అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## వైకుంఠ ఏకాదశి సందర్భంగా వెంకటేశ్వర స్వామినీ దర్శించుకున్న సుప్రీంకోర్టు అదనపు సొలిసిటర్ జనరల్ కె. రవీంద్ర కుమార్ ఉషారాణి దంపతులు

**స్వాగతం పలికిన షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు**

**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్, డిసెంబర్ 30 :-** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఫరూఖ్ నగర్ లో అత్యంత చారిత్రాత్మక పుణ్యక్షేత్రం జానంపేట శ్రీ వెంకటేశ్వర స్వామినీ సుప్రీంకోర్టు అదనపు సొలిసిటర్ జనరల్ కనకమెడల రవీంద్ర కుమార్, ఉషారాణి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వారిని స్థానిక మాజీ ఎమ్మెల్యే ఆలయ భక్తుడు మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు స్వాగతం పలికారు ఈ సందర్భంగా వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆయన వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు ఈ సందర్భంగా స్వామివారికి అర్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించుకున్న అనంతరం కనకమేడల రవీంద్ర కుమార్, ఉషారాణి దంపతులను మర్యాదపూర్వకంగా సన్మానించారు ఆలయ అర్చకులు వేదమంత్రాల మధ్య వారికి సన్మానం చేశారు ఈ సందర్భంగా తీర్థప్రసాదాలను వారికి అందజేశారు దంపతులకు చీర పసుపు కుంకుమలు అమ్మవారివి అందజేశారు చారిత్రాత్మక దేవాలయం వెంకటేశ్వర స్వామి ఆలయానికి రావడం ఎంతో సంతోషంగా





ఉందని సుప్రీంకోర్టు అదనపు సొలిసిటర్ జనరల్ రవీంద్ర కుమార్ మీడియాకు తెలిపారు గతంలో ఆలయాన్ని సందర్శించడం జరిగిందని ఇక్కడ వైకుంఠ ద్వారం కూడా తన చేతిలో మీదుగా అప్పట్లో ప్రారంభించడం జరిగిందని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులును అదే విధంగా ఆలయ నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు ఆధ్యాత్మిక వైభవోపేతానికి సహకరిస్తున్న వారందరికీ ఆయన అభినందించారు ఇంత గొప్పగా వైకుంఠ ఏకాదశి ఏర్పాటు జరిగాయని పేర్కొన్నారు మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు మాట్లాడుతూ ఆలయ సందర్శన చేసినందుకు దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారి శ్యాంసుందర్ రెడ్డి, జర్నలిస్టు కేపీ, రాఘవేంద్ర గౌడ్, యువ నాయకులు ఒగ్గు కిషోర్, మాజీ కౌన్సిలర్ ప్రతాప్ రెడ్డి, వినాయక స్టీల్స్ వెంకటేశ్వర్లు దంపతులు తదితరులు ఉన్నారు.

## అయ్యప్ప స్వాముల సన్నిధానం నిర్మాణం కోసం లక్ష రూపాయలను విరాళంగా అందజేసిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ డిసెంబర్ 30:-** రంగా రెడ్డి జిల్లా కొత్తూరు మండలం కొడిచెర్ల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వాముల సన్నిధానం నిర్మాణం కోసం మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు సన్నిధానం నిర్మాణంలో భాగంగా తమకు అనువైన విధంగా డబ్బులను వినియోగించుకోవాలని సూచించారు హిందూ సంస్కృతి సంప్రదాయాలను పాటిస్తూ తమ ఇష్ట దైవాన్ని నిత్యం పూజించాలని శ్రీ అయ్యప్ప స్వామి నామస్మరణ చేస్తే మంచి జరుగుతుందని ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ అభిప్రాయపడ్డారు సన్నిధానం నిర్మాణం కోసం విరాళాన్ని అందజేయడం పట్ల గ్రామ అయ్యప్ప స్వామి భక్తులు, గ్రామస్తులు వర్షం వ్యక్తం చేస్తూ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో కొడిచెర్ల బీఆర్ఎస్ నాయకులు నరసింహా రెడ్డి, జంగయ్య యాదవ్, మాణిక్యం రెడ్డి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## 14న ఏకలవ్యని జాతర...



**నాగర్ కర్నూల్ డిసెంబర్ 30( స్కై న్యూస్)** జిల్లా కేంద్రంలో జనవరి 14న విలువిద్య కారులు ఏకలవ్యని జాతరను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఇరుకలి సంఘం ఉపాధ్యక్షులు కూరాకుల శ్రీనివాస్ తెలిపారు కార్యక్రమ కరపత్రాలను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి ఆవిష్కరించారు ఈ సందర్భంగా కూరాకుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఏకలవ్యని చరిత్ర నేటి యువతరానికి తెలపవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటదని అన్నారు. విలువిద్యలో రాణించేందుకు ద్రోణాచార్యులు వద్దకు వెళ్లి విద్యను నేర్పించాలని కోరగా తక్కువ కులం వారికి విద్యను నేర్పించాడని తిరస్కరించడంతో అవమానంతో కుంగిపోకుండా పట్టుదలతో అతని బొమ్మను తయారు చేసుకుని ఏకాగ్రతతో విలువిద్యను అభ్యసించి వాటిలో రాణించిన మహాయోధుడు ఏకలవ్యుడు అని కొనియాడారు. ఇలాంటి జాతర భారత దేశవ్యాప్తంగా హర్యానా రాష్ట్రం గురు గ్రామం జిల్లా ఖందాస్ గ్రామంలో మరియు జిల్లా కేంద్రంలో మాత్రమే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎరుకలి సంఘం కు నాయకులు కార్యకర్తలు అంబేద్కర్ వాదులు దళిత బడుగు బలహీన వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొండ నాగేష్ మాజీ కౌన్సిలర్లు హబీబ్ కావలి శ్రీను నిజాముద్దీన్ దళిత మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు వంకేశ్వరం నిరంజన్ మాజీ ఎంపిటిసి పాపమ్మ పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు

## రైలు కింద పడి గుర్తు తెలియని మహిళ మృతి




**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్, డిసెంబర్ 29:-** రంగారెడ్డి జిల్లాలోని కొత్తూరు మండలంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడని రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లేష్ సమాచారం అందించారు వివరాల ప్రకారం నిన్న రాత్రి అనగా ఆదివారం సుమారు 10గంటల 30నిముషాల ప్రాంతంలో కొత్తూరు రైల్వే బ్రిడ్జి సమీపంలో కాచిగూడ నుంచి చిత్తూరు వైపు వెళ్లే వేంకటాద్రి ఎక్స్‌ప్రెస్ తగిలి అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు వయసు సుమారు 35 నుండి 40సంవత్సరాలు ఉండొచ్చని అన్నారు మృతి చెందిన వ్యక్తి బ్లాక్ కలర్ షర్ట్, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడని ప్రస్తుతం మృత దేహం షాద్ నగర్ ప్రభుత్వ హాస్పిటల్ లో ఉన్నదన్నారు ట్రైన్ మేనేజర్ ఫిర్యాదు మేరకు రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు,పేర్కొన్నారు ఇతని ఆచూకీ తెలిసిన వారు 9848090426 చరవాణిలో సంప్రదించాలని కోరారు.

## ఆధ్యాత్మికతను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి...

**పదవ వార్డు మాజీ కౌన్సిలర్ బాదం సునీత నరేందర్**



**నాగర్ కర్నూల్ డిసెంబర్ 30( స్కై న్యూస్)** ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికతను పెంపొందించుకొని సంపాదించిన వాటిలో ఎంతో కొంత ఆలయాల అభివృద్ధికి వినియోగించాలని పదో వార్డు మాజీ కౌన్సిలర్ బాదం సునీత నరేందర్ అన్నారు మంగళవారం వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని ఓం నగర్ కాలనీలో గల సంతోష్ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భోజనశాల షెడ్డును నిర్మించేందుకు లక్ష రూపాయలను ఆర్థిక సహాయం అందించారు ఈ సందర్భంగా పనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయాలు సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుతాయని ప్రతి ఒక్కరూ వాటిని రక్షించేందుకు ముందుకు రావాలని కోరారు. ఆలయాలలో భక్తులకు సౌకర్యం కల్పించేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు భాగ్యమ్మ సాయిబాబా తోపాటు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## అంబేద్కర్ ను అవమానించిన ఎస్ఐను తొలగించాలి...

**నాగర్ కర్నూల్ డిసెంబర్ 30( స్కై న్యూస్ ):**భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను అవమానించిన తెలకపల్లి ఎస్ఐ ను మరియు రాకుండా పంచాయతీ కార్యదర్శులు విధుల నుండి తొలగించాలని 24 గంటల్లో అక్కడ నిర్మించనున్న కాంగ్రెస్ జెండా దిమ్మెను తొలగించాలని జిల్లా స్వేరో నెట్వర్క్ కో కన్వీనర్ గిద్ద విజయ్ కుమార్ స్వేరో డిమాండ్ చేశారు మంగళవారం నియోజకవర్గంలోని కిమాజీపేట మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని గౌరవించే వ్యక్తులను మాత్రమే అధికారులుగా నియమించాలని అవమానించిన ఎస్ఐ సేవలు జిల్లాలో అవసరం లేదని మండిపడ్డారు. ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎంతో శ్రమ కోర్చి భారత రాజ్యాంగాన్ని రచించడం జరిగిందని అందులో ప్రతి పౌరుడికి హక్కులను బాధ్యతలను పొందుపరచడం జరిగిందని శాంతిభద్రతలు రక్షణ రంగం ని కాపాడవలసిన పోలీస్ అధికారులు కాంగ్రెస్ పార్టీకి కొమ్ముకాస్తూ కాంగ్రెస్ పార్టీ దిమ్మెను ఏర్పాటు చేయడంలో నాయకులకు సహకరించడం రాజ్యాంగ విరుద్ధమని మండిపడ్డారు. సమావేశంలో అంబేద్కర్



సంఘం అధ్యక్షులు జోగు ఉషయ్య మాట్లాడుతూ ప్రజలకు రక్షణ కల్పించవలసిన ఎస్సై ప్రజలు వ్యతిరేకించిన ప్రాంతంలో కాంగ్రెస్ జెండా దిమ్మెను ఏర్పాటు చేసేందుకు సహకరించడం దారుణమని వెంటనే వారిపై చర్యలు తీసుకొని తొలగించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణా నాయక్ ఉపసర్పంచ్ జోగు వెంకటయ్య తో పాటు నాయకుడు రాజు శ్రీకాంత్ శివకుమార్ మహేష్ తదితరులు పాల్గొన్నారు

## సిపిఐ ఉద్యమ చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**జనవరి 18న సిపిఐ వందేళ్ల ముగింపు ఉత్సావాలు**

**ప్రతి కమ్యూనిస్టు కుటుంబం వందేళ్ల ఉత్సవాల్లో భాగస్వామ్యం కావాలి**

**3 నుంచి 7 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రచార జాతా**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**

**కొత్తగూడెం డిసెంబర్ 30( స్కై న్యూస్):** సిపిఐ వందేళ్ల ఉత్సవాలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్'లో జరిగిన సిపిఐ పట్టణ విస్తృత జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల చరిత్ర కార్మిక, కర్షక, పేద ప్రజల పోరాటాలతో ముడిపడి ఉందన్నారు. జనవరి 18న ఖమ్మంలో జరిగే సిపిఐ వందేళ్ల బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలిరావాలని కోరారు. ప్రతి కమ్యూనిస్టు కుటుంబం ఈ చారిత్రక ఉత్సవాల్లో తప్పకుండా పాల్గొనాలన్నారు. వందేళ్ల ఉత్సవాల ప్రచారంలో భాగంగా ఈ నెల 3 నుంచి 7 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రచార జాతా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ జాతా ద్వారా సిపిఐ పోరాట చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కమ్యూనిస్టు భావజాలం మరింత అవసరమని, ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఐ ముందుండి పోరాడుతుందన్నారు. పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేసి వందేళ్ల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఉత్సావాల ప్రచారంలో భాగంగా జనవరి 3 నుంచి 7 వరకు



జిల్లా వ్యాపితంగా ప్రచార జత కార్యక్రమాన్ని చేపట్టబోతున్నామని తెలిపారు. సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కందుల భాస్కర్, ఎస్ కె ఫహీమ్, పట్టణ నాయకులు నేరెళ్ల రమేష్, గొనె మణి, విజయలక్ష్మి, వంగ వెంకట్, గద్దం రాజయ్య, ఎండి యూసుఫ్, పిడుగు శ్రీనివాస్, గోపి కృష్ణ, నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు,గుత్తుల శ్రీనివాస్, పి సత్యనారాయణాచారి, తూముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తా

**మహిళా చైతన్యానికి ప్రత్యేక కృషి**



**నాగర్ కర్నూల్ డిసెంబర్ 30( స్కై న్యూస్)** జాతీయ బిసి సంక్షేమ సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలుగా తనను నియమించిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ కృష్ణయ్యకు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పద్మలకు జిల్లా అధ్యక్షురాలు చౌదర్ల రేణుక అభినందనలు తెలిపారు. రాష్ట్ర కార్యాలయంలో నియామక పత్రాన్ని అందించిన అనంతరం పలువురు నాయకులు ఆమెను సన్మానించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం పిలుపులో భాగంగా మహిళలను చైతన్యవంతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన దక్కవలసిన రిజర్వేషన్లను సాధించేందుకు నిర్వహించే కార్యక్రమాలలో మహిళలను భాగస్వామ్యం చేసే విధంగా తాను ప్రణాళిక బద్ధంగా జిల్లాలో పనిచేస్తానని హామీ ఇచ్చారు. బీసీ మహిళలు రాజకీయంగా ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు రాష్ట్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించే రాబోయే రోజులలో మహిళల సత్తా చాటుతామని వివరించారు ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం అధ్యక్షులు తిరుపతయ్య ఉపాధ్యక్షులు రామకృష్ణ నిరంజన్ తదితరులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు

వార్తాతరంగాలు
బుధవారం 31 డిసెంబర్ 2025

## వ్యాధి నిరోధక శక్తిని పెంచేందుకు టీకాలు తప్పనిసరి....



నాగర్ కర్నూల్ డిసెంబర్ 30( స్కై న్యూస్) మూగజీవాలలో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించేందుకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారులు డాక్టర్ కల్పన డాక్టర్ అశోక్ లు కోరారు మంగళవారం మండల పరిధిలోని పెద్దాపురం కుమ్మెర గ్రామాలలో జిల్లా పశు వైద్య మరియు సమర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో మూగజీవాలకు ఉచితంగా నట్టల నివారణ మందులను పంపిణీ చేయడం జరిగిందని వివరించారు. 6930 గొర్రెలకు మరియు 684 మేకలకు వాటిని అందించడం జరిగిందని దీని ద్వారా జీవాడలో అంతర పరాలజీవులు నిర్మూలించబడి బరువు పెరగడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి ఉత్పాదకర శక్తి పెరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమాలలో సర్పంచులు తుకారాం రెడ్డి మణెమ్మ ఉప సర్పంచ్లు రవి బాబు రెడ్డి పశువైద్య సిబ్బంది మాధ్య నాయక్ శ్రీశైలం వినయ్ మక్బూల్ సతీష్ కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు

## వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారా దర్శనం



**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 30(స్కై న్యూస్):** వైకుంఠ ఏకాదశి సందర్భంగా మంగళవారం ఉత్తర ద్వార ప్రవేశం.జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల పట్టణంలో శ్రీ భూలక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయం నందు ,శ్రీ గోదా రంగనాథ స్వామి దేవాలయం బురద పేట నందు భక్తులు ఉత్తర ద్వారా ప్రవేశం కొరకు బారులు తీరారు. ఉత్తర ద్వారం ద్వారా ఆలయంలోనికి గోవింద నామ స్మరణతో ప్రవేశించి భగవంతునికి నైవేద్యం సమర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కలు తీర్చుకున్నారు. ముక్కోటి దేవతలు దిగివచ్చే వైకుంఠ ఏకాదశి రోజున శ్రీ మహా విష్ణువును దర్శించుకుంటే కోటి రెట్ల పుణ్యం లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం, సకల పాపాలు తొలగి పోవాలని వైకుంఠ ఏకాదశి వ్రతాన్ని ఆచరిస్తారు. పట్టణంలోని పలు ఆలయాల్లో గోవింద నామస్మరణతో వైకుంఠ దర్శనం చేసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ విచారణ కర్త ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆశయాలను కొనసాగిద్దాం...

**బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్, డిసెంబర్ 30:-** రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలంలోని ఉత్తరాసిపల్లి గ్రామంలో చత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ నూతన విగ్రహ స్థాపనకు భూమి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ స్థాపనకు గ్రామ యువత ముందుకు రావడం సంతోషకరమైన విషయమని అన్నారు 16వ శతాబ్దంలో శివాజీ మహారాజ్ తీసుకొచ్చిన చైతన్యం నేడు ఉత్తరాసిపల్లి గ్రామంలో కనిపించడం ఆనందాన్ని కలిగిస్తోందన్నారు అప్పట్లో హిందూ ధర్మ పరిరక్షణ కోసం ఆయుధం పట్టిన శివాజీ మహారాజ్ యొక్క గొప్ప చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని పేర్కొన్నారు భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ మహనీయుల చరిత్రను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో బీజేపీ కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంత్ రెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బోయ శంకర్ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఈసరి సత్యనారాయణ ఛత్రపతి శివాజీ యూత్ అధ్యక్షులు మాణిక్య ప్రభు ఉపాధ్యక్షులు సాయిచరణ్ సీనియర్ నాయకులు శివారెడ్డి మోహన్ సింగ్ చేగు సుధాకర్ అప్ప రంగన్న గౌడ్, గ్రామ పెద్దలు అంజిరెడ్డి గోపాలరావు విజయ్ తమ్మలి నందు సత్యం మహేష్ వార్డ్ మెంబర్ పోతుల శ్రీకాంత్, కమ్మరి రాజు రామరాజు దినేష్ రెడ్డి మంగలి బుగ్గయ్య మంగ రమేష్ పొట్ట సత్యం పొట్ట శివకుమార్ అలాగే శివాజీ యూత్ సభ్యులు చాకలి రమేష్ బోయ రాజు బోయ రామస్వామి ఎం. మల్లేష్ సాలె మహేష్ దినేష్, మహేష్ కుమార్ బ్యాగరి రవికుమార్ మల్గ రమేష్ మల్ల లక్ష్మణ్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జిల్లాలో యూరియా కొరత లేదు



**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 30(స్కై న్యూస్):**జోగులాంబ గద్వాల జిల్లాలో రైతులకు కావాల్సినంత యూరియా అందుబాటులో ఉందని, కొరత ఉన్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పలుచోట్ల రైతులు యూరియా కోసం బారులు తీరి ఇబ్బందులు పడుతున్నట్లు కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తల్లో వాస్తవం లేదన్నారు. రైతులు ప్రస్తుత పంటకు కావాల్సినంత యూరియా తీసుకోవచ్చని, కొరత వస్తుందేమోనని ఆందోళన పడవద్దు అన్నారు. జిల్లాలో ఇప్పటిదాకా 5816 మెట్రిక్ టన్నుల యూరియా అందించగా, ఇంకా 8124 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. పిఎసిఎస్ కేంద్రాలతో పాటు అగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లోనూ యూరియా అందుబాటులో ఉందన్నారు. గద్వాల మండల పిఎసిఎస్ కేంద్రం వద్ద రైతులు ఎక్కువగా లైన్ లో ఉంటుండడంతో పాత బస్టాండు, మార్కెట్ యార్డులో ఉన్న అగ్రోస్ కేంద్రాల వద్ద కూడా యూరియా తీసుకోవచ్చు అన్నారు. రైతులు యూరియా తీసుకునేందుకు వచ్చేటప్పుడు తమ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ లు తీసుకొని రావాలన్నారు. యూరియా కొనుగోలులో ఎలాంటి సమస్యలు ఎదురైనా రైతులు సంబంధిత మండల వ్యవసాయాధికారులను సంప్రదించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

# పారిషియన్ వ్యానిశర్ నవల ఆవిష్కరణ

**మిస్ టీన్ గా ప్రశంసలు అందుకున్న రచయిత్రి అవ్యాక్త**
**13 ఏళ్ల అవ్యక్త గెల్ల కాలగమన నవల**
**వ్యాపారుల విద్యావేత్తల అభినందనలతో**
**సాహిత్య ఆధ్యాత్మిక కళలతో అలరాడిన**
**తాటిపల్లి ప్రాంగణం**

**తెలుగు ఇంగ్లీషు భాషలో నవల ఆవిష్కరణ**
**లక్ష్మీ సరస్వతి కటాక్షాన్ని సొంతం చేసుకున్న తాటిపల్లి వారి మనవరాలు**
**ప్రశంసించిన విద్యావేత్తలు రచయితలు వ్యాపారులు**
**పాటలు తెలుగు అనువాదానికి సత్కారం**







**కొత్తగూడెం డిసెంబర్ 30( స్కై న్యూస్):**ప్రముఖ వ్యాపారవేత్త వసుంధర షాపింగ్ మాల్ అధినేత తాటిపల్లి శంకర్ బాబు 13 ఏళ్ల అమెరికా మనవరాలు పార్శియన్ వానిషర్ నవలను అతి చిన్న వయసులో గత నేటి కాల గమన తీరుతెన్నులను కళ్లకు కట్టినట్టుగా రచన చేసి రూపుదిద్దిన సందర్భంగా జరిగిన పుస్తకావిష్కరణ సమావేశం కొత్తగూడెం తాటిపల్లి ప్రాంగణంలో జరిగినది. తాటి పల్లి కుటుంబ మనవరాలు ప్రవాస భారతీయ సంతతికి చెందిన కుమారి అవ్యాక్త రచించిన ఇంగ్లీషు తెలుగు నవలను, ముఖ్య అతిథులు ఇండియన్ వైశ్య ఫెడరేషన్ జాతీయఅధ్యక్షులు ఉప్పల శ్రీనివాస గుప్తా, విద్యాసంస్థల విద్యా సంస్కర్త, వ్యాపార వేత్త, దోసపాటి వెంకటేశ్వరరావు ,ఆత్మీయ అతిథులుగా లైన్స్ క్లబ్ ప్రము ఖ్, కోనేరు పూర్ణచంద్రరావు,ఏరియా మేనేజర్ రజేంద్రబాబు,ప్రముఖరాజకీయ,సంఘసంస్కర్త సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా తెలుగు ఇంగ్లీష్ లో ఉన్నటువంటి నవలలను ఆవిష్కరించారు. పారిషియన్ అదృశ్యాలు- పారిషియన్ మాయావి ,నాటి నేటి తరం తీరుతన్నులతో పొందుపరచబడిన అధ్యాయాలు నేటి విద్యార్థులకు స్ఫూర్తిదాయంగా ఉన్నాయి. ప్రముఖ వ్యాఖ్యాత, కార్యక్రమ నిర్వాహకులు తేరాల వీరభద్రరావు నవల ధారావాహిక తీరు తెన్నులను కళ్లకు కట్టినట్లు వ్యాఖ్యానం చేశారు రచనల సారాంశము పాటల రూపంలో సాగిన సాహిత్య ప్రాంగణం అందరిని మంత్రముగ్ధులను చేసింది నవలను రచించిన అవ్యక్త అమ్మమ్మ తాతయ్య తాటిపల్లిరాజేశ్వరి శంకర్ బాబుల ఆశీర్వచన పాట అవయుక్త గెల్లా నీ తాతనోయి నా మదిని కదిలించే ఉయ్యాలఓయా.. రాజరాజేశ్వరి శంకరుల ఆశీస్సు నీ వెంట ఎప్పుడూ నిండు గుండెను.తాటిపల్లి వారి ఆశీస్సులమ్మ అందుకో తాతయ్య అమ్మమ్మ మనస్సు అనే పాట,వారి సంతోషానికి, పిల్లల విద్యోన్నతి ఆనందానికి అవధులు ఆకాశానంటాయి ఈ సందర్భంగా సమావేశ సభాస్థలిలో జరిగిన ఆధ్యాత్మిక సాంస్కృతిక విద్యా కార్యక్రమాలు అమృత వర్ధిని సంగీత గాన కచేరి ప్రముఖ్ అలిపి రెడ్డి ఉదయభాస్కర్ శిష్య బృందం, శ్రీ సరస్వతీ శిశు మందిర్ కూలి లైన్ పాఠశాల ఆచార్యులచే ఏర్పాటుచేసిన ఆధ్యాత్మిక నృత్య సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పారిషియన్ మాయావి అదృశ్యాలుగా తెలుగు వాఖ్యాన సంపుటి పారిషియన్ గత ప్రస్తుత చరితాన్ని ఇప్పటి అప్పటి కాలగమనాన్ని గత ఛాయాచిత్రాల ద్వారా పారిషియన్ మాయావి అదృశ్యాలుగా రచయిత్రికుమారి అవ్యక్త ఇంగ్లీషు పదగుంభాలను తెలుగులో పదిలపరచబడిన తీరుతెన్నుల వాఖ్యానం పలువురిని ఆకర్షించింది కుమారి అవ్యక్త నవల రచనను సంతోష సంబరాలతో తాతయ్య అమ్మమ్మలు జరుపుకునే తీరుతెన్నులు అందరూ అనుసరించే విధంగా కార్యక్రమం అలరించింది విద్యా సంస్కర్త లు ముఖ్య అతిథులు రచయిత్రి కుమారి అవ్యక్తను ఆశీర్వదిస్తూ ప్రశంసా ప్రసంగాలు చేశారు నవలా రచయితగా మిస్ టీన్ గా ప్రశంసలు అందుకున్న రచయిత్రి అవ్యక్త మనవరాలు గా జన్మించటం అదృష్టం అంటూ పేర్కొంటూ ప్రసంగించే అమ్మమ్మా తాతయ్యల, నానమ్మ తాతయ్యల సందర్భ ఉపన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి నవల రచనను, అధ్యాయాలు గా,పాటల రూపంగా అందించిన రామానుజమ్ ఆర్ ఎస్ ఆచార్య ను నవలా రచయిత్రి అవ్యక్త తాతయ్య వసుంధర షాపింగ్ మాల్ చైర్మన్ తాటిపల్లి శంకర్ బాబు, ముఖ్య అతిథులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ కె ఛారిటీ చైర్మన్ కే వి రంగా కిరణ్, రాజకీయ సంఘ సంస్కర్తలు నాగ సీతారాములు, ఆళ్ల మురళి,తూము చౌదరి, ఛాంబర్ అఫ్ కామర్స్ అధ్యక్షులు కొదుమూరి శ్రీనివాస్, నాగేంద్ర త్రివేది, గుడాల అచ్యుత రావు, బోగ నారాయణ,అయిత ప్రకాష్ రావు,కూర శ్రీధర్, కంభంపాటి రమేష్, దార రమేష్,వందనము శ్రీధర్, గునిపాటి ఆనంద్, రాజేంద్ర అగర్వాల్,సరంజన్ అగర్వాల్ , భజరంగ్ అగర్వాల్ విద్యా సంస్క ర్త అబ్దుల్ బాసిత్ ,డాక్టర్లు,న్యాయవాద ప్రముఖ్ పలివెల సాంబశివరావు,పలువురు విద్యావేత్తలు, విశ్రాంత మండల అధికారి విద్యా ప్రముఖ్ డాక్టర్ ప్రభుదయల్, సంఘ ప్రముఖ్ లు పిల్లి రాజేశ్వరరావు,గుర్రం వెంకటరెడ్డి, వాసవీ క్లబ్ సంచాలకులు, దేవీ వాసవీ కన్యకా పరమేశ్వరి పరివార మహిళా సమితి, ఉపాధ్యాయులు, రచయితలు, శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఆచార్యులు స్రవంతి, సాహితీ కల్పనలు, ఆచార్యబృందం పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు

# భద్రాద్రిలో వైకుంఠ ద్వార దర్శన మహోత్సవం

**ఉత్తర ద్వార దర్శనంతో తరించిన భక్తజనం**
**వైకుంఠ రాముడిగా దర్శనమిచ్చిన భద్రాద్రి రామయ్య**







**భద్రాచలం డిసెంబర్ 30 ( స్కై న్యూస్ ):**దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధిగాంచిన భద్రాచలంలో ముక్కోటి ఏకాదశి మహోత్సవాలు ఆధ్యాత్మిక వైభవోపేతంగా, భక్తుల హృదయాలను ఉప్పొంగించేలా ఘనంగా నిర్వహించబడ్డాయి. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిచ్చి అనుగ్రహించారు. వైకుంఠ రాముడిగా అలంకరించబడిన స్వామివారి దివ్య దర్శనంతో భక్తులు పరవశించి, శ్రీ రామ జయ రామ జయ జయ రామ అనే జయజయ ధ్వానాలతో భద్రాద్రి క్షేత్రం మారుమోగింది. ఉత్తర ద్వార దర్శనాన్ని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వీవీఐపీ, వీఐపీ సెక్టార్లతో పాటు సాధారణ భక్తుల కోసం ఏర్పాటు చేసిన వివిధ సెక్టార్లలో భక్తులు శాంతియుతంగా వేడుకలను తిలకించారు. వేదపండితులు, స్థానాచార్యులు ముక్కోటి ఏకాదశి విశిష్టతను వివరించగా, అర్చకులు 108 ఒత్తులతో మహా హారతి నిర్వహించారు. అనంతరం ఉత్తర ద్వారం ద్వారా దర్శనం అనంతరం ఉత్సవ మూర్తులను మాడ వీధుల్లో భక్తిశ్రద్ధల మధ్య ఊరేగించారు. ఈ సందర్భంగా స్వామివారు గరుడ వాహనరూపుడిగా శ్రీమహావిష్ణువు అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు విశేష ఆరాధనలు, శ్రీరామ పదాక్షరీ మంత్ర సంపుటిత అష్టోత్తర శతనామార్చన, చతుర్వేద పఠనం, గరుడ ప్రబంధాలు, ఇతిహాస పఠనం, శరణాగతి గజ్జగరుడ దండం, భక్తరామదాసు రచించిన దాశరథి శతక పఠనం నిర్వహించారు. వైకుంఠ రాముడికి అష్టోత్తర శత హారతిని భక్తిశ్రద్ధలతో సమర్పించారు. భక్తరామదాసు కాలం నుంచీ కొనసాగుతున్న సంప్రదాయం ప్రకారం భద్రాచలం తహసీల్దార్ శ్రీనివాస్ మూలవిరాట్టులకు స్నపన కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర ద్వార దర్శనం అనంతరం వైకుంఠరాముడు తిరువీధి సేవకు బయలుదేరారు. చలువ చప్పర వాహనంపై పెరియాళ్వార్, నమ్మాళ్వార్, మరో వాహనంపై అండాళ్ అమ్మవారు, హనుమత్ వాహనంపై లక్ష్మణస్వామి, గజవాహనంపై సీతమ్మవారు, గరుడ వాహనంపై శ్రీ సీతారామచంద్రమూర్తుల తిరువీధి సేవ మేళతాళాలు, భాజా భజంత్రీలు, వేద మంత్రోచ్చారణల మధ్య శోభాయమానంగా సాగింది. రాపత్తు ఉత్సవాలతో వేడుకలు మరింత వైభవాన్ని సంతరించుకున్నాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎప్పటికప్పుడు యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ, ప్రతి సెక్టార్‌లో ఏర్పాట్ల పర్యవేక్షణకు జిల్లా అధికారులు, లైజన్ అధికారులను నియమించారు. బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ స్వయంగా పర్యవేక్షించారు. ఈ వేడుకకు భద్రాచలం, శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్ రావు, పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఐ టి డి ఏ పి ఓ రాహుల్, ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఏఎస్పీ విక్రాంత్ సింగ్, దేవస్థానం ఈఓ దామోదర్ రావు, భద్రాచలం సర్పంచ్ పూనం కృష్ణ దొర తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై స్వామివారి దర్శనం చేసుకున్నారు. వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు విజయవంతం %-% జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్. సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో నిర్వహించిన ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు, ఉత్తర ద్వార దర్శనం కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమర్థవంతమైన ఏర్పాట్లు చేయగలిగామని తెలిపారు. ఈ ఉత్సవాల నిర్వహణలో సహకరించిన జిల్లా యంత్రాంగానికి, భక్తులకు, పాత్రికేయులకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణపేట డిసెంబర్ 30 (స్కై న్యూస్)** నూతన సంవత్సర వేడుకలు నారాయణపేట జిల్లాలో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ... డిసెంబర్ 31 రాత్రి జాతీయ రహదారి, ప్రధాన రహదారులపై వేడుకలు నిషేధించబడ్డాయని ఎస్పీ పేర్కొన్నారు. ముఖ్యంగా మద్యం తాగి వాహనాలను నడపవద్దని, మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనాలు నడిపి ప్రమాదాలకు గురై తల్లిదండ్రులను క్షోభకు గురిచేయవద్దన్నారు. మద్యం దుకాణదారులు నిర్ణీత సమయం వరకే విక్రయాలు చేయాలన్నారు. అర్ధరాత్రి గుంపులు గుంపులుగా తిరుగుతూ.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకునేలా స్నేహపూర్వక వాతావరణంలో శుభాకాంక్షలు తెలుపుకోవాలని విద్యార్థులు, యువతకు సూచించారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ షీ టీమ్స్ ప్రత్యేకంగా పర్యవేక్షణ చేపడతాయని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ట్రాఫిక్, టాస్క్ ఫోర్స్, షీ టీమ్స్, పెట్రోలింగ్ బృందాలు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తాయని తెలిపారు. డీజేలకు అనుమతి లేదని, బాణసంచా కాల్చడంపై నిషేధం ఉంటుందని తెలిపారు. నూతన సంవత్సర వేడుకల్లో డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు చేపడతామని, డ్రగ్స్ సరఫరా చేసే ముఠాలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. బార్లు, వైన్ షాపులు నిర్దేశిత సమయానికి మూసివేయాలని, మైనర్లకు మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. డ్రంకెన్ అండ్ డ్రైవింగ్ పరీక్షలు కట్టుదిట్టంగా అమలు చేస్తామని, మైనర్లకు వాహనాలు ఇచ్చే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్ధరాత్రి యువకులు నిర్లక్ష్యంగా అధిక వేగంతో వాహనాలు నడపకుండా, బైక్ రేసులు జరగకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు కొనసాగుతుందన్నారు.

# కుషాయిగూడ వెంకటేశ్వర స్వామి గుడిలో ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లలో భక్తులకు ఇబ్బందులు

**కుషాయిగూడ వెంకటేశ్వర స్వామి గుడిలో విఐపి దర్శనాలతో సామాన్య భక్తులకు ఇబ్బందులు**

**సామాన్య భక్తులను గాలికి వదిలేసిన పాలకమండలి**

**పూర్తిస్థాయిలో ప్రసాదాలు అందించని పాలకమండలి ఇబ్బందులు ఎదుర్కొన్న భక్తులు**

**విఐపి ల చుట్టూ తిరిగిన పాలకమండలి కన్నెర్ర చేసిన భక్తులు**

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి డిసెంబర్ 30 (స్కై న్యూస్):** రాష్ట్రంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా అన్ని దేవాలయాలు కళకళలాడుతున్న సమయంలో కుషాయిగూడ వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులను ఇబ్బందులకు గురిచేసిన పాలకమండలి అని భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే కుషాయిగూడ వెంకటేశ్వర స్వామిని ముక్కోటి ఏకాదశి సందర్భంగా దర్శించుకోవడానికి వచ్చిన చుట్టుపక్కల ప్రాంత భక్తులను తీవ్ర అసహనానికి గురిచేసిన పాలకమండలి అని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్కాజిగిరి, కాప్రా చర్లపల్లి, ఈసీఐఎల్ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చే వేలాది మంది భక్తులకు క్యూ లైన్ లో నిలబడే భక్తులకు నీటి సౌకర్యం ఏర్పాటు చేయలేదని యాదాద్రి, తిరుపతి దేవాలయాలలో నీటి సదుపాయం ఏర్పాటు చేస్తారని అది ఇక్కడ చేయడంలో పాలకమండలి పూర్తిగా విఫలమయ్యారని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వీఐపీలు వచ్చినప్పుడు కుషాయిగూడ వెంకటేశ్వర స్వామి దేవాలయం భక్తులను గంటల తరబడి నిల్చుబెట్టారని, వంద రూపాయల టికెట్ భక్తులను గాలికి వదిలేసిన పాలకమండలని, వృద్ధులకు ఎలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని దర్శనానికి తప్ప ఇతర ఏర్పాట్లు చేయడంలో పూర్తిగా విఫలమైన పాలకమండలి అని భక్తులు తెలిపారు. స్వామివారి దర్శనం అనంతరం భక్తులకు ఇచ్చే ప్రసాదము 12 గంటల వరకు పూర్తిస్థాయిలో అయిపోయిందని అనంతరం ప్రసాదం ఇచ్చుటకు తగిన చర్యలు తీసుకోలేదని, లడ్డు పులిహోర టికెట్ ఇవ్వడంలో ఒకే కౌంటర్ ను ఏర్పాటు చేసి ప్రజలను తీవ్ర






ఇబ్బందులకు గురి చేశారని క్యూ లైన్ లో నిలబడిన భక్తులు తెలిపారు. ముక్కోటి ఏకాదశి భక్తులకు సదుపాయాలలో కుషాయిగూడ వెంకటేశ్వర స్వామి గుడి పాలకమండలి పూర్తిస్థాయిలో విఫలం చెందారని భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు గంటలు సామి దర్శనానికి సమయం పడిన అనంతరం ప్రసాదం దొరకలేక తీవ్ర నిరాశతో వెనుదిరిగి ఇంటికి బయలుదేరామని ఇలాంటి అవకతవకలు పునరావృతం కాకుండా చూడాలని భక్తులు కోరారు.

# క్లాస్మెంట్ రాష్ట్ర అధ్యక్షులుగా పరమేశ్వరయ్య...



**నాగర్ కర్నూల్ డిసెంబర్ 30( స్కై న్యూస్)** నూతన సంవత్సరంలో క్లాస్మెంట్ క్లబ్ ద్వారా నిర్వహించే సేవా కార్యక్రమాలకు రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు వాసా రాఘవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులుగా పరమేశ్వరయ్య ప్రధాన కార్యదర్శిగా నర్సిరెడ్డి కోశాధికారిగా చంద్రశేఖర్ లను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు పరమేశ్వరయ్య మాట్లాడుతూ తమ పరిధిలో నూతన సంవత్సరంలో విస్తృతంగా పేద విద్యార్థులకు ఆర్థిక సహాయంతో పాటు పాఠశాలలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. పేద విద్యార్థులు చదువులు ఇష్టంతో అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకొని పేద విద్యార్థులకు సహాయం అందించాలని కోరారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసులు జిల్లా అధ్యక్షుడు సీఎం రెడ్డి ప్రధాన కార్యదర్శి చిగుళ్లపల్లి రమణ కుమార్ డివిజన్ అధ్యక్షుడు కోదండరాములు తోపాటు రాజశేఖరరావు మాజీ రాష్ట్ర అధ్యక్షులు దర్శి రాజయ్య తోపాటు పెంటవరాజు నరసింహస్వామి రఘునందన్ సాయి శంకర్ విజయభాస్కర్ గుప్తా శివ రమేష్ లక్ష్మణస్వామి దత్తాత్రేయులు భాను ప్రకాష్ రెడ్డి నవీన్ తదితరులు పాల్గొన్నారు

# ఉత్తరద్వార దర్శనం పూజలో పాల్గొన్న డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల



**పాల్వంచ డిసెంబర్ 30( స్కై న్యూస్):** వైకుంఠ ఏకాదశి (ముక్కోటి) పర్వదినం సందర్భంగా పాల్వంచలో పలు దేవాలయాల్లో జరిగిన ఉత్తరద్వార దర్శనం పూజల్లో రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సతీమణి విమలాదేవి దంపతులు పాల్గొని, పూజలు చేశారు. మంగళవారం తెల్లవారుజామున పాత పాల్వంచలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో జరిగిన పల్లకి సేవలో ఆంజనేయస్వామి దేవాలయంలో, పాల్వంచ బొల్లోరిగూడెంలోని రామాలయంలో జరిగిన అభిషేకాలు, ద్వారదర్శనం, ప్రత్యేక పూజలలో కొత్వాల పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో పూజారి కందాల సింహాద్రి ఆనందకుమారాచార్యులు, కిలారి సుజాత, ఎస్వీ రామానుజాచార్యులు, సముద్రాల శ్రీనివాస్, కేశబోయిన కోటేశ్వరరావు, వెంకటనారాయణ, బాడిశ శంకర్ రావు, వెంకటేశ్వర్లు, లింగా రమేష్, హర్ష, పరమేశ్వరి వేణు, కొప్పరపు రాము తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్నం భోజనం పథకం జిల్లాస్థాయి వంటల పోటీలు

**జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి బి నాగలక్ష్మి**






**పాల్వంచ డిసెంబర్ 30 (స్కై న్యూస్ ):** భద్రాద్రి కొత్తగూడెం పాల్వంచలో జిల్లాలో డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషనల్ తెలంగాణ హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం 2025 వంటల పోటీలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొమ్ముగూడెం పాల్వంచ నందు నిర్వహించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి బి నాగలక్ష్మి తెలియజేసినారు 5 అంశాలలో ఈ పోటీలను నిర్వహించారు వంట వండే విధానం పాత్రల శుభ్రత ఆహార భద్రత వ్యక్తిగత పరిశుభ్రత రుచి అంశాలపై పోటీలు నిర్వహించారు ప్రధమ బహుమతి పి మంగమ్మ జడ్పీహెచ్ఎస్ పాత పాల్వంచ ద్వితీయ బహుమతి బి చిట్టెమ్మ జడ్పీహెచ్ఎస్ యానం బైలు తృతీయ బహుమతి పి శివకుమారి జడ్పిహెచ్ఎస్ కుర్రాజుల గుట్ట భద్రాచలం వారు గెలుపొందారు ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ శంభు ప్రసాద్ ఏసి జి ఈ ఎస్ మాధవరావు పాల్వంచ ఎంఈఓ ఎస్ శ్రీరామ్మూర్తి జడ్జిలుగా బి ప్రకాష్ రావు జరీనా భాను మౌలాలి ఆఫీస్ సిబ్బంది బి నవీన్ బి మోహన్ అర్జున్ విద్యార్థులు వంట ఏజెన్సీలు పాల్గొన్నారు

# ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి





షాద్ నగర్ నియోజకవర్గం పరిధిలోని ఫరూఖ్ నగర్ గ్రామంలో వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి ఈ సందర్భంలో షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి తదితరులు స్వామివారిని ఉత్తరద్వార దర్శనం ద్వారా దర్శించుకున్నారు ముక్కోటి ఏకాదశి రోజున మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి స్వామివారి సేవలో నిమగ్నమై, ప్రత్యేక పూజలు చేశారు వారికి ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారి ఆశీర్వచనాలు అందజేశారు ఆలయ సంప్రదాయాల ప్రకారం నిర్వహించిన పూజలు భక్తుల హృదయాల్లో ఆధ్యాత్మికతను నింపాయి ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి యొక్క ఆధ్యాత్మికతను, దాని మహిమను వివరించారు. ఈ పర్వదినం ప్రజల జీవితాల్లో శాంతిని, సంతోషాన్ని, అభివృద్ధిని తీసుకురావాలని ప్రార్థించారు. ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి దర్శించుకున్నరు, ఈ కార్యక్రమంలో షాద్ నగర్ ప్రముఖ న్యాయవాది కంచి రాజగోపాల్ మాజీ కౌన్సిలర్ వెంకటరామిరెడ్డి, గంగమోని సత్తయ్య, రఘు నాద్ యాదవ్, జంగారి రవి తదితరులు పాల్గొన్నారు.

# మల్దకల్ తిమ్మప్ప స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి మహోత్సవం

**భక్తజన వెల్లువ**

**తిమ్మప్ప స్వామి దర్శనానికి ఏకాదశికి వేలాదిగా భక్తుల సందడి**



**మల్దకల్ , డిసెంబర్ 30(స్కై న్యూస్):** మల్దకల్ మండల కేంద్రంలో వెలసిన శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఏకాదశి సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఉత్తర ద్వారం గుండా భక్తులకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఏకాదశి రోజున మూడు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని అంచనా వేసిన ఆలయ కమిటీ, దాదాపు 50 వేల వరకు భక్తులు దర్శనం చేసుకునే అవకాశం ఉందని పేర్కొంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆలయ పరిసరాలలో బారికేడ్లతో భారీగా క్యూ లైన్లను ఏర్పాటు చేసి, భక్తులు క్రమబద్ధంగా దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. భక్తుల భద్రతకు ఎలాంటి లోటు లేకుండా మల్దకల్ ఎస్సై నందికర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తును కట్టుదిట్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టారు.

# షాద్ నగర్ లో బ్రెయిన్ అన్యూరిజం అవగాహన పై యశోదా హాస్పిటల్ వైద్యులు మీడియా సమావేశం

ఒక్కోసారి తలనొప్పి కూడా ప్రాణాంతకం కావచ్చని, తరచుగా వస్తున్న తలనొప్పిని ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చేయకూడదని యశోదా హాస్పిటల్ (మలక్ పేట) కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ జయనంద్ సుధీర్, డాక్టర్ వంశి రెడ్డి, హాస్పిటల్స్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర తెలిపారు షాద్ నగర్ పట్టణంలోని హొటల్ దేవి గ్రాండ్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు ఈ సందర్భంగా న్యూరో సర్జన్ డాక్టర్ జయానంద్ సుధీర్, వంశీరెడ్డిలు మీడియాతో మాట్లాడుతూ షాద్ నగర్ కు చెందిన సాజిద్ అనే 49 ఏళ్ల వ్యక్తికి సకాలంలో అత్యవసర మెదడు శస్త్రచికిత్స చేసి రోగి ప్రాణాలను కాపాడినట్లు స్పష్టం చేశారు అకస్మాత్తుగా వచ్చే తీవ్రమైన తలనొప్పిని చాలాసార్లు సాధారణ సమస్యగా భావిస్తాం అనీ కానీ కొన్ని సందర్భాల్లో అదే తలనొప్పి మెదడులో దాగి ఉన్న ప్రాణాపాయకరమైన సమస్యకు సంకేతంగా ఉంటుందన్నారు అటువంటి అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఒకటి బ్రెయిన్ అన్యూరిజం మెదడులోని రక్తనాళం బలహీనమై బెలూన్‌లా ఉబ్బి ఎప్పుడైనా పగిలే ప్రమాదం ఉంటుందని వివరించారు బ్రెయిన్ అన్యూరిజం పగిలినప్పుడు మెదడులో అకస్మాత్తుగా రక్తస్రావం జరుగుతుందనీ ఇది క్షణాల్లోనే స్ట్రోక్ శాశ్వత నర సంబంధిత లోపాలు కోమా లేదా మరణానికి దారితీయవచ్చన్నారు ఇలాంటి పరిస్థితుల్లో ఆలస్యం లేకుండా మెదడు స్కాన్‌లు చేయడం ఖచ్చితమైన నిర్ధారణకు రావడం వెంటనే సరైన శస్త్రచికిత్స చేయడం అత్యంత కీలకం అన్నారు ఈ అత్యవసర పరిస్థితిలో యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మలక్‌పేట్‌లోని న్యూరో సర్జరీ వైద్య బృందం సకాలంలో స్పందించి కీలక నిర్ణయాలు తీసుకుందనీ తక్షణ నిర్ధారణ మరియు అత్యవసర ఓపెన్ బ్రెయిన్ శస్త్రచికిత్స ద్వారా పగిలిన భారీ బ్రెయిన్ అన్యూరిజంతో బాధపడుతున్న 49 ఏళ్ల రోగి సాజిద్ ప్రాణాలను వైద్య బృందం కాపాడగలిగిందన్నారు కేసు వివరాలను తెలియజేస్తూ అకస్మాత్తుగా తీవ్రమైన తలనొప్పితో డిసెంబర్ 5న యశోదా హాస్పిటల్‌కు తీసుకువచ్చారనీ వెంటనే సిటీ స్కాన్ చేయగా మెదడులో




రక్తస్రావం ఉన్నట్లు తేలిందనీ ఇది అత్యంత ప్రాణాపాయకర పరిస్థితి తదుపరి పరీక్షల్లో మెదడులోని రక్తనాళంలో పెద్ద బ్రెయిన్ అన్యూరిజం ఉన్నట్లు గుర్తించామన్నారు ఈ అన్యూరిజం మెదడుకు పెద్ద భాగానికి రక్తం సరఫరా చేసే ప్రధాన రక్తనాళంపై ఉండటంతో పాటు దానినుంచి కీలకమైన చిన్న రక్తనాళాలు బయటకు వస్తుండటంతో పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారిందన్నారు వైద్య పరీక్షలు, ఫలితాలు పగిలిన భారీ బ్రెయిన్ అన్యూరిజం మెదడులో అక్యూట్ రక్తస్రావం అత్యవసర న్యూరో వాస్క్యులర్ పరిస్థితి చేసిన చికిత్సలు అన్యూరిజం నిర్మాణం అత్యంత క్లిష్టంగా ఉండటంతో కోయిలింగ్ లేదా స్టెంట్ వంటి చికిత్సలు సురక్షితంగా చేయడం సాధ్యం కాలేదు ఎందుకంటే అవి మెదడుకు రక్తప్రవాహాన్ని ఆపే ప్రమాదం ఉంది. అందువల్ల అత్యవసరంగా ఓపెన్ బ్రెయిన్ శస్త్రచికిత్స (మైక్రోసర్జికల్ క్లిప్పింగ్) నిర్వహించారు అత్యవసర క్రానియోటమీ అన్యూరిజం బలహీనమైన భాగాన్ని మూసివేయడానికి చిన్న టైటానియం క్లిప్ అమరిక కీలక రక్తనాళాల రక్షణ మెదడుకు సాధారణ రక్తప్రవాహం కొనసాగింపు శస్త్రచికిత్స పూర్తిగా విజయవంతమయ్యింది. వైద్యుల అభిప్రాయాలు ఇది అత్యంత క్లిష్టమైన మరియు ప్రాణాపాయకరమైన బ్రెయిన్ అన్యూరిజం కేసనీ వివరించారు కీలక రక్తనాళాలు అన్యూరిజం నుంచే బయటకు రావడంతో ఎండోవాస్క్యులర్ చికిత్సలు సురక్షితం కాలేదనీ సకాలంలో చేసిన ఓపెన్ బ్రెయిన్ శస్త్రచికిత్స ద్వారా రోగి ప్రాణాలను కాపాడగలిగాం అని డా. జయానంద్ సుధీర్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్, డా.వంశీ రెడ్డిలు మీడియాకు వివరించారు శస్త్రచికిత్స అనంతరం రోగి వేగంగా కోలుకున్నారనీ కేవలం ఆరు రోజుల్లో నడుచుకుంటూ ఇంటికి వెళ్లిపోయారని వైద్యులు తెలిపారు ముఖ్యంగా కొందరికి తలనొప్పి వంశపారపర్యంగా లేదా ఇతర చెడు అలవాట్ల వల్ల ఇది వస్తుందని సాధ్యమైనంతవరకు పొగ త్రాగడం, హైపర్ టెన్షన్ (బిపి) నిర్మూలించుకోవాలని తెలిపారు ఆరోగ్యవంతంగా ఉండాలని సాధ్యమైనంతవరకు మంచినీళ్లు ఎక్కువగా తాగాలని వరుసటించారు. ఏదైనా తలనొప్పి ఎక్కువగా అనిపిస్తే (గోల్డెన్ అవర్స్) సకాలంలో ఆసుపత్రికి తీసుకురావాలని సూచించారు యశోద మలక్ పేట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర మీడియాతో మాట్లాడుతూ యశోదా ఆసుపత్రి యాజమాన్యం మలక్‌పేట్‌లో అందుబాటులో ఉన్న అత్యాధునిక న్యూరో సర్జరీ సదుపాయాలు అనుభవజ్ఞులైన వైద్య బృందం మరియు తక్షణ అత్యవసర సేవల ద్వారా ఇటువంటి అత్యంత క్లిష్టమైన బ్రెయిన్ అన్యూరిజం కేసులను కూడా విజయవంతంగా చికిత్స చేయగలుగుతున్నామని వెల్లడించారు అత్యాధునిక అత్యవసర వైద్య సేవలు ఐసియు, ఆధునిక న్యూరో సర్జరీ మౌలిక సదుపాయాలు న్యూరో ఇమేజింగ్ సాంకేతికత అనుభవజ్ఞులైన అత్యవసర శస్త్రచికిత్స వైద్య బృందాలు 24 గంటలు న్యూరో క్రిటికల్ కేర్ సేవలు యశోదా ఆసుపత్రుల అన్ని శాఖల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు ఇవి అత్యంత క్లిష్టమైన మరియు ప్రాణాపాయకరమైన బ్రెయిన్ అన్యూరిజం వంటి న్యూరో సర్జరీ అత్యవసర పరిస్థితులను కూడా సమర్థవంతంగా నిర్వహించేందుకు సహాయపడుతున్నాయని, నిపుణులైన యశోదా వైద్య బృందం ద్వారా అత్యంత క్లిష్టతరమైన జబ్బులు, వ్యాధులకు కూడా చికిత్స జరుగుతోందని మలక్ పేట యశోదా హాస్పిటల్స్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర తెలిపారు మరిన్ని వివరాలకోసం సంప్రదించాల్సిన నెంబర్లు ఎ. వాసుకిరణ్ రెడ్డి 97057 71230 99499 98378 చరవాణి ద్వారా సంప్రదించవచ్చని వారు సూచించారు.

# అప్పాజీపేటలో మెగా హెల్త్ క్యాంప్

**సంపూర్ణ సురక్ష కేంద్రం ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంపు విజయవంతం..**

**అప్పాజీపేట , డిసెంబర్ 30(స్కై న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థకు చెందిన సంపూర్ణ సురక్ష కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం రోజున నల్గొండ మండల పరిధిలో గల అప్పాజీపేట గ్రామంలో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిపి,షుగర్, హెచ్ఐవి, సిఫిలిస్, హెపటైటిస్ బి మరియు సి,టీబి మరియు జనరల్ పరీక్షలు నిర్వహించి, నిపుణులైన డాక్టర్లచే మందులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మైక్రో బయాలజీ హెచ్ ఓ డి డాక్టర్ రత్నప్రభ గారు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందదాయకమని ఈ క్యాంప్ లో అన్ని రకాల పరీక్షలు చేయించుకొని ఆరోగ్య గ్రామంగా తీర్చిదిద్దాలని కోరారు. అలాగే ఈ కార్యక్రమాన్నీ గ్రామ సర్పంచ్ గంగుల అండాలుసైదులు గారు మాట్లాడుతూ మన గ్రామంలో ఉన్న ప్రజలందరూ ఈ హెల్త్ క్యాంపు కు వచ్చి రక్త పరీక్షలు చేయించుకొని వారి స్థితిని తెలుసుకొని అందుకు తగినట్టుగా మందులు తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని తెలియజేశారు. అలాగే మా గ్రామంలో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించినందుకు సంపూర్ణ సురక్ష కేంద్రం సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ క్యాంపు ను ఉద్దేశించి డి ఎస్ ఆర్ సి కౌన్సిలర్ లింగస్వామి గారు మాట్లాడుతూ హెచ్ఐవి సిఫిలిస్ తదితర సుఖ వ్యాధుల పట్ల ప్రజలకు అప్రమంతంగా ఉండాలని కోరారు. సంపూర్ణ సురక్ష మేనేజర్ రమేష్ గారు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని వినియోగించుకుని ఆరోగ్యంగా ఉండాలని ఈ కార్యక్రమాన్ని ఇంతటి దిగ్విజయం చేసినందుకు గ్రామ సర్పంచ్ వార్డ్ మెంబర్స్, పిహెచ్సి స్టాఫ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో మైక్రో బయాలజీ హెచ్ ఓ డి ప్రొఫెసర్ డాక్టర్ రత్నప్రభ, ఎంఎల్ హెచ్ పి డాక్టర్స్ సైదులు,మౌనిష, పీహెచ్సి సూపర్వైజర్ పద్మారెడ్డి,ఏ ఎన్ ఎం సరళ,ఐ సి టి సి మరియు డి ఎస్ ఆర్ సి కౌన్సిలర్స్ రామక్రిష్ణ, లింగస్వామి, ఎస్ ఎస్ కే మేనేజర్ రమేష్, ఎల్ డబ్ల్యూ పీ ఓ నరసింహ చారి, వై ఆర్ జి మధు,జయకుమార్, ఎస్ ఎస్ కే ఓ ఆర్ డబ్ల వేణు, శ్రీలక్ష్మి టీబీ స్టాఫ్ శ్రీనివాస్ ,అనిల్, సైదులు ఆశా వర్కర్,మరియు గ్రామ సర్పంచ్ గంగుల అండాలుసైదులు,వార్డ్ మెంబర్స్, పంచాయతీ సిబ్బంది,గ్రామ యువత ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# కోరికలు తీర్చు యాదాద్రి లక్ష్మీనరసింహుడు

తెలంగాణలోని ప్రముఖ ఆలయాలలో ఒకటైన, ఉమ్మడి నల్లగొండజిల్లా ప్రస్తుత యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండల కేంద్రము సమీపములో ఎత్తయిన గుట్టపై ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయములో డిసెంబర్ 30న స్వామివారి వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. ఋష్యశృంగ మహర్షి, శాంతల పుత్రుడు యాదమహర్షి చిన్నతనం నుంచే హరిభక్తుడు. ఆంజనేయస్వామి సలహాపై ప్రస్తుతం యాదగిరిగా పిలవబడుతున్న ప్రదేశంలో చాలా కాలం తపస్సు చేశారు. అప్పుడు ఒక రాక్షసుడు ఆహార అన్వేషణలో అటుగావచ్చి నిశ్చల తపస్సులో వున్న ఈ ఋషిని చూసి తినబోయాడు.ఆ విషయం తపస్సులోవున్న ఋషికి తెలియలేదు గానీ, ఆయన ఎవరి గురించైతే తపస్సు చేస్తున్నాడో ఆ శ్రీ హరి ఆయుధం అయిన సుదర్శన చక్రం వచ్చి ఆ రాక్షసుని సంహరించింది. అది చూసిన ఋషి ఆ సుదర్శన చక్రాన్ని పలు విధాల ప్రార్ధించి, భక్తులకు ఏవిధమైన బాధలూ కలుగకుండా దుష్ట సంహారం చేస్తూ అక్కడే వుండిపొమ్మని కోరగా ఆ సుదర్శనము అనతికాలము లోనే అక్కడ వెలయ బోవుచున్న లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ శిఖరాన షట్కోణాకారాన వెలసి స్వామి దర్శనానికి వచ్చు భక్తులను సదా కాపాడుతూ వుంటానని వరమిచ్చి అంతర్ధానం అయినట్లు కథనం. యాదమహర్షి తన తపస్సుని కొనసాగించగా, ఆయన తపస్సుకి మెచ్చి నరసింహస్వామి ప్రత్యక్షమై, యాద మహర్షి కోరిక మీద అక్కడ లక్ష్మీ నరసింహస్వామి గా వెలిశాడు. ఆ ఋషి కోరిక మీదే ఆ కొండ యాదగిరిగా ఋషి పేరుమీద ప్రసిద్ధికెక్కింది. ఆ ఋషి తపస్సు చేసింది, స్వామి ప్రత్యక్షమైంది కొండక్రిందవున్న పాత లక్ష్మీనరసింహస్వామి గుడి దగ్గర అని అంటారు. యాద మహర్షి కోరిక మీదే ఆంజనేయస్వామి యాదగిరిలో క్షేత్రపాలకుడుగా వున్నాడు. ప్రహ్లాదుని రక్షించటానికి, అహోబిలంలో నరసింహస్వామి స్తంభాన్ని చీల్చుకుని వచ్చి హిరణ్యకశిపుని సంహరించిన తర్వాత ఆ భీకర రూపాన్ని శాంత పరచటం ఎవరికీ సాధ్యం కాలేదట. అప్పుడు దేవతలంతా లక్ష్మీదేవిని ప్రార్ధిస్తే ఆమె ప్రత్యక్షమై స్వామిని శాంతింప చేసిందట. అప్పుడు ప్రహ్లాదుడు స్వామిని అక్కడే ప్రసన్న రూపంలో కొలువై వుండమని కోరాడట. అయితే స్వామి అతి భీకర రూపంలో దర్శనమిచ్చిన ఆ ప్రదేశంలో శాంత రూపంతో కొలువై వుండటం లోక విరుద్ధమని అక్కడికి సమీపంలో వున్న యాదగిరిలో లక్ష్మీ నరసింహస్వామి గా లోక కళ్యాణార్ధం కొలువు తీరుతానని బయల్దేరారు, లక్ష్మీ సమేతుడై కొండపై గల గుహలో వెలిశారు. ఆయనవెంట ప్రహ్లాదుడూ, సకల దేవతలూ వచ్చి ఆయనతోపాటు ఇక్కడ కొలువుతీరి స్వామిని సేవిస్తూ వచ్చారట.రాక్షస సంహారంచేసి లోక కళ్యాణం చేశారని సంతోషంతో స్వామివారి కాళ్ళని బ్రహ్మదేవుడు ఆకాశ గంగతో కడిగాడట. ఆ ఆకాశ గంగ లోయలలోంచి పారి విష్ణు పుష్కరిణిలోకి చేరింది. ఈ పుష్కరిణికి కూడా చాలా



ప్రాముఖ్యం వుంది. ఇందులో స్నానంచేసి స్వామిని సేవించినవారికి సకల కోరికలూ తీరుతాయి. ఇక్కడ పితృకార్యాలు చేస్తే పితృ దేవతలు తరిస్తారు. చాలామంది భక్తులు ఆరోగ్యం, గ్రహపీడా నివారణ, వగైరా కోరికలతో కొన్నాళ్ళపాటు ఇక్కడ వుండి విష్ణు పుష్కరిణిలో స్నానం చేసి స్వామిని సేవిస్తారు. అంతేగాక ఇప్పటికీ రోజూ రాత్రుళ్ళు ఆ చుట్టుప్రక్కల కొండలమీద తపస్సు చేసుకుంటున్న ఋషులు విష్ణు పుష్కరిణిలో స్నానంచేసి స్వామిని అర్చిస్తారట. దానికి నిదర్శనంగా వారు వచ్చేటప్పుడు మృదంగ ధ్వనులు వస్తాయట. పాదాల గుర్తులు కొందరు చూశారుట. వారు స్వామిని అర్చించిన గంధ పుష్పాదులు కూడా నిదర్శనమంటారు. మెట్ల మార్గాన వెళ్తే దోవలో శివాలయం కనబడుతుంది. ఇక్కడ శివుడు లక్ష్మీ నరసింహస్వామి కన్నా ముందు స్వయంభూగా వెలిశాడు. ఇంకో విశేషం.. ఈ మెట్లు ఎక్కి స్వామిని సేవించినవారి కీళ్ళ నొప్పులు తగ్గుతాయని భక్తుల విశ్వాసం యాదగిరి లక్ష్మి నరసింహ స్వామి వారి ఆలయ ముఖద్వారం యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం నల్గొండ జిల్లాలో ప్రముఖ మైన దివ్య క్షేత్రం: యాదగిరి గుట్టకు సంబందించిన కథకు మూలం వాల్మీకి రామాయణంలో వున్నది. విభాండక ఋషి కుమారుడు రుష్యశృంగుడు. అతని కుమారుడు హాద ఋషి, అతనినే హాదర్షి అని కూడ అంటారు. అతను నరసింహ స్వామి భక్తుడు. అతనికి స్వామివారిని ప్రత్యక్షంగా చూడాలని కోరిక పుట్టింది. ఆంజనేయస్వామి సలహా మేరకు తపస్సు చేయగా స్వామి ప్రత్యక్షమవుతాడు. ఆ ఉగ్ర నరసింహ మూర్తిని చూడలేక శాంత స్వరూపంతో కనిపించమని యాదర్షి కోరగా స్వామి వారు కరుణించి లక్ష్మి సమేతుడై దర్శన మిచ్చి "ఏంకావాలో కోరుకో" మంటే యాదర్షి స్వామి వారికి "శాంత మూర్తి రూపంలోనె కొలువై కొండపై ఉండి పొమ్మని కోరాడు. ఆవిధంగా లక్ష్మి నరసింహ స్వామి కొండపై అలా కొలువై ఉండి పోయాడు.కొన్నాళ్ళకు స్వామివారిని వేర్వేరు రూఫాల్లో చూడాలనిపించి యాదర్షి మరలా తపస్సు చేశాడు. అతని కోరిక మేరకు స్వామి వారు జ్వాలా, యోగా, నంద, గండబేరుండ, నారసింహ రూపాల్లో దర్శనమిచ్చాడు.అందుకే ఈ క్షేత్రాన్ని పంచ నారసింహ క్షేత్రం అంటారు. ఆ ఋషి కోరిక మీదే ఆ కొండ యాదగిరిగా ఋషి పేరుమీద ప్రసిద్ధికెక్కింది.వైకుంఠ ఏకాదశి ఉత్సవం డిసెంబర్ 30న వైభవంగా నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం 5.30 నుంచి 6.30 గంటల వరకు ప్రధానాలయంలో శ్రీస్వామివారు ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిస్తారు. పాతగుట్ట లక్ష్మీనారసింహస్వామి ఉత్తర రాజగోపురం గుండా 6.45 నుంచి 7.30 గంటలకు వైకుంఠనాథుడిగా దర్శనం ఇవ్వనున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారి బ్రేక్ దర్శనం ఉదయం ఉదయం 10.30 నుంచి 11.30 గంటలకు ఉంటుందని దేవస్థానం ఈఓ వెంకట్ రావు వెల్లడించారు. 30న ప్రారంభమయ్యే స్వామివారి అధ్యయనోత్సవాలు జనవరి 8వ తేదీవరకు కొనసాగనున్నాయి. అధ్యయనోత్సవాల్లో భక్తులచే నిర్వహించే సుదర్శన నారసింహహోమం, నిత్య, శాశ్వత కల్యాణం, బ్రహ్మోత్సవాలను రద్దు చేసినట్టు ఈవో వెల్లడించారు.

# ఉద్యోగ రంగంలో అన్యాయాలపై సుదీర్ఘ పోరాటాలు

తెలంగాణ ప్రాంతీయులకు ఉద్యోగ రంగంలో దశాబ్దాలుగా జరిగిన అన్యాయాన్ని సవరించి చక్క దిద్దేందుకు నాటి ముఖ్య మంత్రి ఎన్టీఆర్ 610 జీ.ఓ. జారీ చేసిన రోజు డిసెంబర్ 30.. తెలంగాణ స్థానికులకు జరిగిన అన్యాయం ఏమిటి? అది ఎలా జరిగింది? సవరింపులు, చక్కదిద్దడాలు జరిగాయా? ముల్కి నిబంధనలు, ఆరు సూత్రాల పథకం, పెద్దమనుషుల ఒప్పందం, రాష్ట్రపతి ఉత్తర్వులు, 610 ఉత్తర్వులు, గిర్గ్లానీ నివేదికలు, తెలంగాణ వాసులకు జరిగిన అన్యాయాన్ని నిలువరించ లేక పోయాయి. ఇందుకు సంబంధించి 610 ఉత్తర్వుల జారీ పూర్వాపరాల గురించి తెలిపే ప్రయత్నం ఇది. ఆంగ్ల భాష రాదన్న సాకుతో, నిజాం పాలనలో ఉత్తరాది వారికే ఉద్యోగాలు అధికంగా దక్కగా, చాలాకాలం అనంతరం ఉవ్వెత్తున లేచిన ఉద్యమ ఫలితంగా మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ 1919లో ప్రవేశ పెట్టిన ముల్కీ నిబంధనల ప్రకారం తెలంగాణలోని ఉద్యోగాలన్నీ స్థానికులకే చెందాల్సి ఉండెను. దీని ప్రకారం 15 సంవత్స రాల కనీస నివాస యోగ్యతగా స్థానికత్వ నిర్ధారణ జరగాల్సి ఉండెడిది. అంతేకాక ఉద్యోగ విమణ తర్వాత కూడా తెలం గాణలోనే ఉండాలనే షర్తులు విధించ బడినాయి. తెలంగాణ ప్రాంతంలో ఉద్యోగం పొందటానికి నివాస నిబంధన 12 సంవతరాలు ఉండాలని సవరించి, నిర్ణయించ బడింది. 1973 సెప్టెంబర్ 23న జారీ అయిన ఆరు సూత్రాల పథకంలో భాగంగా 1975 అక్టోబర్ 18న రాష్ట్రపతి ఉత్త ర్వులు 674 (ప్రెసిడెన్షియల్ ఆర్డర్) (+.ా.వీం.చీశీ.674, ఈూ (ర్ఞాఖీ-ూ) ణవజూ., ఖ: 20-10-1975) జారీ అయి రాష్ట్రాన్ని 1,2,3 కోస్తాంధ్ర, 4 రాయలసీమ మరియు 5,6 తెలంగాణ జోన్లుగా విభజించారు. ఈ ఉత్తర్వులోని పేరా 14 ప్రకారం కొన్నింటిని స్థానిక రిజర్వేషన్ల పరిధి నుండి తప్పించడం జరిగింది. హైదరాబాద్ లోని మినహాయించిన ఆఫీసులకు కాకుండా మిగిలిన అన్ని ప్రభుత్వ ఆఫీసులలో లోకల్ రిజర్వేషన్ పాటించాల్సిందని పేరా 20 సూచించింది. అలాగే పేరా 9 ప్రకారం 10వ తరగతి నుండి కింది స్థాయి 4వ తరగతి వరకు చదివిన విద్యా సంస్థ జిల్లా పరిధిగా, ఆ జిల్లాలో సంవత్సరాలు చదువును స్థానికంగా వివరించారు. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం జిల్లాస్థాయి కేడర్లలో 80%,



జోనల్ స్థాయిలో 60% స్థానికులకు ఉద్యోగాలు రిజర్వు చేయ బడినాయి. రిజర్వు చేయబడినవి పోగా మిగిలినవి ఓపెన్ కాంపిటీషన్ ద్వారా భర్తీ చేయాలి. వాటిని స్థానికేతరులకు రిజర్వు చేయరాదని ఉత్తర్వులు స్పష్టంగా పేర్కొన్నాయి. 1919 నుండి అమలులోనున్న నివాస యోగ్యతను 15 నుండి12 కు (1958లో) అనంతరం 1975లో 4సంవత్సరాలకు తగ్గించగా, వివక్షత కొనసాగింది. రాష్ట్రపతి ఉత్తర్వులలో పేర్కొన్న విధంగా జోనల్ వారీ విధానాన్ని సైతం తుంగలో తొక్కి, స్వార్ధమే పరమార్ధంగా పాలన కొనసాగించడం జరిగింది. నాటి ముఖ్య మంత్రి ఎన్టీ రామారావు నియమిం చిన జయభారత్ రెడ్డి, కమల నాథన్, ఉమాపతి తో కూడిన సీనియర్ ఐఏఎస్ అధికారుల త్రిసభ్య కమిటీ, 1975 నుండి 1984 మధ్య కాలంలో జరిగిన ఉద్యోగ నియామకాలను పరిశీలించి సమర్పించిన 36 పేజీల 1981 జూన్ నాటి నివేదికలో, జోన్ల రిజర్వేషన్లకు విరుద్దంగా ఆంధ్ర ప్రాంతానికి చెందిన 1,2,3లకు చెందిన వారు తెలంగాణకు చెందిన 5,6 జోన్లలో 58,986 మంది నిబంధనలకు విరుద్ధంగా నియ మింప బడినట్లు పేర్కొనడం జరిగింది. ఈ నివేదికను పరిశీలించిన నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 1985 డిసెంబర్ 30న 610 జీవోను జారీ చేశారు. గత పాలకులు చేసిన తప్పులను దిద్దుకునే క్రమంలో 1986 మార్చి 30కల్లా 610 జీవోను అమలు పరిచి, తెలంగాణలో ఉన్న ఆంధ్ర ఉద్యోగులందరినీ ఎవరి జోన్లకు వారిని పంపుతామని ఎన్టీఆర్ ప్రభుత్వం ప్రకటించడం జరిగింది. ఈ క్రమంలో రాయల సీమ ప్రాంతంలో నియుక్తులైన స్థానికేతర ఉద్యోగులను కోస్తాంధ్ర, తెలంగాణ ప్రాంతాలకు పంపిం చాలన్న "జీ.ఓ. 564, తేది: 05-12-1985" మాత్రం వెంటనే అమలయింది. ఎన్టీఆర్ ను గద్దె దింపి, ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి గిర్గ్లానీ ఏకసభ్య కమిషన్ ను పునః పరిశీలనకై నియ మించగా, నివేదిక సమర్పించిన గిర్గ్లానీ స్థానికేతరులను నిర్ధారించ గల సంపూర్ణ సమాచారం పొంద కుండానే, సమర్పిత నివేదికలో రాష్ట్రపతి ఉత్తర్వులను 128 పద్దతులలో ఉల్లంఘించడం జరిగిం దని వివరించి, వాటిని 18రకాలుగా వర్గీకరించి, పరిష్కార మార్గాలను సూచించడం జరిగింది. ఉద్యోగ నియామకాలన్నీ జోనల్ నిబంధ నలను అనుసరించి జరగాల్సి ఉండగా, జోనల్ ఆఫీసులను రాష్ట్ర స్థాయి కార్యాలయాలుగా మార్చి ఇష్టారాజ్యంగా బదిలీలు చేయడం జరిగిందని, ఈ బదిలీలు తప్పని కమిషన్ అభిప్రాయ పడ్డది. గిర్గ్లానీ నివేదిక ప్రకారం సగం మంది స్థానికేతరులు ఉన్నారని స్పష్టం అయింది. తెలంగాణ స్వరాష్ట్ర ప్రభుత్వ పాలనలో సదరు అన్యాయానికి అడ్డుకట్ట వేసేందుకు చర్యకు తీసుకోవాలని నిర్ణయించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి అంకురార్పణ జరిగింది సదరు వివక్షత కారణం ప్రధానం కాగా, అట్టి వివక్షత రూపు మాపేందుకు, సిఎం కేసిఆర్ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి, పలు అంశాలపై చర్చించి, 7జోన్లు, 2 మల్టీ జోన్లను 31 జిల్లాలను కలిపి ఖరారు చేశారు. తర్వాత 33 జిల్లాలతో కలిపి తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ ఆర్డర్ - 2018ను అమల్లోకి తెచ్చారు. దీనికి అనుగుణంగా 33 జిల్లాలకు ఉద్యోగులను విభజించే ప్రక్రియ చేపట్టారు. 33 జిల్లాలతో రాష్ట్రపతి ఆమోదించిన కొత్త జోనల్ వ్యవస్థ-2018కి అను గుణంగా ప్రభుత్వం ఈ మార్గదర్శ కాలను రూపొందించింది. కొత్త జోనల్ వ్యవస్థలో స్థానిక కోటా కింద 95 శాతం, ఓపెన్ కోటా కింద 5 శాతం చొప్పున జరిగే నియామకాల్లో పూర్తిగా 100 శాతం ఉద్యోగాలు తెలంగాణ నిరుద్యోగులకే చెందేలా, ఓపెన్ కోటాలోని 5 శాతం ఉద్యోగాలకు కూడా తెలంగాణ నిరుద్యోగులు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు కొత్త జోనల్ వ్యవస్థ అవకాశం కలిగించింది.

# జనవరి 1 నుంచి రానున్న మార్పులు

**హైదరాబాద్, డిసెంబర్ 30:**మరో రెండు రోజుల్లో 2025 సంవత్సరం ముగిసి, 2026 కొత్త సంవత్సరం ప్రారంభం కాబోతోంది. జనవరి 1 నుంచి సామాన్యుడి జేబుపై, ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలపై, రైతుల సంక్షేమ పథకాలపై ప్రభావం చూపే అనేక కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. బ్యాంకింగ్, పన్ను విధానాలు, గ్యాస్ ధరలు వంటి అంశాల్లో వస్తున్న ఈ మార్పులను ప్రజలు గమనించాల్సి ఉంది.ప్రధానంగా పాన్-ఆధార్ అనుసంధానం అత్యంత కీలకం కానుంది. ఇప్పటికీ వీటిని లింక్ చేయని వారి బ్యాంక్ ఖాతాలు ఫ్రీజ్ అయ్యే ప్రమాదం ఉంది. బ్యాంకింగ్ సేవలు, పన్ను రిఫండ్లు నిలిచిపోకుండా ఉండాలంటే తక్షణం ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సిందే. ఇక, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్తగా, 2025 డిసెంబర్ 31తో 7వ వేతన సంఘం గడువు ముగియనుండటంతో జనవరి 1 నుంచి 8వ వేతన సంఘం సిఫార్సులు అమల్లోకి రానున్నాయి. దీనివల్ల ఉద్యోగులు, పెన్షనర్ల వేతనాల్లో మార్పులు చోటుచేసుకోనున్నాయి.బ్యాంకింగ్ రంగంలో మరో ప్రధాన మార్పు క్రెడిట్ స్కోర్ అప్డేట్. ఇప్పటివరకు 15 రోజులకోసారి జరిగే ఈ ప్రక్రియ, ఇకపై ప్రతి వారం జరగనుంది. దీనివల్ల లోన్ రీపేమెంట్లలో ఏ చిన్న జాప్యం జరిగినా వెంటనే క్రెడిట్ స్కోర్పై ప్రభావం పడుతుంది. పీఎం కిసాన్ పథకంలో కొత్తగా చేరే రైతులకు 'ఫార్మర్ ఐడీ' తప్పనిసరి చేశారు. జనవరి 1 నుంచి కొత్త దరఖాస్తుదారులు ఈ డిజిటల్ ఐడీ ద్వారానే రూ.6,000 సాయం పొందేందుకు అర్హత సాధిస్తారు.వీటితో పాటు 2026 జనవరి నుంచి వచ్చే కొత్త ఐటీఆర్ ఫారాల్లో బ్యాంకింగ్, ఖర్చుల వివరాలు ప్రీ-ఫిల్ అయి రానున్నాయి. అలాగే, ప్రతి నెల మొదటి తేదీన జరిగే ఎల్పీజీ, విమాన ఇంధన ధరల సవరణ కూడా జరగనుంది.డిజిటల్ మోసాలను అరికట్టేందుకు యూపీఐ లావాదేవీలు, సిమ్ వెరిఫికేషన్ నిబంధనలను మరింత కఠినతరం చేయనున్నారు. ఆర్బీఐ కొత్త నిబంధనల ప్రకారం కో-లెండింగ్ విధానంలోనూ మార్పులు రానున్నాయి.

# ఆపరేషన్ చబూతర్! పక్కా వ్యూహాలతో ఆకతాయిలకు చెక్!

**హైదరాబాద్, డిసెంబర్ 30:** హైదరాబాద్ నగర వ్యాప్తంగా ఏడాదంతా ఒకెత్తైతే, డిసెంబర్ 31వ తేదీ రాత్రి పరిస్థితి పూర్తిగా విభిన్నం. హద్దులు దాటిన ఆకతాయిల వెకిలి చేష్టలు, డ్రగ్స్ మత్తు తలకెక్కి మృగాలుగా మారిన చేసే ఆగడాలు, పీకల దాకా తాగి , మద్యం మత్తులో రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే మందుబాబుల ఓవర్ యాక్షన్.. ఇలా ఆ రాత్రి నూతన సంవత్సర వేడుకలు ఓవైపు, అంతే స్థాయిలో ఎంతో మంది అమాయకుల జీవితాల్లో విషాన్ని నింపే చీకట్లు మరో వైపు. ఈ పరిస్థితి ప్రతీ ఏడాది సర్వసాధారణమైనప్పటికీ , సాధ్యమైనంత వరకూ ప్రమాదాలు జరగకుండా, క్రైమ్ అదుపు చేసేందుకు పోలీసులు పడే పాట్లు అన్నీ ఇన్నీ కావు. ఈసారి డిసెంబర్ 31వ తేదీ ఆకతాయిల ఆట కట్టించేందుకు ఆపరేషన్ చబూతర్ పేరుతో రంగంలోకి దిగారు హైదరాబాద్ పోలీసులు..హైదరాబాద్ నగరంలో ఈ ఏడాది పోలీసులు వినూత్నంగా చేపట్టిన ఆపరేషన్ చబూతర్ అనేది న్యూ ఇయర్ వేడుకల పేరుతో జరిగే ఆగడాలను, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను, నిబంధనలను ఉల్లంఘించి , అమాయకుల ప్రాణాలను తీసే సరదాలను అడ్డుకోవడం. ఈ ఆపరేషన్ చబూతర్ లక్ష్యం న్యూ ఇయర్ వేడుకల్లో క్రైమ్ సాధ్యమైనంత వరకూ కట్టడి చేయడం. ఒక్కమాటలో చెప్పాలంటే మీ వేడుకలు, ఇతర కుటుంబంలో విషాదాన్ని నింపకుండా చట్టపరిధిలో అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడమే ఈ ఆపరేషన్ చబూతర్ లక్ష్యం.డిసెంబర్ 31వ తేదీ టార్గెట్ గా వారం రోజుల ముందు నుంచే హైదరాబాద్ నగర వ్యాప్తంగా ఆపరేషన్ చబూతర్ ను షురూ చేశారు పోలీసులు. అస్సలు కథ మరి కొద్ది గంటల్లో ప్రారంభం కానుంది. 31వ తేదీన సరదాల పేరుతో గీత దాటొద్దంటూ ముందు నుంచే నగర ప్రజలను అప్రమత్తం చేసారు పోలీసు ఉన్నతాధికారులు. గతంలో ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది ఏకంగా నగరంలో 100కుపైగా ప్రాంతాల్లో ఏకకాలంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిర్వహించబోతున్నారు. ఆరోజు రాత్రి నుంచి మరుసటి రోజు తెల్లవారుజామున 3గంటల వరకూ నాన్ స్టాప్ గా నగరవ్యాప్తంగా 126 ప్రత్యేక బృందాలతో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కొనసాగనున్నాయి. ఈ తనిఖీలలో మద్యం సేవించి పట్టుబడితే ఈసారి ఏకంగా 6 నెలలు జైలు జీవితం , డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు న్యూ ఇయర్ బంపర్ ఆఫర్ గా 10వేలు ఫైన్ వేయడం తప్పదంటున్నారు. ఇలా నగరంలో తప్పతాగి ప్రాణాలు తీసే వాహనదారులకు డిసెంబర్ 31వ తేది చుక్కలు చూపించనున్నారు పోలీసులు. న్యూయర్ రోజు ఫ్యామిలితో ఉంటారా లేక తప్పతాగి వాహనం నడిపి జైల్లో ఉంటారా మీరే తేల్చుకోండంటూ , మందుబాబుకు ఓపెన్ చాలెంజ్ విసిరారు.అంటే డ్రగ్స్ , డ్రగ్స్ ఉంటేనే పార్టీలో మజా అనేంతలా హైదరాబాద్ లో డ్రగ్స్ కల్చర్ పెరిగిపోయింది. అందులో న్యూ ఇయర్ పార్టీలంటే చెప్పక్కర్లేదు. ఈ నేపథ్యంలో డ్రగ్స్ సరఫరా ముఠాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. టెలిగ్రామ్, వాట్సాప్ లలో కోవర్టు గ్రూపులలో డీల్స్ ఫిక్స్ చేస్తున్న ముఠాలను టార్గెట్ చేశారు. మత్తు పదార్ధాలను సరఫరా చేస్తున్న కేటుగాళ్లలోను జల్లెడ పట్టేందుకు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఈగల్, టాస్క్ ఫోర్స్ టీమ్స్ ఎప్పటికప్పుడు మత్తుగాళ్లను ట్రాక్ చేసేందుకు పక్కా వ్యూహాలను సిద్ధం చేశారు. నగర సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేయడంతోపాటు గంజాయి సరఫరాను కట్టడి చేసేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగనున్నాయి. ఇప్పటికే పబ్ లో పార్టీల పేరుతో మత్తు పదార్ధాలు సరఫరా, అసాంఘిక కార్యకలాపాలు జరిగితే తాట తీస్తామంటూ సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. అర్ధరాత్రి 1గంట తరువాత బార్ లు ఓపెన్ లో ఉంటే తస్మాత్ జాగ్రత్త అంటూ హెచ్చరిస్తున్నారు. ఇలా ఈ డిసెంబర్ 31వ తేది రాత్రి స్పెషల్ ఆపరేషన్ చబూతర్ పేరుతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ , ఆకతాయిల బెండు తీసేందుకు సిద్ధమయ్యారు.

# ఆశ్రయం ఇస్తే.. అంతం చేశారు..

**హైదరాబాద్, డిసెంబర్ 30:**హైదరాబాద్ నాచారంలో సంచలనం సృష్టించిన వృద్ధురాలి హత్య ఉదంతాన్ని పోలీసులు ఛేదించారు. బంగారం కోసం ఇంటి యజమానిని ఓ అద్దెకున్న వ్యక్తి కిరాతకంగా చంపేసి, మృతదేహాన్ని వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న గోదావరి నదిలో పడేసిన వైనం వెలుగులోకి వచ్చింది. పక్కా ప్లాన్తో జరిగిన ఈ హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు.. చివరకు బాధితురాలి మృతదేహాన్ని ఆంధ్రప్రదేశ్లోని కోనసీమ జిల్లాలో గుర్తించారు.వివరాల్లోకి వెళితే.. మల్లాపూర్ బాబానగర్లో నివసించే సూరెడ్డి సుజాత (65) అనే వృద్ధురాలు తన భర్త, కుమారులు మరణించడంతో ఒంటరిగా జీవిస్తున్నారు. డ్రైవర్ పని కోసం ఏపీ నుంచి హైదరాబాద్ వచ్చిన అంజిబాబు అనే వ్యక్తి రెండు నెలల క్రితం ఆమె ఇంట్లోనే అద్దెకు చేరాడు. సుజాత ఒంటరిగా ఉండటం, ఆమె వద్ద బంగారం ఉండటాన్ని గమనించిన అంజిబాబు.. ఎలాగైనా వాటిని కాజేయాలని పథకం వేశాడు. ఈ నెల 19న రాత్రి ఆమెను దారుణంగా హత్య చేసి.. ఒంటిపై ఉన్న 11 తులాల బంగారు ఆభరణాలను దోచుకున్నాడు. ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని ఇంట్లోనే ఉంచి బయట తాళం వేసి పారిపోయాడు.హత్య చేసిన అనంతరం అంజిబాబు తన సొంతూరు కోనసీమ జిల్లాకు వెళ్లి తన స్నేహితులు యువరాజు, దుర్గారావులకు విషయం చెప్పాడు. ఈ ముగ్గురూ కలిసి ఒక కారును అద్దెకు తీసుకుని 20న మల్లాపూర్కు తిరిగి వచ్చారు. ఇంట్లో ఉన్న సుజాత మృతదేహాన్ని కారులో ఎక్కించుకుని సుమారు 500 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోనసీమ జిల్లా కృష్ణలంకకు తరలించారు. అక్కడ అర్ధరాత్రి సమయంలో ఎవరూ చూడకుండా మృతదేహాన్ని వైనతేయ గోదావరి నదిలో విసిరేశారు.మొయినాబాద్లో ఉంటున్న సుజాత చెల్లెలు సువర్ణలత ఈ నెల 24న సోదరి ఇంటికి రాగా.. తాళం వేసి ఉండటం, సుజాత కనిపించకపోవడంతో ఆందోళన చెంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాచారం సీఐ ధనుంజయ నేతృత్వంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. అద్దెకు ఉంటున్న అంజిబాబు కూడా కనిపించకపోవడంతో అతడిపై నిఘా పెట్టారు. అతడిని పట్టుకుని తమదైన శైలిలో విచారించగా అసలు నిజం ఒప్పుకున్నాడు. నిందితుడు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఏపీకి వెళ్లి మామిడికుదురు సమీపంలోని అప్పనపల్లి వద్ద గోదావరి నదిలో తేలుతున్న సుజాత మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.



# జామ పండ్లు వీరికి యమ డేంజర్!

శీతాకాలంలో లభించే సీజనల్ పండ్లలో జామపండ్లు ముందు వరుసలో ఉంటాయి. ఇవి రుచికి మాత్రమేకాదు ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. ఈ కాలంలో జామపండు సహజంగా పండి తాజాగా ఉంటాయి. దీంతో ఇందులో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. శీతాకాలంలో లభించే సీజనల్ పండ్లలో జామపండ్లు ముందు వరుసలో ఉంటాయి. ఇవి రుచికి మాత్రమేకాదు ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. ఈ కాలంలో జామపండు సహజంగా పండి తాజాగా ఉంటాయి. దీంతో ఇందులో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. జామ తినడం వల్ల రోగనిరోధక శక్తిని పెంచుతుంది. జలుబు, దగ్గును నివారిస్తుంది. జామకాయల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. జామకాయలో నీటి శాతం అధికంగా ఉంటుంది. ఇది నిర్జలీకరణాన్ని నివారిస్తుంది. ఎన్ని లాభాల ఉన్ననప్పటికీ కొంతమందికి శీతాకాలంలో జామ పండ్లు మేలు కంటే హాని ఎక్కువ తలపెడతాయి. అలాంటి వారు వీటికి దూరంగా ఉండటం మంచిది. జామపండులో ఫైబర్ అధికంగా ఉంటుంది. అందువల్ల వీటిని అధికంగా తింటే విరేచనాలు, కడుపు నొప్పిని పెంచుతుంది. ముఖ్యంగా చల్లగా ఉండే వాతావరణంలో జామపండు తినడం వల్ల గొంతులో అసౌకర్యం పెరుగుతుంది. అలాగే జీర్ణశక్తి తక్కువగా ఉన్నవారు జామపండును ఎక్కువగా తినకూడదు. ముఖ్యంగా సాయంత్రం లేదా రాత్రి సమయంలో జామపండ్లను అస్సలు తినకూడదు. కడుపులో గ్యాస్, ఆమ్లత్వంతో బాధపడేవారు కూడా ఎక్కువగా జామపండు తినకూడదు. ఈ సమస్య ఉన్నవారు జామ విత్తనాలను తొలగించి తినడం మంచిది. లేకుంటే కడుపు నొప్పి వస్తుంది. డయాబెటిస్ ఉన్నవారు కూడా జామపండ్లను ఎక్కువగా తినకూడదు. అలాగని పూర్తిగా మానేయకూడదు. మితంగా తినవచ్చు. ముఖ్యంగా మీకు ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వైద్యుడిని సంప్రదించిన తర్వాతే జామ పండ్లు తినాలి.

# ఖర్జూరాలు.. వంధ్యత్వానికి చెక్!



చలికాలంలో ఖర్జూరాలు రోగనిరోధక శక్తిని పెంచి, శరీరానికి వెచ్చదనాన్ని అందిస్తాయి. నెయ్యిలో వేయించిన లేదా కాల్చిన ఖర్జూరాలతో అద్భుతమైన ఆరోగ్య లాభాలు ఉన్నాయి. రాత్రి పడుకునే ముందు గోరువెచ్చని పాలతో తీసుకోవడం ఉత్తమం. వీటిని రెగ్యులర్‌గా తీసుకోవడం వల్ల పురుషులు, మహిళలకు కలిగే ప్రయోజనాలు. చలికాలం వచ్చిందంటే చాలు.. వాతావరణంలో మార్పుల వల్ల మన రోగనిరోధక శక్తి తగ్గుతుంటుంది. అందుకే ఈ సీజన్‌లో ఆహారం విషయంలో అదనపు జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా చలికాలంలో శరీరానికి వెచ్చదనాన్ని, శక్తిని ఇచ్చే డ్రై ఫ్రూట్స్ తీసుకోవడం ఎంతో మేలు. వీటిలో ఖర్జూరాలు అత్యంత కీలకమైనవి. అయితే ఖర్జూరాలను సాధారణంగా తినడం కంటే నెయ్యిలో లేదా నేరుగా వేయించి తినడం వల్ల రెట్టింపు ప్రయోజనాలు ఉంటాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఢిల్లీకి చెందిన ప్రముఖ ఆయుర్వేద నిపుణుడు డాక్టర్ చంచల్ శర్మ అభిప్రాయం ప్రకారం.. కాల్చిన ఖర్జూరాలు శరీర ఉష్ణోగ్రతను సమతుల్యంగా ఉంచడంలో సహాయపడతాయి. ఖర్జూరాల్లో ఉండే ఐరన్, ఖనిజాలు మహిళల్లో హార్మోన్ల స్థాయిలను నియంత్రిస్తాయి. ఇవి మహిళల్లో అండోత్సర్గము ప్రక్రియ సజావుగా సాగడానికి తోడ్పడతాయి, తద్వారా గర్భధారణ అవకాశాలు మెరుగుపడతాయి. పురుషుల్లో సంతానోత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంలో కాల్చిన ఖర్జూరాలు అద్భుతంగా పనిచేస్తాయి. ఇవి స్పెర్మ్ నాణ్యతను పెంచి వంధ్యత్వ సమస్యలను దూరం చేస్తాయి. శరీరం రాత్రిపూట తనను తాను మరమ్మతు చేసుకుంటుంది. కాబట్టి రాత్రి పడుకునే ముందు కాల్చిన ఖర్జూరాలను తీసుకోవడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు. ఖర్జూరాలను దోరగా వేయించి, గోరువెచ్చని పాలతో కలిపి తీసుకుంటే పూర్తిస్థాయి పోషకాలు అందుతాయి.ఖర్జూరాలు ఆరోగ్యానికి మంచివే అయినప్పటికీ, అందరికీ సెట్ కాకపోవచ్చు. డాక్టర్ చంచల్ శర్మ హెచ్చరిక ప్రకారం.. ఈ క్రింది సమస్యలు ఉన్నవారు వీటిని తినకపోవడమే మంచిది షుగర్ లెవల్స్ అదుపులో లేని వారు ఖర్జూరాలకు దూరంగా ఉండాలి. లివర్ వ్యాధులు ఉన్నవారు వైద్యుని సలహా మేరకే తీసుకోవాలి.

# మొలకెత్తిన ఉల్లిపాయలు తినొచ్చా?



దాదాపు ప్రతి ఇంటి వంటగదిలో ఉల్లిపాయలు కనిపిస్తాయి. శాఖాహారుల నుంచి మాంసాహారుల వరకు అందరూ ఉల్లిపాయలు తింటారు. ఎందుకంటే ఉల్లిపాయలు లేకుండా ఏ వంట పూర్తికాదు. అంతేకాదు ఇవి లేనితే వంటలకు రుచి కూడా రాదు. దాదాపు ప్రతి ఇంటి వంటగదిలో ఉల్లిపాయలు కనిపిస్తాయి. శాఖాహారుల నుంచి మాంసాహారుల వరకు అందరూ ఉల్లిపాయలు తింటారు. ఎందుకంటే ఉల్లిపాయలు లేకుండా ఏ వంట పూర్తికాదు. అంతేకాదు ఇవి లేనితే వంటలకు రుచి కూడా రాదు. అందుకే చాలా మంది వీటిని అధిక మొత్తంలో మార్కెట్లో కొనుగోలు చేసి ఇంట్లో నిల్వ చేసుకుంటూ ఉంటారు. కానీ ఎక్కువ రోజులు నిల్వ ఉంచడం వల్ల ఉల్లి మొలకెత్తడం చూస్తూనే ఉంటాం. ఇలా మొలకెత్తిన ఉల్లిని తినడం సురక్షితమేనా అనే సందేహం చాలా మందికి ఉంటుంది. ఈ విధంగా మొలకెత్తిన ఉల్లిపాయలను తినకూడదని కొందరు భావిస్తుంటారు. కానీ మరికొందరు మాత్రం మొలకెత్తిన ఉల్లి ఆరోగ్యానికి చాలా మంచిదని, దీనిని తినడంలో ఎటువంటి సమస్య లేదని చెబుతున్నారు. నిల్వ ఉల్లిపాయలకు వచ్చే పచ్చి మొలకలు విషపూరితమైనవి కావు. నిజానికి ఉల్లిపాయ పాతబడి కొంత తేమను పొందినప్పుడు అది మళ్ళీ మొలకెత్తడం ప్రారంభమవుతుంది. రోజులు గడిచేకొద్దీ దాని నుంచి పచ్చని ఆకు ఉద్భవిస్తాయి. ఈ ఆకులు తినడం ఆరోగ్యానికి మంచిది. భయపడాల్సిన అవసరం లేదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. కానీ ఉల్లిపాయలు తినడానికి సురక్షితమే అయినప్పటికీ వాటి లక్షణాలలో కొన్ని మార్పులు సంభవిస్తాయి. ఉల్లిపాయలు మొలకెత్తినప్పుడు, లోపలి భాగం కొద్దిగా మృదువుగా, లేతగా మారుతుంది. ఈ ఉల్లిపాయలు సాధారణ ఉల్లిపాయల మాదిరిగా రుచిగా ఉండకపోవచ్చు. వాటికి కొంచెం చేదు రుచి ఉంటుంది. మీరు వంట చేసేటప్పుడు మొలకలను కోసి సలాడ్లు వంటి ఇతర ఆహారాలలో వాడవచ్చు. వాటిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. వాటిని తినడం ఆరోగ్యానికి కూడా మంచిది. కానీ మొలకెత్తిన ఉల్లిపాయ నొక్కినప్పుడు చాలా మృదువుగా లేదా పొడిగా ఉంటే, అలాగే వాటిపై నల్ల మచ్చలు ఉంటే అలాంటి వాటిని ఉపయోగించవద్దు. ఇటువంటి ఉల్లిపాయలు ఆరోగ్యానికి ప్రమాదకరమని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

# మార్నింగ్ వాక్‌కు వెళ్తున్నారా..!



మండుటెండలైనా, చినుకులు పడుతున్నా లేదా గజగజ వణికించే చలికాలమైనా.. ఉదయం పూట నడక అనేది ఒక అద్భుతమైన వ్యాయామం. ప్రకృతి ఒడిలో, స్వచ్ఛమైన గాలి పీలుస్తూ నడవడం వల్ల మనసు ప్రశాంతంగా ఉండటమే కాకుండా ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. అయితే చాలామంది ఉత్సాహంగా నడకనైతే ప్రారంభిస్తారు కానీ తెలియక కొన్ని చిన్న తప్పులు చేస్తుంటారు. ఈ పొరపాట్లు మీ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. నీరు తాగకుండా వెళ్లడం: చాలామంది నిద్రలేవగానే ఏమీ తాగకుండానే వాకింగ్‌కు వెళ్తుంటారు. రాత్రంతా నిద్రపోవడం వల్ల ఉదయం సమయానికి మన శరీరం సహజంగానే కొంత డీహైడ్రేషన్‌కు గురై ఉంటుంది. ఈ స్థితిలో నీళ్లు తాగకుండా నడిస్తే కండరాల తిమ్మిర్లు, తలతిరగడం, తీవ్రమైన అలసట వస్తుంది. వాకింగ్‌కు వెళ్లడానికి 15-20 నిమిషాల ముందే కనీసం ఒక గ్లాసు గోరువెచ్చని నీటిని తాగడం అలవాటు చేసుకోండి. వార్మప్: నేరుగా నడక మొదలుపెట్టడం వల్ల కీళ్లు, కండరాలపై అదనపు ఒత్తిడి పడుతుంది. ముఖ్యంగా చలికాలంలో కండరాలు బిగుతుగా ఉంటాయి. వార్మప్ చేయకుండా నడిస్తే గాయాలయ్యే ప్రమాదం ఉంది. నడక ప్రారంభించే ముందు 2 నుండి 5 నిమిషాల పాటు చేతులు, కాళ్లు, మెడను నెమ్మదిగా తిప్పుతూ తేలికపాటి సాగతీత వ్యాయామాలు చేయండి. ఖాళీ కడుపుతో కాఫీ తాగడం: తక్షణ శక్తి కోసం చాలామంది నడకకు ముందు కాఫీ తాగుతుంటారు. ఖాళీ కడుపుతో కెఫిన్ తీసుకోవడం వల్ల అసిడిటీ, గుండెల్లో మంట, ఆందోళన వంటి సమస్యలు తలెత్తుతాయి. ఒకవేళ మీకు ఏదైనా తీసుకోవాలనిపిస్తే.. ఒక అరటిపండు లేదా చిన్న అల్పాహారం తీసుకున్న తర్వాతే కాఫీ తాగడం మంచిది. కాలకృత్యాలు వాయిదా: నడకకు వెళ్లే ఉత్సాహంలో కొందరు టాయిలెట్‌కు వెళ్లడాన్ని వాయిదా వేస్తుంటారు. ఇది చాలా ప్రమాదకరమైన అలవాటు. దీనివల్ల కడుపులో అసౌకర్యం కలగడమే కాకుండా, మూత్ర నాళాల ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశం ఉంది. ఇంటి నుండి బయలుదేరే ముందే మీ ఉదయం పనులను పూర్తి చేసుకుంటే నడక హాయిగా సాగుతుంది. తప్పుడు పాదరక్షలు దుస్తులు: నడకకు తగిన షూస్ ధరించకపోవడం వల్ల పాదాల నొప్పి, వెన్నునొప్పి రావచ్చు. అలాగే వాతావరణానికి తగినట్లుగా గాలి ఆడే దుస్తులను ఎంచుకోవడం ఉత్తమం.ఆరోగ్యం కోసం చేసే నడక సురక్షితంగా ఉండాలి. పైన పేర్కొన్న చిన్న చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా మీరు పూర్తి స్థాయి ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# బిజినెస్

## ప్రయోగశాలలో అభివృద్ధి చేసే వజ్రాల వ్యాపారంలోకి టైటన్



ప్రయోగశాలలో అభివృద్ధి చేసే వజ్రాల వ్యాపార విభాగంలోకి టైటన్ కంపెనీ అడుగుపెట్టింది. 'బియోన్' బ్రాండుతో ఈ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించనున్నట్లు పేర్కొంది. 'సహజ వజ్రాలతో పోలిస్తే, ధర తక్కువగా ఉండే ఈ తరహా వజ్రాలతో తయారైన ఆభరణాలకు గిరాకీ పెరుగుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని, ఈ నెల 29న ముంబయిలో బియోన్ బ్రాండుపై ప్రత్యేక విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు' స్టాక్ ఎక్స్ఛేంజీలకు టైటన్ తెలిపింది. ప్రయోగశాలల్లో అభివృద్ధి చేసిన వజ్రాలతో తయారైన పలు డిజైన్ల ఆభరణాలు ఈ విక్రయ కేంద్రంలో లభ్యమవుతాయని పేర్కొంది. ముమ్ముందు ముంబయి, దిల్లీల్లో మరిన్ని ఈ తరహా విక్రయ కేంద్రాలను ప్రారంభిస్తామని టైటన్ వివరించింది. 2025లో దేశీయ వజ్రాభరణాల విపణి పరిమాణం 6.2 బిలియన్ డాలర్లు (సుమారు రూ.55,674.54 కోట్లు)గా ఉంది. 2028 నాటికి ఇది 12% వార్షిక వృద్ధితో 8.6 బిలియన్ డాలర్ల (సుమారు రూ.77,225.97 కోట్ల)కు చేరొచ్చని అంచనా వేస్తున్నారు. ప్రయోగశాలల్లో అభివృద్ధి చేసిన వజ్రాభరణాల విభాగం వాటా ఇప్పటివరకు తక్కువగానే ఉన్నప్పటికీ.. రాబోయే రెండేళ్లలో 14% వృద్ధితో 600 మిలియన్ డాలర్ల (రూ.5,387 కోట్ల)కు చేరే అవకాశం ఉందని వాజిర్ అడ్వయిజర్స్ చెబుతోంది.

## ప్రభుత్వ రంగ సంస్థల్లో భారీగా కాంట్రాక్టు ఉద్యోగ నియామకాలు



కేంద్ర ప్రభుత్వ రంగ కంపెనీల నియామకాల్లో కాంట్రాక్టు విధానాన్ని మోడీ సర్కార్ భారీగా ప్రోత్సహిస్తోంది. శాశ్వత ఉద్యోగ నియామకాలకు కోత పెడుతూ.. భద్రత లేని కాంట్రాక్టు వ్యవస్థను పెంచుతోంది. దినసరి వేతన కార్మికులు, కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఖ్య పెరగడమే ఇందుకు నిదర్శనం. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ డిపార్ట్‌మెంట్ రూపొందించిన రిపోర్ట్ ప్రకారం.. గడిచిన ఐదేళ్లలో ఒక్క ఏడాదిలో మినహా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (సిపిఎస్ఇ)ల్లో రెగ్యూలర్ నియామకాలు భారీగా తగ్గాయి. ఇదే సమయంలో క్యాజువల్, కాంట్రాక్టు ఉద్యోగాల్లో పెరుగుదల చోటు చేసుకుంది. ఒక్క కరోనా ఏడాదిలో మాత్రం కాంట్రాక్టు నియమకాలు తక్కువగా నమోదయ్యాయి. 2025 మార్చి 31 నాటికి మొత్తం 475 సిపిఎస్ఇలు ఉండగా అందులో ప్రస్తుతం 291 సంస్థలు కార్యకలాపాలను సాగిస్తున్నాయి. పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సర్వే ప్రకారం.. 2024-25 అన్ని రంగాల్లోని సిపిఎస్ఇలు కలిసి మొత్తం 15.42 లక్షల మందికి పైగా ఉపాధి కల్పిస్తున్నాయి. 2023-24లో ఈ సంఖ్య 15.18 లక్షలుగా ఉంది. దీంతో పోల్చితే నియామకాల్లో కేవలం 1.61 శాతం పెరుగుదల మాత్రమే చోటు చేసుకుంది. ఈ స్వల్ప పెరుగుదలకు కూడా 54,000 మందికి పైగా దినసరి కూలిలు, కాంట్రాక్ట్ కార్మికులను అధికంగా తీసుకోవడమే కారణం. ఇదే సమయంలో రెగ్యులర్ ఉద్యోగుల సంఖ్య దాదాపు 30,000 తగ్గడం ఆందోళకరం. ఆర్థిక సంవత్సరం 2022-23 మినహా గత ఐదేళ్లుగా ఇదే వరవడి కొనసాగింది. వేతన ఖర్చులను తగ్గించుకునే పనిలో భాగంగా కాంట్రాక్టు ఉద్యోగులకు పెద్దపీట వేస్తోన్నాయి. దీనివల్ల ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ (ఇపిఎఫ్), గ్రాట్యుటీ వంటి చట్టబద్ధమైన చెల్లింపుల భారం ప్రభుత్వ సంస్థలకు తగ్గుతుంది.

# దేశంలో ఎక్కువగా అమ్ముడైన కారు




కార్ల ధరలు ఇటీవలి కాలంలో భారీగా తగ్గాయని చెప్పొచ్చు. సెప్టెంబరులో చిన్న కార్లపై జీఎస్టీ రేటును కేంద్రం 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించింది. ఇంకా సెస్ కూడా పూర్తిగా తొలగించేసింది. వెంటనే ఈ ప్రయోజనాల్ని కస్టమర్లకు బదిలీ చేస్తూ అన్ని తయారీ కంపెనీలు కూడా ప్రకటించేశాయి. ఇంకా ఇటీవలి పండగ సీజన్ నేపథ్యంలో అదనంగా ఇతర ఆఫర్లను కూడా ప్రకటించాయి. దీంతో అందుబాటు ధరల్లో కొత్త కార్లు లభిస్తున్నాయి. ఇప్పుడు ఇయర్ ఎండ్ నేపథ్యంలో కూడా ఇన్వెంటరీ ఖాళీ చేసుకునేందుకు స్పెషల్ డిస్కౌంట్స్ ప్రకటిస్తున్నాయి. ఇంకా కొంత కాలంగా కార్లు కొనుగోలు చేసే వారు కూడా పెరిగిపోయారు. ధరలు తగ్గడం.. సంపాదన పెరగడం.. సౌకర్యవంతంగా ఉండటం ఇలా పలు కారణాలతో మధ్యతరగతి, సామాన్యులు కూడా కార్లను కొంటున్నారు.అయితే కార్లు కొనుగోలు చేసే ముందు చాలా మందికి తలెత్తే ప్రశ్న ఏ మోడల్ కొనుగోలు చేయాలని. అవును.. జనం ఏది ఎక్కువగా కొంటున్నారు.. ఏ కారులో ప్రత్యేకతలు ఎక్కువగా ఉన్నాయి.. మంచి ఫీచర్లు ఎందులో ఉన్నాయి.. మైలేజి ఏది ఎక్కువ ఇస్తుంది ఇలా అన్నీ గమనించాల్సి ఉంటుంది. మరి 2025లో ఇప్పటివరకు అంటే జనవరి- నవంబర్ మధ్య కాలంలో దేశంలో ఎక్కువగా అమ్ముడైన కారు ఏంటో తెలుసా.? ఇటీవల రికార్డు సేల్స్ జరిగిన.. టాటా నెక్సాన్, హ్యుందాయ్ క్రెటానో అనుకుంటో పొరపాటే. ఆసక్తికరంగా మారుతీ సుజుకీ డిజైర్ సెడాన్.. ఈ ఏడాది ఎక్కువగా అమ్ముడుపోయిన కారుగా నిలిచింది. అయితే మొత్తం ప్యాసింజర్ వెహికిల్ సెగ్మెంట్లో చూస్తే వాఖ్యల ఆధిపత్యం కనిపిస్తుంది. వీటి వాటానే 55 శాతంగా ఉంది. అయితే టాప్-10 బెస్ట్ సెల్లింగ్ ప్యాసింజర్ వెహికిల్స్-2025 లిస్టులో ఉన్న ఏకైక సెడాన్ మోడల్ మారుతీ డిజైర్ మాత్రమే. ఇందులో 6 వాఖ్యలు, రెండు హ్యాచ్‌బ్యాక్స్, ఒక ఎంపీవీ మోడల్ కారు ఉంది. టాప్-10 బెస్ట్ సెల్లింగ్ కార్లలో అతిపెద్ద కార్ మేకర్ మారుతీ సుజుకీ నుంచే 6 ఉన్నాయి. టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ నుంచి 2 మోడల్స్ ఉన్నాయి. ఇక మహీంద్రా అండ్ మహీంద్రా నుంచి ఒకటి, హ్యుందాయ్ మోటార్ ఇండియా నుంచి ఒకటి చొప్పున ఉన్నాయి. 2025లో మారుతీ డిజైర్ కార్లు ఏకంగా 1,95,416 యూనిట్లు అమ్ముడుబోయి టాప్ ప్లేస్‌లో నిలిచింది. సెడాన్ టాప్ ప్లేస్‌లో నిలవడం గత 41 ఏళ్లలో ఇది రెండోసారి మాత్రమే. చివరిసారి 2018లో కూడా సెడాన్ టాప్ ప్లేసులో నిలిచింది. హ్యుందాయ్ క్రెటా 1,87,968 యూనిట్ల విక్రయంతో రెండో స్థానంలో ఉండగా.. టాటా నెక్సాన్ 1,81,186 యూనిట్ల విక్రయంతో మూడో స్థానంలో ఉంది. తర్వాత వరుసగా మారుతీ సుజుకీ వ్యాగన్ ఆర్ (179663), మారుతీ సుజుకీ ఎర్టిగా (175404), మారుతీ సుజుకీ స్విఫ్ట్ (170494) ఉన్నాయి. మహీంద్రా స్కార్పియో 1,61,103 యూనిట్లతో ఏడో స్థానంలో ఉండగా.. మారుతీ సుజుకీ ఫ్రాంక్స్ (159188), మారుతీ సుజుకీ బ్రెజ్జా (157606) వరుసగా 8,9 స్థానాల్లో ఉన్నాయి. పదో స్థానంలో టాటా పంచ్ 1,57,522 యూనిట్ల అమ్మకాలతో ఉంది.

# రికార్డ్‌స్థాయిలో ఎఫ్ఐఐల ఉపసంహరణ




భారత స్టాక్ మార్కెట్లపై విదేశీ సంస్థాగత మదుపర్లు మొఖం చాటేస్తోన్నారు. ఈ ఏడాది 2025లో కేవలం ఆరు కీలక రంగాల నుంచే విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐ) దాదాపు రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. ఇది భారత మార్కెట్ చరిత్రలో అత్యంత దారుణ స్థితుల్లో ఒక్కటి. 2025 ముగిసే సమయానికి ఈ అమ్మకాల నష్టం మరింత పెరగొచ్చని ట్రేడర్లలో ఆందోళన నెలకొంది. ఎన్ఎస్‌డిఎల్ సమాచారం మేరకు.. ప్రధానంగా ఆరు రంగాలపై ఎఫ్ఐఐల ప్రభావం తీవ్రంగా చూపింది. ఐటి, ఎఫ్ఎంసిజి రంగాల నుంచి అత్యధికంగా విదేశీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. మొత్తంగా 2025లో ఇప్పటివరకు భారత ఈక్విటీల నుండి రూ.1.6 లక్షల కోట్ల ఎఫ్ఐఐలు తరలిపోయాయి. "2025 క్యాలెండర్ ఇయర్‌లో ఎఫ్ఐఐలు 17.8 బిలియన్ డాలర్ల (రూ.1.6 లక్షల కోట్లు) విలువైన భారతీయ షేర్లను విక్రయించారు. ఈ నిధులు చైనా, జపాన్, యూరప్, అమెరికా వంటి ఇతర గ్లోబల్ మార్కెట్లకు తరలిపోయాయి" అని ఐసిఐసిఐ సెక్యూరిటీస్ తెలిపింది. భారత మార్కెట్లు స్వల్ప లాభాలను మాత్రమే ఇవ్వగా.. ఇదే సమయంలో అంతర్జాతీయ మార్కెట్లు 12-61 శాతం మధ్య లాభాలను అందించాయి. రియల్టీ (రూ. 12,364 కోట్లు), ఫైనాన్షియల్ సర్వీసెస్ (రూ. 10,894 కోట్లు), ఆటో (రూ. 9,242 కోట్లు) రంగాల్లో కూడా అమ్మకాలు కొనసాగాయి. మరోవైపు టెలికాం (రూ.47,109 కోట్లు), ఆయిల్ అండ్ గ్యాస్ (రూ. 9,076 కోట్లు), సర్వీసెస్ (రూ. 8,112 కోట్లు) రంగాల్లో నికర పెట్టుబడులు నమోదయ్యాయి. " వచ్చే ఏడాది 2026లో పెట్టుబడుల ఉపసంహరణ ఆగిపోయే అవకాశం ఉంది. నిఫ్టీ నుండి 12 శాతం రిటర్న్లు వచ్చే అవకాశం ఉండటం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు వంటి అంశాలు తిరిగి పెట్టుబడులు రావడానికి దోహదపడవచ్చు" అని బ్యాంక్ ఆఫ్ అమెరికా ఇండియా రీసెర్చ్ హెడ్ అమిష్ షా పేర్కొన్నారు.

# ఇదేంటో ఇలా ఉంది.. స్టీవ్ స్మిత్ విమర్శలు



హ్యాట్రిక్ విజయాలతో జోరు మీదున్న ఆస్ట్రేలియా క్రికెట్ జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. బాక్సింగ్ డే టెస్టులో ఇంగ్లండ్ చేతిలో ఆసీస్‌కు ఓటమి ఎదురైంది. సొంతగడ్డపై ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌ను కంగారూలు ఇప్పటికే సొంతం చేసుకున్నారు.

**3-0తో సిరీస్ సొంతం**

పెర్త్, బ్రిస్బేన్, అడిలైడ్ టెస్టుల్లో గెలుపొంది.. ఇంగ్లండ్‌పై మరోసారి ఆధిపత్యం చాటుతూ.. మరో రెండు టెస్టులు మిగిలి ఉండగానే వరుసగా రెండోసారి యాషెస్ సిరీస్ గెలుచుకుంది. తొలి రెండు టెస్టులకు రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ దూరం కాగా.. స్టీవ్ స్మిత్ సారథ్యం వహించాడు. మూడో టెస్టుకు కమిన్స్ తిరిగి వచ్చి జట్టుకు గెలుపు అందించగా.. అనారోగ్యం వల్ల స్మిత్ ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం మొదలైన నాలుగో టెస్టు నుంచి కమిన్స్ విశ్రాంతి తీసుకోగా.. స్మిత్ తిరిగి పగ్గాలు చేపట్టాడు. అయితే, ఈ మ్యాచ్‌లోనూ ఆది నుంచి ఆధిపత్యం కనబరిచిన ఆసీస్... శనివారం నాటి రెండో రోజు ఆటలో బోల్తా పడింది. ఫలితంగా నాలుగు వికెట్ల తేడాతో ఓడిపోయింది. ఈ క్రమంలో దాదాపు పదిహేనేళ్ల తర్వాత ఆసీస్ గడ్డపై ఇంగ్లండ్ తొలి టెస్టు విజయాన్ని అందుకుంది. ఇదిలా ఉంటే.. మెల్‌బోర్న్ టెస్టు రెండు రోజుల్లోనే ముగిసిపోవడంపై విమర్శలు వస్తున్నాయి. తొలిరోజే ఇరవై వికెట్లు కూలి ఇరుజట్లు ఆలౌట్ అయ్యాయి. రెండో రోజు సైతం పదహారు వికెట్లు పడ్డాయి. ఇక ఈ విషయంపై స్మిత్ స్పందించాడు. ఇంగ్లండ్ చేతిలో ఓటమి అనంతరం మాట్లాడుతూ..

**మా ఓటమికి కారణం అదే**

"కష్టతరమైన మ్యాచ్. తొందరంగా ముగిసిపోయింది. మేము అదనంగా కనీసం 50- 60 పరుగులు చేసి ఉంటే మంచి పోటీ ఉండేది. ఏదేమైనా చివరి వరకు మేము పట్టువీడలేదు.

**ఇదేంటో ఇలా ఉంది**

వికెట్ ముందుగా ఊహించినట్లుగానే ఉంది. అయితే, బంతి పాతబడే కొద్దీ పూర్వపు రూపాన్ని కోల్పోయింది. వాళ్లు బ్యాటింగ్‌కు వచ్చినపుడు కొన్ని ఓవర్లు దూకుడుగానే ఆడారు. ఏదేమైనా ఈ పిచ్ బౌలర్లకు అతిగా సహకరించింది. రెండు రోజుల్లోనే 36 వికెట్లు పడ్డాయంటే.. పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. పచ్చికను కాస్త మెరుగుపరిచి ఉంటే బాగుండేది. అయితే, వికెట్ ఎలా ఉన్నా అందుకు తగ్గట్లుగా మేము ఆడాల్సింది" అని స్మిత్ చెప్పుకొచ్చాడు. పరోక్షంగా పిచ్‌పై విమర్శలు గుప్పించాడు.

ఆసీస్- ఇంగ్లండ్ యాషెస్ బాక్సింగ్ డే టెస్టు సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా: 152 -132

ఇంగ్లండ్: 110 -178/6

ఫలితం: నాలుగు వికెట్ల తేడాతో ఇంగ్లండ్ గెలుపు

## ఆ ఓటమి బాధిస్తోంది.. టీమిండియాపై ప్రతీకారం తీర్చుకుంటాం..!



ప్రపంచకప్ ఏదైనా ఆస్ట్రేలియా ఆధిపత్యం మామూలే. కానీ, పదమూడో సీజన్ వన్డే వరల్డ్‌కప్‌లో మాత్రం భారత జట్టు చేతిలో మాజీ ఛాంపియన్ సెమీస్‌లోనే ఇంటిదారి పట్టింది. రికార్డు స్థాయిలో తమను కప్ గెలవకుండా చేసిన టీమిండియాపై ఆసీస్ జట్టు సభ్యులు కాస్త గుర్రుగానే ఉన్నారు. తాజాగా కంగారూ పేసర్ కిమ్ గార్త్ మాట్లాడుతూ.. సెమీఫైనల్లో ఓటమిని తాము ఇంకా మర్చిపోలేదని అంది. టీమిండియాపై కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటామని ఆమె అంటోంది. ఆస్ట్రేలియా బ్రాడ్‌కాస్టింగ్ కార్పోరేషన్ పాడ్‌కాస్ట్‌లో శనివారం కిమ్ గార్త్ మాట్లాడింది. ఈ సందర్భంగా వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్లో టీమిండియా చేతిలో ఓటమిని ప్రస్తావించింది. వచ్చే ఏడాది స్వదేశంలో జరుగబోయే ద్వైపాక్షిక సిరీస్‌లో భారత్‌ను ఓడించి దెబ్బకు దెబ్బ తీస్తామని ధీమాగా చెప్పిందీ స్పీడ్‌స్టర్. 'పదమూడో సీజన్ వన్డే వరల్డ్‌కప్ సెమీఫైనల్లో ఓటమి మమ్మల్ని ఇంకా బాధిస్తోంది. భారత్ మెరుగైన జట్టే. ఇండియాలో ఆడిన ప్రతి మ్యాచ్ గొప్పగా అనిపిస్తుంది. అయినా సరే పరాజయాన్ని ఇప్పటికీ మేము జీర్ణించకోలేకపోతున్నాం. ఆ ఓటమికి బదులు తీర్చుకుంటాం. రెండు నెలల్లో టీ20, వన్డే సిరీస్, టెస్టు మ్యాచ్ కోసం టీమిండియా మా దేశానికి వస్తుంది. అప్పుడు ఓడించి ప్రతీకారం తీర్చుకుంటాం' అని గార్త్ పేర్కొంది. సెమీఫైనల్లో గార్త్ 7 ఓవర్లలో 46 పరుగులిచ్చి 2 వికెట్లు తీసంది. 2026లో మూడు ఫార్మాట్ల సిరీస్ కోసం భారత జట్టు ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. ఫిబ్రవరి- మార్చిలో ఆతిథ్య జట్టుతో టీమిండియా మూడు టీ20లు, మూడు వన్డేలు, ఒక టెస్టు మ్యాచ్ ఆడనుంది. డీవై పాటిల్ మైదానం వేదికగా జరిగిన సెమీఫైనల్లో ఫొబె లిచ్‌ఫీల్డ్ (119) సెంచరీతో మెరవగా ఆస్ట్రేలియా 338 పరుగులు చేసింది. అనంతరం భారీ ఛేదనలో టీమిండియాకు షాకిస్తూ ఆరంభంలోనే ఓపెనర్లు షఫాలీ వర్మ, స్మృతి మంధానలను ఔట్ చేసింది కిమ్ గార్త్. దాంతో.. భారత్ ఒత్తిడిలో పడినా జెమీమా రోడ్రిగ్స్ (127 నాటౌట్) చిరస్మరణీయ శతకంతో ఆసీస్ ఆశలపై నీళ్లు చల్లింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(89)తో కీలక భాగస్వామ్యం.. ఆపై రీచా ఘోష్(26) మెరుపులతో ఫైనల్ చేరింది భారత్. టైటిల్ పోరులో దక్షిణాఫ్రికాను 52 పరుగుల తేడాతో చిత్తుచేసిన విమెన్ ఇన్ బ్లూ తొలిసారి విశ్వవిజేతగా అవతరించింది.

# స్పోర్ట్స్

## 14 ఏళ్ల తర్వాత.. ఆసీస్ గడ్డపై గెలిచిన ఇంగ్లండ్.. నాలుగో టెస్టులో 4 వికెట్ల తేడాతో విక్టరీ



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా గడ్డపై ఆ దేశాన్నే ఓడించింది ఇంగ్లండ్. సుమారు 14 ఏళ్ల విరామం తర్వాత ఆసీస్ పిచ్‌పై టెస్టుల్లో ఇంగ్లండ్ జట్టు విజయం సాధించింది. మెల్‌బోర్న్‌లో జరిగిన నాలుగో టెస్టులో ఇంగ్లండ్ నాలుగు వికెట్ల తేడాతో అసాధారణ విజయాన్ని నమోదు చేసింది. కేవలం రెండు రోజుల్లోనే బాక్సింగ్ డే మ్యాచ్ ముగియడం గమనార్హం. ఆసీస్, ఇంగ్లండ్ మధ్య జరిగిన పెర్త్ టెస్టు కూడా రెండు రోజుల్లో ముగిసిన విషయం తెలిసిందే. అయితే పెర్త్ టెస్టులో ఆస్ట్రేలియా విక్టరీ కొట్టగా, ఇవాళ మెల్‌బోర్న్‌లో ఇంగ్లండ్ స్వీట్ విక్టరీ నమోదు చేసింది. %రెండో ఇన్నింగ్స్‌లో 175 రన్స్ టార్గెట్‌తో బరిలోకి దిగిన ఇంగ్లండ్ ఆరు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకున్నది. వాస్తవానికి ఈ మ్యాచ్ కూడా హెూరాహెూరీగా సాగింది. ఆస్ట్రేలియా బౌలర్లు ఇంగ్లండ్ బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టారు. టార్గెట్ చిన్నదే అయినా..ఇంగ్లండ్ క్రికెటర్లు తెగ ఇబ్బందిపడాల్సి వచ్చింది. పేస్ అటాక్‌తో ఆస్ట్రేలియా బౌలర్లు చమటలు పట్టింది. ఇవాళ రెండో రోజు ఆస్ట్రేలియా తన రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 132 రన్స్ కే ఆలౌటైంది. ఇంగ్లండ్ బౌలర్లలో బ్రౌడన్ కార్సే 4, స్టోక్స్ 3, టాంగే రెండు వికెట్లు తీసుకున్నారు. నిజానికి యాషెస్ సిరీస్‌ను ఇప్పటికే ఆస్ట్రేలియా సొంతం చేసుకున్నది. కానీ ప్రస్తుతం ఆధిపత్యాన్ని 3-1కి తగ్గించింది ఇంగ్లండ్. ఆస్ట్రేలియా తన స్వంత గడ్డపై ఓడించేందుకు ఇంగ్లండ్‌కు 15 ఏళ్లు పట్టింది. ఇన్నేళ్లలో ఇంగ్లండ్ 16 టెస్టుల్లో ఓడగా, రెండు మ్యాచ్‌లను డ్రా చేసుకున్నది. రెండు రోజుల్లోనే ముగిసిన పెర్త్ టెస్టులో మొత్తం 847 బంతులు వేయగా, ఇక మెల్‌బోర్న్ టెస్టులో 852 బాల్స్ పడ్డాయి. 2011లో సిడ్నీలో జరిగిన టెస్టులో చివరిసారి ఇంగ్లండ్ విజయం సాధించింది. మెల్‌బోర్న్ పిచ్‌పై విమర్శలు వస్తున్నాయి. తొలి రోజే ఆ పిచ్‌పై 20 వికెట్లు కూలాయి. ఇక రెండో రోజు కూడా 16 వికెట్లు పడ్డాయి. దీంతో పిచ్‌ను మేనేజ్ చేస్తున్న తీరును విమర్శిస్తున్నారు.




## శర్వానంద్ చేతుల మీదుగా 'కాగితం పడవలు' టీజర్ లాంచ్.. హార్ట్ టచింగ్ లవ్ స్టోరీ!

టాలీవుడ్ చార్మింగ్ స్టార్ శర్వానంద్ తాజాగా 'కాగితం పడవలు' చిత్ర టీజర్‌ను లాంచ్ చేసి చిత్ర యూనిట్‌కు తన శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంజీఆర్ తుకారాం దర్శకత్వంలో వర్ధన్, కృష్ణప్రియ జంటగా నటించిన ఈ చిత్రాన్ని ఎస్ఎల్ఎన్ సినీ క్రియేషన్స్, ప్రణధి క్రియేషన్స్ మరియు నవ నారాయణ సినీ క్రియేషన్స్ బ్యానర్లపై కీర్తన నరేష్, టి.ఆర్. ప్రసాద్ రెడ్డి వెంకట్రాజుల, గాయిత్రమ్మ అంజనప్ప అత్యున్నత నిర్మాణ విలువలతో నిర్మించారు. టీజర్ విడుదల సందర్భంగా శర్వానంద్ మాట్లాడుతూ.. ఎలాంటి సినీ నేపథ్యం లేకపోయినా ప్యాషన్‌తో సినిమా తీసిన దర్శకుడు తుకారాంను అభినందించారు. టీజర్ చాలా నిజాయితీగా, ఆసక్తికరంగా ఉందని, హీరో వర్ధన్ తన మొదటి సినిమా అనిపించకుండా అద్భుతంగా నటించాడని ప్రశంసించారు. "ప్రేమ నిప్పులాంటిది.. అది జీవితానికి వెలుగునిచ్చే దీపం అవ్వచ్చు లేదా దహించే కార్చిచ్చు కావచ్చు" అనే డైలాగ్‌తో సాగిన ఈ టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. హీరో హీరోయిన్ల మధ్య కెమిస్ట్రీ, హార్ట్ టచింగ్ ఎమోషన్స్, %ూ×ూ%. నౌఫల్ రాజా అందించిన నేపథ్య సంగీతం మరియు రుద్రసాయి విజువల్స్ సినిమాపై అంచనాలను పెంచేశాయి. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎం. హిమ బిందు పర్యవేక్షణలో రూపొందిన ఈ చిత్రం త్వరలోనే థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది.

## స్టెప్పులతో అదరగొట్టిన చిరు-వెంకీ.. మన శంకరవరప్రసాద్‌గారు సాంగ్ ప్రోమో రిలీజ్

టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద ఈ సంక్రాంతికి అసలైన పూనకాలు రావడం ఖాయంగా కనిపిస్తోంది. సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. ఈ సినిమాలో విక్టరీ వెంకటేష్ ఒక కీలకమైన అతిథి పాత్రలో మెరవనుండటంతో అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ఈ చిత్రం సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా సినిమా నుంచి మాస్ అప్‌డేట్‌ను పంచుకుంది చిత్రయూనిట్. ఈ సినిమా నుంచి 'ఆర్ యూ రెడీ' అంటూ సాగే పాట ప్రోమోను చిత్రబృందం విడుదల చేసింది. ఈ పాటలో చిరంజీవి తన మార్క్ గ్రేస్‌తో, వెంకటేష్ తనదైన స్టైల్‌తో సందడి చేస్తున్నారు. ఈ సాంగ్ ప్రోమో ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ కంప్లీట్ మాస్ సాంగ్‌ను డిసెంబర్ 30న విడుదల చేయనున్నారు.




## బిగ్‌బాస్ వల్ల నాగార్జునకి పెద్ద ఫ్యాన్ అయిపోయా : సంజన



"ఓ ఐదేళ్ళ క్రితం నా ప్రమేయం లేకుండా జరిగిన ఓ సంఘటన నా జీవితాన్ని,కెరీర్ ని ఒక కుదుపు కుదిపేసింది. అయితే స్వతహా నేను ఫైటర్ ని. అందుకే ప్రతికూల పరిస్థితులతో నేను పెద్ద పోరాటమే చేశాను. చివరికి విజేతగా నిలిచాను" అంటూ భావోద్వేగానికి లోనయ్యారు బిగ్ బాస్ సీజన్-9లో టాప్ 5 ఫైనలిస్ట్ గా నిలిచిన ప్రముఖ హీరోయిన్ సంజనా గర్లాని. ఒడిదుడుకుల్లో తన వెన్నంటి నిలిచిన తన కుటుంబానికి, శ్రేయోభిలాషులకు, అభిమానులకు ఆమె ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. బిగ్ బాస్ సీజన్ - 9లో టాప్ 5 ఫైనలిస్ట్ గా నిలిచిన సంజన మీడియాతో ప్రత్యేకంగా సమావేశమై, బిగ్ బాస్ అనుభవాలను, అనుభూతులను పంచుకున్నారు. బిగ్ బాస్ నుంచి తాను ఎంతో నేర్చుకున్నానని, ఈ అనుభవంతో తన కెరీర్ లో ఫ్రెష్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేయనున్నానని ఆమె తెలిపారు. ముఖ్యంగా జీవితంలో తాను మళ్ళీ గర్వంగా తలెత్తుకుని తిరిగేందుకు కారణంగా నిలిచిన బిగ్ బాస్ కి ఎప్పటికీ ఋణపడి ఉంటానని సంజనా ప్రకటించారు. బిగ్ బాస్ హోస్ట్ అక్కినేని నాగార్జునకు ఈ షోలో పాల్గొన్నాక మరింత పెద్ద ఫ్యాన్ అయిపోయానని ఆమె పేర్కొన్నారు. ఇకపై తెలుగు సినిమాలపై మరింత దృష్టి సారిస్తానని, ఇప్పటికే కొన్ని ఎంక్వైరీస్ వచ్చాయని అన్నారు. రెబల్ స్టార్ ప్రభాస్ "బుజ్జిగాడు మేడ్ ఇన్ చెన్నై"లో త్రిష చెల్లెలిగా నటించిన సంజనా.... ఆ చిత్రంలోని ఓ పాపులర్ డైలాగ్ చెప్పి, అభిమానులను అలరించారు. తనను సపోర్ట్ చేసిన ప్రతి ఒక్కరూ గర్వపడేలా ఇకపై నడుచుకుంటానని సంజనా అన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన 'విజనరీ వౌస్' కి సంజనా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు



## సల్మాన్ 60వ బర్త్‌డే.. చిరంజీవి స్పెషల్ విషెస్

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ నేడు (డిసెంబర్ 27న) 60వ పుట్టినరోజు జరుపుకుంటున్నాడు. ఈ సందర్భంగా అతడికి పలువురు ప్రముఖులు పర్సనల్‌గా, సోషల్ మీడియా వేదికగా బర్త్‌డే విషెస్ తెలియజేస్తున్నారు. తాజాగా టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి తన స్నేహితుడికి ఎక్స్ (ట్విటర్) వేదికగా విషెస్ తెలియజేశారు.

హ్యాపీ బర్త్‌డే

నా ప్రియమైన సోదరుడికి 60వ పుట్టినరోజు శుభాకాంక్షలు. ఈ అద్భుతమైన మైలురాయిని చేరుకున్న సల్లూభాయ్‌కు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ ఏడాది ఆయురారోగ్యాలతో పాటు అపారమైన సంతోషం, ప్రేమ పొందాలని మనసారా కోరుకుంటున్నాను. నువ్వు లక్షలాదిమందికి ఒక ఇన్‌స్పిరేషన్.. నిన్ను స్నేహితుడని పిలవడం మాలాంటివారికి దక్కిన అదృష్టం.

ఎంజాయ్ చెయ్

నువ్వు మరెన్నో విజయాలు అందుకోవాలి, సుఖసంతోషాలతో గడపాలి. ఈ ప్రత్యేకమైన రోజును హ్యాపీగా ఎంజాయ్ చెయ్ అంటూ సల్లూ భాయ్‌తో దిగిన ఫోటో షేర్ చేశారు. కాగా చిరంజీవి నటించిన 'గాడ్ ఫాదర్' మూవీలో సల్మాన్ ఖాన్ అతిథి పాత్రలో కనిపించాడు. సినిమాల విషయానికి వస్తే చిరంజీవి ప్రస్తుతం 'విశ్వంభర', 'మన శంకర వరప్రసాద్‌గారు' మూవీస్ చేస్తున్నారు. సల్మాన్.. 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' మూవీ చేస్తున్నాడు.

## రూ. 1800 కోసం ఆ పని చేశా.. ఈ క్షణం చనిపోయినా ఓకే : అరియానా



అరియానా గ్లోరీ.. తెలుగు ప్రేక్షకులకు పరిచయం అక్కర్లేని పేరు ఇది. ఆర్జీవీని ఇంటర్వ్యూలో చేసి బోల్డ్ యాంకర్ గా గుర్తింపు తెచ్చుకున్న అరియానా, ఆ క్రేజ్‌తోనే బిగ్ బాస్ షోలో కంటెస్టెంట్‌గా ఎంపికైంది. బిగ్‌బాస్ నాలుగో సీజన్‌లో పాల్గొని..తనదైన ఆటతీరుతో అందరిని ఆకట్టుకుంది. ఈ షో నుంచి బయటకు వచ్చన తర్వాత పలు వెబ్ సిరీస్‌లు, సినిమాలతో పాటు టీవీ షోలు కూడా చేస్తూ బీజీ అయిపోయింది. తాజాగా ఈ బోల్డ్ బ్యూటీ ఓ టీవీ చానల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తన సినీ కెరీర్‌తో పర్సనల్ లైఫ్ గురించి ఆసక్తికర విషయాలు షేర్ చేసుకుంది.

అందుకే పేరు మార్చుకున్నా నా అసలు పేరు అరియానా కాదు. మా అమ్మనాన్నలు నాకు అర్చన అని పేరు పెట్టారు. అయితే కష్టాలు ఎక్కువ అవ్వడంతో నేనే పేరు మార్చుకున్నా. అరియానా పేరుతో ఇప్పుడు హ్యాపీగా ఉన్నాను. మన జీవితంలో ఏం జరగాలో ముందే రాసిపెట్టి ఉంటుంది. నేను అనుకోకుండా యాంకర్ అయ్యాను. ఒక రోజు నేను, మా చెల్లి టీవీ చూస్తుంటే.. యాంకర్స్ కావలెనన్న ప్రకటన వచ్చింది. అది చూసి నేను ఆడిషన్స్‌కి వెళ్లాను. అదృష్టం కొద్ది సెలెక్ట్ అయ్యాను. అక్కడ నుంచి చిన్న చిన్న అవకాశాలతో ఈ స్థాయికి చేరుకున్నాను. డబ్బుల కోసం నేను రకరకాల జాబులు చేశా. లైన్‌లో నిలబడి పన్నీరు చల్లేందుకు కూడా వెళ్లాను. అప్పుడు నాకొచ్చే జీతం రూ. 1800 మాత్రమే. రూమ్ రెంట్ రూ. 3000. ఒకసారి అద్దె కట్టేందుకు డబ్బులు జమ చేయగా.. ఓ అమ్మాయి దొంగతనం చేసింది. దీంతో చాలా ఇబ్బంది పడ్డా. డబ్బులు సరిపోకపోవడంతో ఒకేసారి ఐదారు జాబులు చేశా. ఇప్పుడు నేను బెటర్ పొషిషన్‌లో ఉన్నాను. ఇక నీకు ఏ దేవుడు అంటే ఇష్టం అని యాంకర్ అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ.. 'మా అమ్మ నన్ను క్రిస్టియన్‌లా పెంచింది. కానీ ఈ మధ్య నాకు సుబ్రహ్మణ్య స్వామి అంటే చాలా ఇష్టం పెరిగింది. ఆయన ప్రత్యక్షమై ఏం కావాలని అడిగితే.. నన్ను తీసుకెళ్లిపో అని చెబుతా. దేవుడే వచ్చి అడిగాక ఇంకేముంది?. నేను ఇప్పుడు చాలా హ్యాపీగా ఉన్నా. ఇప్పటికిప్పుడు చనిపోయినా నాకు ఓకే' అని అరియానా ఎమోషనల్‌గా చెప్పుకొచ్చింది.

# కారుణ్య నియామకం హక్కు కాదు.. తక్షణ భరోసా

ప్రభుత్వ ఉద్యోగుల మరణానంతరం వారి కుటుంబ సభ్యులకు కల్పించే కారుణ్య నియామకాలపై సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. కారుణ్య నియామక ప్రాతిపదికన ఒకసారి ఉద్యోగాన్ని అంగీకరించిన తర్వాత, తమకు అర్హత ఉన్నా అంతకంటే ఉన్నత పదవి కావాలని కోరుతూ దరఖాస్తు చేసుకోవడానికి వీల్లేదని కోర్టు స్పష్టం చేసింది.



**కేసు నేపథ్యం**

తమిళనాడు పట్టణ పంచాయతీల్లో స్వీపర్లుగా పనిచేస్తూ మరణించిన ఇద్దరు వేర్వేరు ఉద్యోగుల కుమారులకు (ఎం.జయబల్, ఎస్.వీరమణి) వారి తండ్రుల మరణానంతరం 2007, 2012 సంవత్సరాల్లో స్వీపర్లుగానే ఉద్యోగాలు లభించాయి. వారు ఉద్యోగంలో చేరే సమయంలో ఎలాంటి అభ్యంతరం తెలపకుండా ఆ కొలువుల్లో చేరారు. అయితే, సుమారు 3 నుంచి 9 ఏళ్ల తర్వాత తమకు జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు కావాల్సిన అర్హతలు ఉన్నాయని, అప్పట్లో అవగాహన లేక తక్కువ స్థాయి ఉద్యోగంలో చేరామని పేర్కొంటూ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు వారికి అనుకూలంగా తీర్పునివ్వగా, దానిని సవాలు చేస్తూ దాఖలైన అప్పీల్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది.

**సుప్రీంకోర్టు తీర్పులోని ముఖ్యాంశాలు**

కారుణ్య నియామకం అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16 (సమానత్వ హక్కు)కు ఒక మినహాయింపు మాత్రమే. కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థిక సంక్షోభంలో ఉన్న కుటుంబానికి తక్షణ భరోసా ఇవ్వడమే దీని ఉద్దేశం. ఇది ఒక హక్కు కాదు లేదా కెరీర్ అభివృద్ధి కోసం ఇచ్చే అవకాశం కాదు. అభ్యర్థికి ఉన్నత పదవికి కావాల్సిన విద్యార్హతలు ఉన్నప్పటికీ ఖాళీలు, ప్రభుత్వ నిబంధనల ప్రకారమే తదుపరి నియామకం జరుగుతుంది. అర్హత ఉంది కదా అని ఉన్నత పదవిని డిమాండ్ చేసే హక్కు అభ్యర్థికి ఉండదు. ఉద్యోగంలో చేరిన చాలా ఏళ్ల తర్వాత (3-9 ఏళ్లు) కోర్టును ఆశ్రయించడాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. 'వేరే ఒకరికి నిబంధనలకు విరుద్ధంగా ఉన్నత పదవి ఇచ్చారు కాబట్టి, మాకూ ఇవ్వాలి' అనే వాదనను కోర్టు తోసిపుచ్చింది. ఒక అధికారి చేసిన తప్పును మరొకరికి వర్తింపజేయమని కోర్టులు ఆదేశించలేవని చెప్పింది. తప్పును పునరావృతం చేయలేమని స్పష్టం చేసింది.

**న్యాయ నిపుణుల విశ్లేషణ**

ఈ తీర్పుపై న్యాయ నిపుణులు స్పందిస్తూ, ఇది ప్రభుత్వ నియామక ప్రక్రియల సమగ్రతను కాపాడుతుందని పేర్కొన్నారు. కారుణ్య నియామకాలు కేవలం మానవతా దృక్పథంతో చేసేవని, వీటిని సీనియారిటీ పెంచుకోవడానికి లేదా ఉన్నత పదవులు అనుభవించడానికి వాడుకోలేమని ఈ తీర్పు ద్వారా స్పష్టమైందని అభిప్రాయపడ్డారు. మద్రాస్ హైకోర్టు ఇచ్చిన పాత తీర్పును కొట్టివేస్తూ, పిటిషన్లను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. దీంతో కారుణ్య నియామకం పొందిన వారు భవిష్యత్తులో ఉన్నత పదవుల కోసం ఇలాంటి క్లెయిమ్స్ చేయడానికి అవకాశం లేకుండా పోయింది.

# పాకిస్థాన్‌లో కొత్త టెర్రరిస్ట్ లీడర్

భారత్‌పై ఉగ్రదాడుల పన్నాగాలకు వేదికగా మారిన పాకిస్థాన్... పేర్లు మారుస్తూ, ముఖాలు మార్చుకుంటూ ఉగ్రవాదాన్ని కొనసాగిస్తూనే ఉంది. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత పరిస్థితులు కొంత మారినట్టు కనిపించినా, వాస్తవం మాత్రం మరోలా ఉంది. ఒకప్పుడు భారత్‌కు మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులుగా ఉన్న హాఫీజ్ సయీద్, మసూద్ అజార్ వంటి వాళ్లు ఒక్కసారిగా వార్తల నుంచి మాయమయ్యారు. వారంతా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఇదే సమయంలో పాకిస్థాన్ మరో కొత్త ఉగ్ర నేతను ముందుకు తెచ్చిందన్న ఆరోపణలు ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో చర్చకు వస్తున్నాయి. ఆ కొత్త ఉగ్ర నేత పేరు ఖారీ మొహమ్మద్ యాకూబ్ షేక్. లష్కరే తోయిబా నుంచి ఉగ్ర శిక్షణ పొందిన ఇతడు, ఇప్పుడు స్వతంత్రంగా తనకంటూ ఓ కొత్త సంస్థను నిర్మించుకున్నాడు. ఆ సంస్థ పేరు సెంట్రల్ ముస్లిం లీగ్. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ఈ సంస్థను పాకిస్థాన్‌లో ఒక రాజకీయ పార్టీగా నమోదు చేశారు. అంతే కాదు, దీనికి పాక్ సైన్యం పరోక్షంగా మద్దతు ఇస్తోందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.



**యాకూబ్ షేక్ నేపథ్యం**

1972లో పాకిస్థాన్‌లోని బహవల్‌పూర్‌లో జన్మించిన ఖారీ యాకూబ్, మొదట మదర్సాలో చదువు పూర్తిచేసి మతప్రచారకుడిగా తన జీవితాన్ని ప్రారంభించాడు. అయితే క్రమంగా తీవ్రవాద భావజాలానికి లోనై ఉగ్రవాద మార్గంలోకి మళ్లాడు. 2012లోనే అమెరికా అతడిని అధికారికంగా ఉగ్రవాదిగా గుర్తించింది. అప్పట్లో అతడు లష్కరే తోయిబా కోసం పనిచేస్తున్నాడన్న ఆరోపణలు వచ్చాయి. అంతేకాదు, జైష్-ఎ-మొహమ్మద్ చీఫ్ మసూద్ అజార్‌తోనూ అతడికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని పలు ఇంటెలిజెన్స్ నివేదికలు చెబుతున్నాయి. 2017లో దిఫా-ఏ-పాకిస్థాన్ కౌన్సిల్ తరపున ఎన్నికల్లో పోటీ చేసిన యాకూబ్ ఓడిపోయాడు. అయినా రాజకీయాల్ని, ఉగ్రవాదాన్ని కలిపి నడిపే ప్రయత్నాన్ని మాత్రం ఆపలేదు. 2025 ప్రారంభంలో ఆఫ్ఘనిస్థాన్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగిన సమయంలో, యాకూబ్ తాలిబాన్ పాలనకు వ్యతిరేకంగా ఫత్వా జారీ చేశాడు. ఇదే అంశం పాక్ సైన్యానికి అతడిని దగ్గర చేసింది. అప్పటి నుంచి యాకూబ్‌కు సైన్యం అండగా నిలుస్తోందన్న ప్రచారం మొదలైంది. ఆపరేషన్ సిందూర్‌లో మసూద్ అజార్ కుటుంబానికి చెందిన 14 మంది మరణించారు. హాఫీజ్ సయీద్‌కు చెందిన రహస్య స్థావరాలు కూడా ధ్వంసమయ్యాయి. ఆ తర్వాత వీరిద్దరూ పూర్తిగా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ప్రస్తుతం వారు పాక్ సైన్యం నిఘాలోనే భద్రంగా ఉన్నారని సమాచారం. ఇదే సమయంలో పాకిస్థాన్ దేశంలో తెహ్రీక్-ఇ-తాలిబాన్, బలూచ్ లిబరేషన్ ఆర్మీ వంటి ఉగ్రసంస్థలు సైన్యానికి పెద్ద సవాలుగా మారాయి. వీటిని అణచివేయడంలో పాక్ సైన్యం విఫలమవుతోంది. ఈ పరిస్థితుల్లోనే పాకిస్థాన్ మరోసారి పాత పద్ధతికే వెళ్లిందని విశ్లేషకులు చెబుతున్నారు. పాత ఉగ్రనేతలు అయిన హాఫీజ్, మసూద్ ఇక పనికిరారని భావించి, వారి స్థానంలో కొత్త ముఖాన్ని ముందుకు తెచ్చే ప్రయత్నమే ఖారీ యాకూబ్ షేక్ అని అంటున్నారు. ఉగ్రవాదాన్ని రాజకీయాల ముసుగులో దాచిపెట్టి, ప్రపంచాన్ని మభ్యపెట్టే ప్రయత్నం పాకిస్థాన్ చేస్తోందన్న విమర్శలు మరింత బలపడుతున్నాయి.

# ఢిల్లీని కమ్మేసిన పొగమంచు..

దేశ రాజధాని ఢిల్లీని ప్రమాదకరమైన పొగమంచు కమ్మేసింది. దీంతో విజిబిలిటీ దారుణంగా పడిపోయింది. అతిసమీపంలో వెళ్తున్న వాహనాలు కూడా కనిపించని పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా రోడ్డు, రైలు, వాయు మార్గాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తీవ్ర పొగమంచు నేపథ్యంలో భారత వాతావరణ శాఖ ఢిల్లీకి రెడ్ అలర్ట్ జారీ చేసింది. ప్రజలు జాగ్రత్తగా వాహనాలు నడపాలని, ఫాగ్ లైట్లను ఉపయోగించాలని సూచించింది. అత్యవసర పరిస్థితి ఉంటేనే బయటకు రావాలని హెచ్చరించింది. పొగమంచు కారణంగా విజిబిలిటీ పడిపోవడంతో ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగించే దాదాపు 128 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. అందులో 64 అరైవల్స్ కాగా, 64 డిపార్చర్స్ ఉన్నాయి. మరికొన్నింటిని దారి మళ్లించారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులకు ఢిల్లీ ఎయిర్‌పోర్టు కీలక అడ్వైజరీ జారీ చేసింది. ఎయిర్‌పోర్టుకు వచ్చే ముందు విమాన స్టేటస్‌ను చెక్‌చేసుకోవాలని సూచించింది. మరోవైపు విమానాల రద్దు, ప్రయాణ సమయాల్లో మార్పుల గురించి తెలుసుకోవడానికి తమ అధికారిక వెబ్‌సైట్లను తనిఖీ చేయాలని విమానయాన సంస్థలు ప్రయాణికులకు సూచించాయి. మరోవైపు.. పలు రైళ్లు కూడా ఆలస్యంగా నడుస్తున్నాయి. రాజధాని ఎక్స్‌ప్రెస్, వందేభారత్, జన శతాబ్దితో సహా పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఇవాళ ఉదయం ఢిల్లీలో గాలి నాణ్యత సూచిక ప్రమాదకరస్థాయిలో నమోదైంది. నగరంలో ఓవరాల్ ఏక్యూఐ లెవెల్స్ 402గా నమోదైనట్లు సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తెలిపింది. నగరంలోని 40 ఎయిర్ మానిటరింగ్ కేంద్రాల్లోని 25 కేంద్రాల్లో ఇవాళ ఉదయం 7 గంటలకు గాలి నాణ్యత సూచిక తీవ్రమైన కేటగిరీలో నమోదైంది. వివేక్ విహార్‌లో అత్య ధికంగా 460గా నమోదైంది. ఆనంద్ విహార్ (459), రోహిణి (445), వజీర్‌పూర్‌లో 444గా ఏక్యూఐ లెవెల్స్ నమోదయ్యాయి.



# సీజేఐ చంద్రచూడ్ అని చెప్పి డిజిటల్ అరెస్ట్.. రూ.3.71 కోట్లు కోల్పోయిన 68 ఏళ్ల మహిళ

ముంబై: ముంబైకి చెందిన 68 ఏళ్ల వృద్ధురాలిని.. సైబర్ నేరగాళ్లు దారుణంగా మోసం చేశారు. బెదిరింపులకు పాల్పడి ఆమె అకౌంట్ నుంచి సుమారు 3.71 కోట్లు కాజేశారు. డిజిటల్ అరెస్టుకు చెందిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ అని చెప్పి సైబర్ నేరగాడు ఆ మహిళను మోసం చేశాడు. సీబీఐ, పోలీసు అధికారులమని ఆమెను నమ్మించారు. అంధేరీ ఈస్ట్‌లో ఆ బాధిత మహిళ 26 ఏళ్లుగా జీవిస్తోంది. ఆగస్టులో ఆమెకు తొలిసారి సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. పోలీసులమని చెప్పి ఆమెతో పరిచయం చేసుకున్నారు. ఆ తర్వాత వాట్సాప్‌లో వేర్వేరు నెంబర్ల నుంచి వీడియో కాల్స్ వచ్చాయి. ఆధార్ కార్డుతో బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసినట్లు వీడియో కాల్‌లో ఆ బాధిత మహిళను ఓ వ్యక్తి బెదిరించాడు. ఆ అకౌంట్ ద్వారా సుమారు ఆరు కోట్ల అక్రమ లావాదేవీలు జరిగినట్లు చెప్పాడు. అయితే తనకు బ్యాంక్ అకౌంట్ లేదని ఆమె చెప్పిన తర్వాత.. ఫేక్ పోలీసు ఫిర్యాదు ఫోటోలను ఆమెకు పంపారు. సీబీఐ లోగో ఉన్న డాక్యుమెంట్లను కూడా బాధిత మహిళకు మెసేజ్ చేశారు. ఈ విషయం గురించి ఫ్యామిలీలో ఎవరికీ చెప్పవద్దు అని , ఒకవేళ చెబితే వాళ్లను అరెస్టు చేస్తామని బెదిరించారు. 24 గంటల నిఘాలో ఉన్నట్లు ఆమెను బెదిరించారు. కేసు విచారణ చేపడుతున్నామన్నారు. ఇక ఆ తర్వాత ఓ వ్యక్తి వీడియో కాల్‌లో వచ్చి, తాను జడ్జి చంద్రచూడ్ అని పరిచ యం చేసుకున్నాడు. ఆ తర్వాత ఆ మహిళను ప్రశ్నించాడు. బెయిల్ నిరాకరిస్తున్నట్లు ఆమెను బెదిరించాడు. దీంతో తన వద్ద ఉన్న డబ్బును డిపాజిట్ చేయాలని సైబర్ నేరగాళ్లు ఆమెను బెదిరించారు. మ్యూచువల్ ఫండ్స్ తీసి ఆ డబ్బును ఆర్టీజీఎస్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయాలని ఆదేశించారు. పోలీసుల తనపై చర్య తీసుకునే అవకాశం ఉందన్న భయంతో.. ఆమె సుమారు 3.71 కోట్ల డబ్బును బదిలీ చేసింది. మళ్లీ మళ్లీ డబ్బులు అడగడంతో ఆమె తేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. చాటింగ్ లాగ్, కాల్ డిటేల్స్, ట్రాన్‌జాక్షన్ రికార్డులు, బ్యాంక్ స్టేట్మెంట్లలను ఆమె పోలీసులకు సమర్పించింది.




## అరావళిపై 'సుప్రీం' స్టే: పాత ఉత్తర్వుల నిలిపివేత



**న్యూఢిల్లీ:** అరావళి పర్వత శ్రేణుల నిర్వచనాన్ని పరిమితం చేస్తూ, గతంలో ఇచ్చిన ఉత్తర్వులపై సోమవారం సుప్రీంకోర్టు స్టే విధించింది. సముద్ర మట్టం నుండి కనీసం 100 మీటర్ల ఎత్తులో ఉన్న భూభాగాలను మాత్రమే అరావళి పర్వతాలుగా పరిగణించాలంటూ, ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించేందుకు కోర్టు మొగ్గు చూపింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించి, తన ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ, కీలక నిర్ణయం తీసుకుంది. గత నవంబర్ 20న సుప్రీంకోర్టు.. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ సూచించిన నిర్వచనాన్ని ఆమోదించింది. దీని ప్రకారం స్థానిక భూతలానికి 100 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తులో ఉన్న ప్రాంతాలనే అరావళి శ్రేణిగా గుర్తించాలని పేర్కొంది. అయితే ఈ నిర్ణయంపై పర్యావరణ వేత్తలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేవలం ఎత్తును ప్రాతిపదికగా తీసుకుంటే, దాదాపు 90 శాతం అరావళి ప్రాంతం రక్షణ కోల్పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మైనింగ్, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు వరంగా మారుతుందని వారు పేర్కొన్నారు. ఈ వివాదాస్పద నిర్వచనంపై పలు విమర్శలు వచ్చిన దరిమిలా సుప్రీంకోర్టు ఈ అంశాన్ని తిరిగి విచారించాలని నిర్ణయించింది. థార్ ఎడారి తూర్పు దిశగా విస్తరించకుండా అరావళి పర్వతాలు ఒక రక్షణ కవచం మాదిరిగా ఉపకరిస్తున్నాయని, దేశంలోని అత్యంత పురాతన పర్వత శ్రేణులైన వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని కోర్టు పేర్కొంది. కాగా గతంలో సర్వే ఆఫ్ ఇండియా సహాయంతో మ్యాపింగ్ ప్రక్రియను ప్రారంభించాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించింది. అయితే తాజా స్టే ఆర్డర్ నేపథ్యంలో ఈ ప్రక్రియ నిలిచిపోనుంది. సోమవారం జస్టిస్ బి.ఆర్. గవాయ్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం 'ఆరావళి'పై విచారణ జరిపింది.

## బంగ్లాదేశ్ చొరబాటుదారులు ఎక్కడున్నా పంపించేస్తాం



బంగ్లాదేశ్ చొరబాటుదారులు అస్సాంలోనే కాకుండా.. దేశంలో ఎక్కడున్నా పంపించేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. అస్సాంలో నిర్వహించిన బహిరంగ ర్యాలీలో పాల్గొన్న అమిత్‌షా మాట్లాడుతూ.. పొరుగు దేశం నుంచి రాష్ట్రంలోకి చొరబడిన బంగ్లాదేశీయులు ఇక్కడి ప్రజల సంస్కృతి, గుర్తింపులపై బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. అటువంటి వారిని కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా భావిస్తోందన్నారు. ఆ ఓటుబ్యాంకును రక్షించుకునేందుకే ప్రతిపక్ష కూటమి ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తోందని ఆరోపించారు.
అస్సాంలో కాంగ్రెస్ ఎన్నోఏళ్లు అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి చేయలేదని అమిత్ షా (ూఎఔ ూష్ట్రుష్ట్ర) అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ మాత్రం ప్రజల సాంస్కృతిక గుర్తింపును కాపాడటమే కాకుండా రాష్ట్ర సమగ్ర అభివృద్ధిపైనా దృష్టి పెట్టారన్నారు. బంగ్లాదేశ్ చొరబాటుదారులు ఆక్రమించుకున్న లక్షకు పైగా బిఘాల భూమిని ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విడిపించిందని అమిత్ షా అన్నారు. రాష్ట్రంలో పాగా వేసిన చొరబాటుదారులను పూర్తిగా నిర్మూలించడానికి భాజపాకు మరో అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. గత 11 ఏళ్లలో భాజపా ప్రభుత్వం రాష్ట్రంలోని పలు మిలిటెంట్ సంస్థలతో శాంతి ఒప్పందాలు చేసుకుందన్నారు.

## మహా రాజకీయాల్లో కీలక పరిణామం..



మహారాష్ట్ర రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. రెండేండ్ల క్రితం విడిపోయిన 'పవార్' కుటుంబం స్థానిక ఎన్నికల వేళ కలిసిపోయింది. మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ శరద్ పవార్ ఒక్కటయ్యారు. త్వరలో జరగబోయే పింప్రి-చించ్‌వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఎన్‌సీపీ (ఎస్పీ)-ఎన్‌సీపీ కలిసి పోటీ చేయనున్నాయి. ఈ విషయాన్ని అజిత్ పవార్ అధికారికంగా ప్రకటించారు. 'పవార్ పరివార్ (కుటుంబం) మళ్లీ కలిసింది' అని ప్రకటించారు. జనవరి 15న జరగబోయే ఎన్నికల్లో కలిసి పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం సీట్ల సర్దుబాటు జరుగుతోందని తెలిపారు. త్వరలో అధికారిక ప్రకటన వస్తుందని వెల్లడించారు. పార్టీ కార్యకర్తలు ఎన్నికల ప్రచారంపై దృష్టిపెట్టాలని సూచించారు. కాగా, ఇప్పటికే ఠాక్రే సోదరులు కలిసిపోయిన విషయం తెలిసిందే. సుమారు రెండు దశాబ్దాల తర్వాత ఠాక్రే సోదరులు ఏకమయ్యారు. విభేదాలతో విడిపోయిన శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే) పార్టీ చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ సేన అధ్యక్షుడు రాజ్ ఠాక్రే బుధవారం ఒకే వేదికపై కన్పించారు. వచ్చే నెలలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఇద్దరూ కలిసి పోటీ చేయనున్నట్టు ప్రకటించారు. ఇప్పుడు పవార్ ఫ్యామిలీ కూడా ఒక్కటి కావడంతో మహా రాజకీయాలు రసవత్తరంగా మారనున్నాయి.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137